www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శుక్రవారం | 2-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 305

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి సా. 4.04 తదుపరి అష్టమి; నక్షత్రం: స్వాతి తె. 5.58 తదుపరి విశాఖ; వర్జ్యం: ఉ.9.55-11.40; దుర్ముహూర్తం: ఉ.9.07-9.52, మ.12.52-1.37; అమృతఘడియలు: రా.8.23-10.07; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 6.07

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



చిరంజీవి నో.. వెంకటేశ్ ఎస్ ?





ఇండస్ట్రీలో ఒక హీరో నో చెప్పిన చిత్రాలకు మరో హీరో ఎస్ చెప్పడం పరిపాటే. తాజాగా టాలీవుడ్‌లోనూ అలాంటి సంఘటనే చోటు చేసుకుందని ఇండస్ట్రీ టాక్. దిల్ రాజు నిర్మాతగా దర్శకుడు అనిల్ రావిపూడి చిరంజీవి కోసం ఓ కథను సిద్ధం చేశారనే మాట కొన్నాళ్లుగా పరిశ్రమలో వినిపిస్తోంది. ప్రాజెక్ట్ కూడా దాదాపు ఓకే అయినట్లేనని భావించారు. కానీ ఆ కథ చిరంజీవిని మెప్పించలేకపోయిందనే మాట ప్రస్తుతం వినిపిస్తోంది. దాంతో వెంకటేశ్ దగ్గరకు వెళ్లిన అనిల్ రావిపూడి అదే కథను ఓకే చేయించుకున్నారనీ, త్వరలోనే అధికారిక ప్రకటన రావొచ్చని సమాచారం. అయితే ఇంతకీ ఆ కథలో చిరంజీవికి ఏం నచ్చలేదు, వెంకటేశ్‌కు ఏం నచ్చి ఓకే చేశారు అనేది ఆ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చి ప్రేక్షకుల ముందుకు వచ్చేవరకూ మిస్టరీగానే మిగిలిపోతుంది.

కొత్త ప్రపంచంలోకి వెళతారు



గీతానంద్

'ఇదొక యూనిక్ స్టోరీ. రెగ్యులర్‌గా కాకుండా కొత్తగా చూపించాలని ప్రయత్నించాం. లూజర్ నుంచి విన్నర్‌గా హీరో ఎలా మారాడు అనేది ఆసక్తికరంగా ఉంటుంది' అన్నారు గీతానంద్. ఆయన హీరోగా నటించిన 'గేమ్ ఆన్' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా గీతానంద్ మీడియాతో మాట్లాడుతూ' మా తమ్ముడు దయానంద్ డైరెక్టర్ కావడంతో స్క్రిప్ట్ విషయంలో ఇద్దరం బాగా చర్చించుకున్నాం. ఇద్దరం కలసి ఇంతకుముందు షార్ట్ ఫిల్మ్ చేశాం. ఈ సినిమా విషయంలో ఆ అనుభవం మాకు హెల్ప్ అయింది. నిర్మాత రవి కస్తూరి కూడా నాకు ఫ్రెండ్ కావడంతో ముగ్గురం కలసి చర్చించుకుని నిర్ణయాలు తీసుకొనేవాళ్లం. రియల్ టైమ్ సైకలాజికల్‌గా సాగే ఈ సినిమాతో ప్రేక్షకులు కొత్త గేమ్ వరల్డ్‌లోకి వెళ్లిపోతారు' అని చెప్పారు. సీక్వెల్ కోసం వేరే ప్లానింగ్ ఉందనీ, ఈ సినిమాకు వచ్చే రియాక్షన్ బట్టి దాన్ని ప్రకటిస్తామని తెలిపారు.



సుహాస్ హీరోగా దుష్యంత్ కటికినేని దర్శకత్వం వహించిన 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో హీరో విజయ్ దేవరకొండ ఈ చిత్రం బిగ్‌టికెట్‌ను రిలీజ్ చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.

పన్నెండు గుంజల పందిరి కింద



చైతన్యరావు, భూమిశెట్టి జంటగా నటించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. కుమారస్వామి దర్శకత్వంలో నాగార్జున సామల, శ్రీష్ కుమార్ గుండా, డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రం నుంచి 'పన్నెండు గుంజల పందిరి కింద' అంటూ సాగే గీతాన్ని దర్శకుడు శేఖర్ కమ్ముల చేతులు మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ పాట చూస్తుంటే తెలంగాణ మట్టి వాసన కనిపిస్తోంది. పెద్దింటి అశోక్ కుమార్ సాహిత్యం, సురేశ్ బొబ్బిలి సంగీతం ఆకట్టుకున్నాయి. ఇకపై ప్రతిపెళ్లిలో ఈ పాట వినిపిస్తుంది' అన్నారు. మా సినిమాకు ఈ పాట ప్రత్యేకాకర్షణ అవుతుందని దర్శకుడు తెలిపారు.

ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో...

'బిగ్‌బాస్' అమర్‌దీప్ హీరోగా, నటి సురేఖా వాణి కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా నటించే చిత్రం షూటింగ్ గురువారం ప్రారంభమైంది. హీరోహీరోయిన్లపై చిత్రీకరించిన తొలి షాట్‌కు నిర్మాత ఎ.ఎం.రత్నం కెమెరా స్విచ్ ఆన్ చేయగా, బసిరెడ్డి క్లాప్ ఇచ్చారు. వీరశంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ 'భారతీయ సినిమా చరిత్రలో ఇంతవరకూ ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో ఈ సినిమా తీస్తున్నాం' అని చెప్పారు. 'బిగ్‌బాస్' హౌస్‌లోకి వెళ్లకముందే ఈ సినిమాకు సైన్ చేసినట్లు హీరో అమర్‌దీప్ చెప్పారు. నటి సురేఖా వాణి మాట్లాడుతూ 'ఈ ప్రాజెక్ట్ విన్న తర్వాత వీళ్ల చేస్తారా లేదా అనే అనుమానం వచ్చింది. దర్శకనిర్మాతల మీద నమ్మకంతోనే నా బిడ్డను వాళ్ల చేతులో పెట్టా' అన్నారు. ఈ చిత్రానికి మాటలు: మరుధూరి రాజా, ఫొటోగ్రఫీ: బాల సరస్వతి.



విశ్వంభర కోసం సన్నద్ధం



చిరంజీవి కథానాయకుడిగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'విశ్వంభర'. రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుండడంతో చిత్రీకరణలో పాల్గొనేందుకు చిరంజీవి సన్నద్ధమవుతున్నారు. సరికొత్త లుక్‌లో కనిపించేందుకు జిమ్‌లో కసరత్తు మొదలుపెట్టారు. దీనికి సంబంధించిన వీడియోను గురువారం ఆయన సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. 'విశ్వంభర' కోసం సిద్ధమవుతున్నానని ఆ వీడియోలో చిరంజీవి తెలిపారు. యువీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ భారీస్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఎం. ఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఛోటా కే నాయుడు సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




భారత్‌కు 31 సాయుధ డ్రోన్లు

విక్రయానికి అమెరికా ఆమోదం

సుమారు రూ.33వేల కోట్ల వ్యయం

7

శుక్రవారం | 2-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 305 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్



మొత్తం బడ్జెట్	47,65,768 కోట్లు
పన్ను రాబడి	26,01,574 కోట్లు
అప్పులు	16,85,494 కోట్లు

ఈ బడ్జెట్ దేశాభివృద్ధి కొనసాగింపునకు గ్యారెంటీ. దేశాభివృద్ధికి పడిన పునాదులను మరింత బలోపేతం చేస్తుంది. ఇది మధ్యంతర బడ్జెట్ కాదు.. సృజనాత్మక, సమ్మిళిత బడ్జెట్. యువత, పేద, మహిళలు, రైతుల సాధికారతకు దోహదపడుతుంది. యువ భారత్ ఆకాంక్షలను ప్రతిబింబిస్తోంది.

\- ప్రధాని నరేంద్ర మోదీ

వరాలు.. వాతలు లేకుండానే.. ఓట్లాటకు సై

బడ్జెట్ ప్రసంగంలోనే గెలుపుపై ధీమా.. పదేళ్ల 'ప్రగతి' చూసి ఓటేయాలని సంకేతం

- కేంద్రం 'మధ్యంతర' బడ్జెట్.. వరాల్లేవు.. వాతల్లేవు
- మధ్య తరగతి గృహ నిర్మాణానికి కొత్త పథకం
- ఆవాస యోజన కింద మరో 2 కోట్ల ఇళ్లు
- 300 యూనిట్ల వరకూ ఉచిత సోలార్ విద్యుత్తు
- రైల్వేలో ఇంధన, మినరల్, సిమెంట్‌కు కారిడార్లు
- వందే భారత్ స్థాయికి మరో 40 వేల బోగీలు
- వెయ్యికిపైగా విమానాల కొనుగోలుకు ఆర్డర్లు
- స్టార్టప్‌ల ప్రారంభానికి లక్ష కోట్ల కార్పస్ ఫండ్
- దేశవ్యాప్తంగా ఐదు ఆక్వా పార్కుల ఏర్పాటు
- 9-14 ఏళ్ల బాలికలకు సర్వైకల్ క్యాన్సర్ టీకా
- ఆయుష్మాన్ భారత్‌లోకి అంగన్వాడీలు, ఆశాలు
- రాష్ట్రాలకు రూ. 1. 3 లక్షల కోట్ల వడ్డీ లేని రుణాలు

(న్యూఢిల్లీ - ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ముందు మరో 'బడ్జెట్ బండి' దూసుకొచ్చింది. 'ఓటాన్' బడ్జెట్ కాస్తా మధ్యంతర బడ్జెట్‌గా మారిపోయింది. పదేళ్ల 'ప్రగతి'పై వివరణ! వరాలూ... వడ్డింపులు లేకుండా... అందమైన భవిష్యత్ వర్ణనతో బడ్జెట్ కథా చిత్రం రక్తి కట్టింది. గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజాకర్షక ప్రకటనలు ఉంటాయని... వేతన జీవికి భారీ ఊరట లభిస్తుందని... పెట్రో ధరల మంట తగ్గుతుందని ఆశించిన వారికి నిరాశే విఁగిలింది. 'అయోధ్య రాముడి' ఆశీస్సులు మెండుగా ఉన్నాయనుకున్నారేమోగానీ... ఓటరు దేవుడికి మాత్రం ఒట్టి చెయ్యే చూపించారు. గత ఎన్నికల ముందు కూడా మధ్యంతర బడ్జెట్‌నే ప్రవేశపెట్టారు. అప్పట్లో స్టాండర్డ్

మిగతా 11వ పేజీలో...

వడ్డీ చెల్లింపులు	11.90 లక్షల కోట్లు
రక్షణ బడ్జెట్	6.1 లక్షల కోట్లు
సబ్సిడీలకు	3,80,925 కోట్లు
రవాణా, రోడ్లకు	2.78 లక్షల కోట్లు
రైల్వే బడ్జెట్	2,55,393 కోట్లు
ఆహారం, ప్రజాపంపిణీ	2.13 లక్షల కోట్లు
గ్రామీణాభివృద్ధి	1.77 లక్షల కోట్లు
ఎరువులు, రసాయనాలు	1.68 లక్షల కోట్లు
వ్యవసాయశాఖ	1,27,469.88 కోట్లు
విద్యా రంగం	1,20,627 కోట్లు
ఆరోగ్యం, కుటుంబసంక్షేమం	90,658.63 కోట్లు
ఆధునిక రంగాల్లో పరిశోధనలు	లక్ష కోట్ల నిధి
రాష్ట్రాలకు ఇచ్చేది	22,22,264 కోట్లు
మహిళ, శిశు అభివృద్ధి	26 వేల కోట్లు
నదుల అనుసంధానం	3,500 కోట్లు

గ్యారంటీల్లో మరో 2

వెంటనే అమలు.. బడ్జెట్‌లో నిధులు: సీఎం రేవంత్



ఐపీఎస్ ఆఫీసర్ల గెట్‌టుగెదర్ కార్యక్రమంలో డీజీపీ రవి గుప్తా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు

- రూ.500కే గ్యాస్, ఉచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇళ్లు
- ఈ మూడు పథకాల్లో రెండింటి అమలుకు ప్రణాళిక
- అర్హులందరికీ పథకాలు అందాలి.. ఎవ్వరూ నష్టపోవద్దు
- దరఖాస్తుల్లో తప్పులను సరిదిద్దుకునే చాన్స్ ఇవ్వండి
- లేనిపోని నిబంధనలతో ఇబ్బంది పెట్టొద్దు
- ప్రజాపాలన దరఖాస్తులపై సమీక్షలో ముఖ్యమంత్రి
- అధికారులు ప్రజలను వేధిస్తే వేటు తప్పదని హెచ్చరిక
- పాలమూరు జిల్లాలో వ్యవసాయ కనెక్షన్ల తనిఖీలపై ఫైర్
- డైరెక్టర్‌ను తొలగించాం, ఎస్ఈని బదిలీ చేశాం: భట్టి
- నేడు ఇంద్రవెల్లికి సీఎం.. లోక్‌సభ ఎన్నికల శంఖారావం

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మరో రెండు గ్యారంటీలను అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ప్రధానంగా రూ.500కే గ్యాస్ సిలిండర్ పంపిణీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేసే ప్రక్రియపై సర్కారు దృష్టి సారించింది. ఈ మూడు పథకాల్లో రెండింటిని వెంటనే అమలు చేసే యోచనలో ఉంది. ఈ గ్యారంటీల అమలుకు ఎంత బడ్జెట్ అవుతుందో సమగ్ర వివరాలతో సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయా శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో నిర్వహించనున్న బహిరంగ సభలో రెండు పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించే అవకాశం ఉంది. ఈ మేరకు గురువారం సచివాలయంలో క్యాబినెట్ సబ్‌కమిటీ మంత్రులు, ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. గ్యారంటీల అమలుకు సంబంధించి కార్యాచరణపై వారితో చర్చించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ లబ్ధి చేకూరేలా గ్యారంటీలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా.. రూ.500కు గ్యాస్ సిలిండర్ పంపిణీ, అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు

మిగతా 2వ పేజీలో...

10 వేల మంది విద్యార్థుల సాంకేతిక శిక్షణకు సహకరించండి

బీఎఫ్ఎస్ఐ ప్రతినిధులను కోరిన సీఎం

2

ఒక్కో నియోజకవర్గానికి 10 కోట్లు మంజూరు

- 119 నియోజకవర్గాలకు రూ. 1,190 కోట్ల ఎస్డీఎఫ్
- ఇన్‌చార్జి మంత్రుల అనుమతితో అభివృద్ధి పనులు
- ప్రతి నియోజకవర్గంలో రూ. 2 కోట్లు పాఠశాలలకు.. తాగునీటికి కోటి, కలెక్టరేట్ల నిర్వహణకు 50 లక్షలు



అసెంబ్లీలో గురువారం గజ్వేల్ ఎమ్మెల్యేగా ప్రమాణం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్. చిత్రంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

కాంగ్రెస్ వలలో పడొద్దు

- పనుల కోసం కొందరు రేవంత్‌ను కలుస్తున్నారు
- పనులు చేయకపోగా.. బద్నామ్ చేస్తారు.. జాగ్రత్త
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను హెచ్చరించిన కేసీఆర్
- రుణమాఫీపై రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారు
- ప్రభుత్వం చాలా సవాళ్లను ఎదుర్కొనాల్సి ఉంది
- ఉంటుందా? ఉండదా? అనేది వారి చేతుల్లోనే!
- ఏడాదిలోపే ప్రజల్లో భ్రమలు తొలగుతాయి
- లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరి పోరు
- బడ్జెట్ సమావేశాలకు హాజరవుతా: కేసీఆర్
- ఎమ్మెల్యేగా ప్రమాణం.. బీఆర్ఎస్ఎల్పీ బాధ్యతలు
- నేడు తెలంగాణ భవన్‌కు వెళ్లనున్న మాజీ సీఎం

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ పట్ల తమ పార్టీ విధానంలో ఎటువంటి మార్పు ఉండబోదని, దీనిపై అనవసరమైన చర్చలు వద్దని.. లోక్‌సభ ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తులేకుండా పోరాడతామని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. బీజేపీతో కలిసి బీఆర్ఎస్ పోటీ చేస్తుందని జరుగుతున్న ప్రచారాలను నిలువరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. అయితే, రాష్ట్రంలో బీజేపీ బలపడిందని.. దీంతో పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య త్రిముఖ పోటీ ఉంటుందని కేసీఆర్ అన్నారు. గురువారం ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం హైదరాబాద్ నందినగర్‌లోని నివాసంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులతో కేసీఆర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై సూచనలు చేశారు. ఎమ్మెల్యేలెవరూ కాంగ్రెస్ వలలో పడొద్దని సూచించారు. 'కొందరు ఏదో చేస్తారన్న ఉద్దేశంతో.. సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తున్నారు. వారు అనుకున్నట్లు ఏమీ చేయకపోగా.. ప్రజల్లో రాజకీయంగా బద్నాం చేస్తారు.. జాగ్రత్తగా ఉండండి.. ఇకమీదట అలాంటి పనులు

మిగతా 7వ పేజీలో...


500 ఎకరాల్లో ఏఐ హబ్!


ప్రముఖ అంతర్జాతీయ దిగ్గజ కంపెనీల భాగస్వామ్యంతో ఏర్పాటు యోచన

- త్వరలో హైదరాబాద్‌లో 'గ్లోబల్ ఏఐ సమ్మిట్'
- రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో స్కిల్ యూనివర్సిటీ
- ప్రణాళిక సిద్ధం చేస్తున్న సర్కారు

హైదరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌ను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) హబ్‌గా మార్చే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఈ హబ్‌ను 500 ఎకరాల్లో నెలకొల్పాలని భావిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాలు ఏఐ టెక్నాలజీని ఇప్పటికే విస్తృతంగా వినియోగిస్తున్నాయి. చాట్ జీపీటీని అభివృద్ధి చేసిన ఓపెన్ ఏఐవంటి సంస్థలు ఈ రంగంలో నానాటికీ సరికొత్త ఆవిష్కరణలకు పదును పెడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏఐ రంగంలో హైదరాబాద్ ప్రపంచానికే తలమానికంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా ఏఐ హబ్ ఏర్పాటు గురించి తమ ఆలోచనలను ప్రపంచానికి తెలియజేసేందుకు త్వరలో హైదరాబాద్‌లో 'గ్లోబల్ ఏఐ సమ్మిట్'ను ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ విషయాన్ని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గత నెలలో ఇన్ఫోసిస్‌లో నిర్వహించిన ఉన్నత స్థాయి ప్రతినిధుల సమావేశంలో ప్రకటించారు. హెచ్ఐసీసీలో నిర్వహించే ఈ సమ్మిట్ తేదీలను త్వరలో ప్రకటించనున్నారు. ఇందులో సీఎం రేవంత్ రెడ్డి.. ఏఐ హబ్ గురించి ప్రకటిస్తారని ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి. ఏఐ టెక్నాలజీకి ప్రాధాన్యం ఇవ్వాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం 2020ను ఏఐ సంవత్సరంగా ప్రకటించింది. ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఉన్నత విద్యలో కొత్తగా ఏఐ కోర్సులు తీసుకురావాలని అధికారులు

మిగతా 2వ పేజీలో...





టాలీవుడ్ డ్రగ్స్ కేసులో ఎక్సైజ్ శాఖకు ఎదురు దెబ్బ!

- ఆరింటిని కొట్టివేసిన నాంపల్లి కోర్టు
- పూరి, తరుణ్ శరీరాల్లో డ్రగ్స్ ఆనవాళ్లు లేవు
- దర్యాప్తు అధికారులు ప్రొసీజర్‌ను పాటించలేదు
- డ్రగ్స్ తీసుకున్నారనడానికి సాక్ష్యాధారాల్లేవు: కోర్టు

2

ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయండి

- చంపయి సోరెన్‌కు ఝార్ఖండ్ గవర్నర్ ఆహ్వానం
- అంతకు ముందు తీవ్ర నాటకీయ పరిణామాలు
- ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించాలంటూ గవర్నర్‌కు జేఎంఎం ప్రతినిధి బృందం విజ్ఞప్తి
- కూటమి ఎమ్మెల్యేలను హైదరాబాద్ తరలించే యత్నం

రాంచీ, ఫిబ్రవరి 1: ఝార్ఖండ్‌లో రాజకీయ గందరగోళానికి ఎట్టకేలకు తెరపడింది. గురువారం ఝార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ జేఎంఎం శాసనసభాపక్ష నేత చంపయి సోరెన్‌ను ముఖ్యమంత్రిగా నామినేట్ చేశారు. ప్రమాణ స్వీకారానికి రావాలని ఆహ్వానించారు. ఈ మేరకు గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ నితిన్ మదన్ కులకర్ణి గురువారం రాత్రి విలేకరులకు తెలిపారు. ప్రమాణ స్వీకారానికి రావాలని ఆహ్వానించామని, ఎప్పుడు ప్రమాణం చేయాలనేది వారే నిర్ణయించుకోవాల్సి ఉందని చెప్పారు. కాగా, గురువారం ఉదయం జేఎంఎంఎల్పీ నేత


మిగతా 7వ పేజీలో...



కోర్టులో ప్రవేశపెట్టిన అనంతరం హేమంత్ సోరెన్‌ను అదుపులోకి తీసుకుంటున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ప్రాజెక్టుల అప్పగింతపై చెరోమాట!

- ప్రాజెక్టుల్ని కృష్ణా బోర్డుకు అప్పగిస్తున్నాం
- ఇరిగేషన్ ఈఎన్‌సీ మురళీధర్ ప్రకటన
- వాటాలు తేలే వరకు అప్పగించేదే లేదు
- కార్యదర్శి రాహుల్ బొజ్జా లేఖ విడుదల
- చర్చనీయాంశమైన విరుద్ధ ప్రకటనలు
- బోర్డు నియంత్రణలోకి సాగర్, శ్రీశైలం సహా 10 కాంపోనెంట్లు
- కేఆర్ఎంబీ భేటీలో 2 రాష్ట్రాల అంగీకారం
- కమిటీ నిర్ణయం మేరకే నీటి విడుదల
- సాగర్ వద్దే సీఆర్‌పీఎఫ్‌ను మోహరించాలని నిర్ణయం



హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్‌లోని ఉమ్మడి ప్రాజెక్టుల అప్పగింతపై స్పష్టత లేకుండాపోయింది. తెలంగాణ నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు తలోరకంగా స్పందించడంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కు అప్పగించాలని నిర్ణయం తీసుకున్నట్లు ఈఎన్‌సీ సి.మురళీధర్ స్పష్టం చేయగా.. అదేమీ లేదన్నట్లుగా.. నీటి వాటాలను తేల్చిన తర్వాతే నిర్ణయం ఉంటుందని నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఇటీవల కేంద్రానికి రాసిన లేఖను విడుదల చేశారు. ప్రాజెక్టుల అప్పగింతపై ఉన్నతాధికారులు ఇలా పరస్పర విరుద్ధంగా స్పందించడంతో

మిగతా 2వ పేజీలో...

ప్రభుత్వ సలహాదారుగా హర్కర వేణు గోపాల్ బాధ్యతల స్వీకరణ



హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా హర్కర వేణు గోపాల రావు నియమితులయ్యారు.గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో వేద పండితుల సంప్రదాయ పూజల అనంతరం హర్కర పదవీ బాధ్యతలు చేపట్టారు. సలహాదారుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన హర్కరను పలువురు అధికారులు పూల గుచ్చాలతో అభినందించి, ఘనంగా సన్మానించారు.

ఔటర్ చుట్టూ భూములను వినియోగంలోకి తేవాలి

» హైదరాబాద్‌ను క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా మార్చాలి: భట్టి

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగు రోడ్డు చుట్టూ ఉన్న భూములను వినియోగంలోకి తేవాలని డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్తు శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై గురువారం ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి సంబంధించి నాలుగు అంశాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందని తెలిపారు. హైదరాబాద్ ఖ్యాతిని పెంచడం, డ్రగ్స్ ఫ్రీ నగరంగా మార్చడం, గ్రీన్ అండ్ క్లీన్ సిటీగా తీర్చిదిద్దడం, మూసీని ప్రక్షాళన చేయడం అనే నాలుగు ప్రధాన లక్ష్యాలని వివరించారు. క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా మార్చడంలో భాగంగా మురుగు నీటి కాలువల నిర్మాణానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. మూసీ నది ప్రక్షాళన పనులను జూన్ నాటికి పూర్తి చేసి సుందరీకరించాలన్నారు. 2031 మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్ల విస్తరణకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో మార్కు చేయాలని సూచించారు.

గద్దర్ పేరుతో అవార్డులు చరిత్రాత్మక నిర్ణయం

» సీఎంకు గద్దర్ ఫౌండేషన్ సభ్యుల కృతజ్ఞతలు

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం కళాకారులకు ఇచ్చే నంది అవార్డులను గద్దర్ అవార్డులుగా మార్చడం పట్ల గద్దర్ ఫౌండేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కళాకారులకు నంది అవార్డులు ఇచ్చినట్టుగా ఇక నుంచి గద్దర్ జయంతి రోజున ప్రభుత్వం కళారంగ ప్రముఖులకు గద్దర్ అవార్డులు ప్రదానం చేసేలా చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి గద్దర్ ఫౌండేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ ఆకాంక్ష నెరవేరలేదు: కోదండరాం

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 1: తెలంగాణ వచ్చినా ప్రజల ఆకాంక్ష నెరవేరలేదని తెలంగాణ జనసమితి (టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం అన్నారు. సంగారెడ్డిలోని జడ్పీ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన ఆత్మీయ సన్మాన సభలో ఆయన మాట్లాడారు. అంతకుముందు పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహం వద్ద తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమం కేవలం నీళ్లు, నిధులు, నియామకాల కోసమే రాలేదని, ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని భావించి ప్రతి ఒక్కరూ రాష్ట్ర సాధనలో ఉద్యమించారన్నారు. తెలంగాణ ఏర్పడి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యమకారులను అణచివేసి వారిపై అక్రమ కేసుల్ని బనాయించారని ఆరోపించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని కేసీఆర్ రాష్ట్రాన్ని కొల్లగొట్టారని మండిపడ్డారు. ప్రజలు మార్పు కోరుకున్నారు కాబట్టే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా లొంగకుండా నియంత కేసీఆర్‌కు బుద్ధి చెప్పారన్నారు. అనంతరం కోదండను ఘనంగా సన్మానించారు.

ప్రజాభవన్ ఎదుట ఆటోకు నిప్పు!

» గిరాకీ లేదని ఆటోడ్రైవర్ మనస్తాపం




పంజాగుట్ట, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి పథకం అమలుతో ఆటో కిరాయిలు దొరకట్లేదని మనస్తాపం చెందిన ఓ ఆటో డ్రైవర్ గురువారం ప్రజాభవన్ ముందే తన వాహనంపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో అక్కడ ఒక్కసారిగా హైటెన్షన్ నెలకొంది. అప్రమత్తమైన పోలీసులు ఆ ఆటోడ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని మంటలను ఆర్పేశారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన దేవ్ల (45)మియాపూర్‌లో నివాసముంటూ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో కొంతకాలంగా ఆటోకు గిరాకీ లేకుండా పోయింది. దీంతో చేసిన అప్పులు తీర్చలేక.. కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలోనే తన ఆటో తోలుకుంటూ బేగంపేట ప్రజాభవన్ వద్దకు వచ్చాడు. ఆటో దిగి వాహనంపై పెట్రోల్ చల్లి నిప్పంటించాడు. పోలీసు సిబ్బంది అప్రమత్తమై అతడిని అదుపులోకి తీసుకొని మంటలను ఆర్పేశారు. అప్పటికే ఆటో పైభాగం, సీట్లు కాలిపోయాయి. దేవ్లను పంజాగుట్ట పీఎస్‌కు తరలించారు. మద్యం మత్తులోనే ఈ పనికి ఒడిగట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

మా ఆవిడ నన్ను నమ్మలేదు

» ఒకటో తేదీనే జీతం అందడంపై ఓ ప్రభుత్వ ఉద్యోగి పోస్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఏమోయ్.. నా జీతం వచ్చేసింది.. అని ఓ ప్రభుత్వ ఉద్యోగి చెబితే ఆయన భార్య నమ్మలేదట..ఒకటో తేదీ కావడమే ఇందుకు కారణం..!! ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగికి ఎదురైన అనుభవం ఇది. తన బ్యాంకు ఖాతాలో గురువారం (ఫిబ్రవరి 1) జీతం జమైన సంగతిని ఆ ఉద్యోగి తన భార్యకు చెబితే ఆమె నమ్మలేదు. ఇదే విషయాన్ని ఎక్స్(ట్విటర్)లో పోస్టు చేసిన సదరు ఉద్యోగి.. ఒకటో తేదీనే జీతం ఇచ్చిన సీఎం రేవంత్‌కు, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. వైరల్ అయిన ఈ పోస్ట్‌కు సీఎం పీఆర్వో అయోధ్యరెడ్డి కూడా స్పందించారు. "ఒకటో తారీఖునే నెల జీతం జమ, ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబాల్లో ఆనందం, 50రోజుల్లోనే ఎంత మార్పు.. ఇదేకదా ప్రజాపాలన" అంటూ సదరు ఉద్యోగి పోస్టును రీపోస్ట్ చేశారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పల్లె నాగేశ్వరరావు



హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం తరఫున హైకోర్టులో ప్రాతినిధ్యం వహించే పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పల్లె నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. అలాగే, పి.శ్రీధర్ రెడ్డి, ఐవీ సిద్ధివర్ధన, రాహుల్‌రెడ్డి, ఎం రామకృష్ణ, స్వరూప్‌ను స్పెషల్ జీపీలుగా నియమిస్తూ న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్ల పాటు ఈ పదవుల్లో కొనసాగనున్న స్పెషల్ జీపీలు.. అడ్వకేట్ జనరల్ ఆధ్వర్యంలో పనిచేయవలసి ఉంటుంది.

గ్యారంటీల్లో మరో రెండు

(మొదటి పేజీ తరువాయి)

పథకాల్లో రెండింటిని తక్షణమే అమలు చేద్దామని, ఇందుకోసం సన్నాహాలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ బడ్జెట్‌లోనే వాటికి నిధులు కేటాయించాలని ఆర్థిక శాఖకు సూచించారు. అసెంబ్లీ సమావేశాల్లోపు మరోసారి క్యాబినెట్ సబ్‌కమిటీతో సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా, ఐదు గ్యారంటీలకు ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులను స్వీకరించగా.. మొత్తం 1,09,01,255 దరఖాస్తులు వచ్చినట్లు సీఎంకు అధికారులు నివేదించారు. ఇందులో 2.82 లక్షల డూప్లికేట్ దరఖాస్తులను గుర్తించినట్లు పేర్కొన్నారు. జనవరి 12 నాటికే వీటికి సంబంధించిన డేటా ఎంట్రీ పూర్తయిందని చెప్పారు.

అర్హులెవరూ నష్టపోకుండా చూడాలి..

ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల్లో కొందరు ఒకే పేరుతో రెండు మూడు దరఖాస్తులు సమర్పించారని, కొన్నింటికి ఆధార్, రేషన్ కార్డు నంబర్లు లేవని అధికారులు వివరించారు. దీంతో అలాంటి దరఖాస్తులను మరోసారి పరిశీలించాలని, అవసరమైతే క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అర్హులెవరూ నష్టపోకుండా ఒకటికి రెండుసార్లు సరి చూడాలన్నారు. దరఖాస్తుల్లో తప్పులుంటే వాటిని సరిదిద్దుకునేందుకు ఎంపీడీవో ఆఫీసుల్లోగానీ, తదుపరి నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంలోగానీ మరోసారి అవకాశమిచ్చే ఏర్పాట్లు చేయాలన్నారు.

ప్రజలను వేధిస్తే వేటు వేస్తాం..

ప్రజలను ఇబ్బంది పెట్టి ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించే అధికారులపై కఠినంగా ఉంటామని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అధికారులు తమకు తోచినట్లుగా సొంత నిర్ణయాలు తీసుకుంటే సహించేది లేదన్నారు. ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లాలో రైతుల వ్యవసాయ కనెక్షన్లపై తనిఖీలు చేయడంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల వ్యవసాయ కనెక్షన్లపై సర్వే చేయాలని చెప్పిందెవరు? తనిఖీ చేయాలని ఆర్డర్లు ఇచ్చిందెరు? అని ట్రాన్స్‌కో సీఎండీ రిజ్వీని ప్రశ్నించారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకున్నారా? లేదా? అని ఆరా తీశారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి, విద్యుత్తు శాఖ మంత్రి భట్టి విక్రమార్క స్పందిస్తూ.. వ్యవసాయ కనెక్షన్ల తనిఖీ, సర్వే చేసిన విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. శాఖాపరమైన నిర్ణయమేదీ లేకుండానే డిస్కం డైరెక్టర్ (ఆపరేషన్స్) జె.శ్రీనివాస్‌రెడ్డి సొంతంగా ఆదేశాలు ఇచ్చారని, ఆయన ఆదేశాల మేరకు అక్కడున్న జిల్లా ఎస్ఈ ఎన్.శ్రీరామమూర్తి ఈ చర్యకు పాల్పడ్డారని తెలిపారు. ఈ వ్యవహారంలో డైరెక్టర్ శ్రీనివాసరెడ్డిని విధుల నుంచి తొలగించామని, ఎస్ఈని బదిలీ చేశామని వివరించారు.



న్యూడెవలప్‌మెంట్ బ్యాంక్ డైరెక్టర్ జనరల్ పాండియన్‌తో రేవంత్‌రెడ్డి

పోలీసులపై ప్రభుత్వ పెత్తనం ఉండదు

ఆర్థికంగా, సామాజికంగా విధ్వంసమైన తెలంగాణను పునర్‌నిర్మించాల్సిన అవసరం ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందులో పోలీసులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పోలీసులపై ప్రభుత్వ పెత్తనం ఉండబోదని, పోలీసులను సబార్డినేట్‌లుగా చూసే పద్ధతి తమ ప్రభుత్వంలో ఉండదని స్పష్టం చేశారు. గురువారం ఐపీఎస్ ఆఫీసర్ల గెట్ టుగెదర్ కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజలకు సేవ చేయడంలో అందరినీ కలుపుకొనిపోతామని, రాష్ట్ర అభివృద్ధి, పునర్‌నిర్మాణంలో పోలీసులు ఇచ్చే సలహాలు, సూచనలు వినమ్రంగా స్వీకరిస్తామని సీఎం చెప్పారు. రాష్ట్రంలో డ్రగ్స్ విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని, హైదరాబాద్‌ను డ్రగ్స్ ఫ్రీ సిటీగా మార్చాలని సూచించారు.

నేడు ఇంద్రవెల్లిలో రేవంత్ సభ

ఆదిలాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలోని ఇంద్రవెల్లిలో నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొననున్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి సీఎం ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టనున్నట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ గురువారం ప్రకటించారు. ఇంద్రవెల్లి ప్రాంతం రేవంత్‌రెడ్డికి సెంటిమెంట్‌గా మారింది. గతంలో టీపీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత తొలిసారి 2021 ఆగస్టు 9న ఇంద్రవెల్లిలోనే దళిత గిరిజన దండోరా పేరిట భారీ బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభ సక్సెస్ కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలోనే రేవంత్‌రెడ్డి సీఎం హోదాలో తొలిసారిగా శుక్రవారం ఇంద్రవెల్లికి వస్తున్నారు. రేవంత్ సొంతంగా రూ.15 లక్షల నిధులతో నాగోబా ఆలయ ప్రాంగణంలో నిర్మించిన మురాడి ఆలయాన్ని ప్రారంభిస్తారు. అనంతరం ఇంద్రవెల్లి అమరవీరుల స్మృతివనం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. కాగా, ఇంద్రవెల్లి నుంచే మరో రెండు గ్యారెంటీల అమలుపై సీఎం ప్రకటన చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

ఒక్కో నియోజకవర్గానికి 10 కోట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి వీలుగా నిధులు కేటాయించింది. 10 పాత ఉమ్మడి జిల్లాలవారీగా ఇదివరకే ఇన్‌చార్జి మంత్రులను నియమించిన ప్రభుత్వం... తాజాగా నియోజకవర్గాలకు నిధులు కేటాయించింది. ఇన్‌చార్జి మంత్రుల అనుమతులతో అభివృద్ధి పనులు మంజూరు చేయనుంది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఒక్కో నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున కేటాయించింది. ఇలా రాష్ట్రంలోని మొత్తం 119 నియోజకవర్గాలకు 'స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్)' కింద రూ.1,190 కోట్లు మంజూరు చేసింది. ఒక్కో నియోజకవర్గానికి కేటాయించిన రూ.10 కోట్లలో రూ.2 కోట్లను నియోజకవర్గంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేకించింది. రూ.కోటిని తాగునీటి వసతులకు, రూ.50 లక్షలను కలెక్టరేట్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు ప్రత్యేకించింది. ఈ నిధులతో చేపట్టే పనుల కోసం ఇన్‌చార్జి మంత్రుల ద్వారా అనుమతులు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించింది.

ఇన్‌చార్జి మంత్రి	ఉమ్మడి జిల్లా	నియోజకవర్గాలు	నిధులు కోట్లలో
ఉత్తమ్‌కుమార్‌రెడ్డి	కరీంనగర్	13	130
డి.రాజనర్సింహ	మహబూబ్‌నగర్	14	140
కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి	ఖమ్మం	10	100
డి.శ్రీధర్‌బాబు	రంగారెడ్డి	14	140
శ్రీనివాస్‌రెడ్డి	వరంగల్	12	120
పొన్నం ప్రభాకర్	హైదరాబాద్	15	150
కొండా సురేఖ	మెదక్	10	100
సీతక్క	ఆదిలాబాద్	10	100
తుమ్మల నాగేశ్వరరావు	నల్లగొండ	12	120
జూపల్లి కృష్ణారావు	నిజామాబాద్	9	90
మొత్తం		119	1190

లోకం తీరు



మెట్రో రెండో దశ ఏర్పాటుకు నిధులివ్వండి

» న్యూడెవలప్‌మెంట్ బ్యాంక్ డీజీ పాండియన్‌ను కోరిన రేవంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మెట్రో రైల్ రెండో దశ ప్రాజెక్టుకు, రాష్ట్రంలో శిక్షణ, సాంకేతిక నైపుణ్యాలు అందించే శిక్షణ సంస్థల ఏర్పాటుకు సహకరించాలని న్యూడెవలప్‌మెంట్ బ్యాంక్ డైరెక్టర్ జనరల్ పాండియన్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. గురువారం సచివాలయంలో సీఎంతో పాండియన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల నిర్మాణానికి, విద్యాసంస్థల వసతి గృహాలు, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే గృహ నిర్మాణాలు, వేస్టేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించాలని సీఎం కోరారు. అనంతరం పాండియన్ మాట్లాడుతూ.. రాష్ట్ర పురోభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

10 వేల మంది విద్యార్థులకు శిక్షణ

ఉపాధి కల్పనలో శిక్షణ, నైపుణ్యాల అభివృద్ధి అత్యంత కీలకమని రేవంత్ రెడ్డి అన్నారు. బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ) కన్సార్షియం ప్రతినిధులు గురువారం సచివాలయంలో సీఎంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ వారితో మాట్లాడారు. ఇంజినీరింగ్, బిజినెస్ రంగాల్లో సాంకేతిక నిపుణుల తయారీకి బీఎఫ్ఎస్ఐ కీలక పాత్ర పోషించాలని అన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి 5 వేల మంది ఇంజినీరింగ్, 5 వేల మంది బిజినెస్ గ్రాడ్యుయేట్లకు తగిన సాంకేతిక శిక్షణ ఇచ్చేందుకు బీఎఫ్ఎస్ఐ సహాయ సహకారాలు అందించాలని కోరారు.

టాలీవుడ్ డ్రగ్స్ కేసులో.. ఎక్సైజ్ శాఖకు ఎదురు దెబ్బ!

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టించిన టాలీవుడ్ డ్రగ్స్ కేసులో ఎక్సైజ్ శాఖకు కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. 2017లో సికింద్రాబాద్‌కు చెందిన కెల్విన్ పట్టుబడ్డాక.. డ్రగ్స్ కేసు కాస్తా టాలీవుడ్ చుట్టూ తిరిగింది. అప్పట్లో ఎక్సైజ్ అధికారులు 12 కేసులను నమోదు చేశారు. కేసు తీవ్రత దృష్ట్యా అప్పటి ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ దర్యాప్తునకు సూపరింటెండెంట్ స్థాయి అధికారి నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేశారు. ఎనిమిది కేసుల్లో దర్యాప్తు అధికారులు నాంపల్లి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. వీటిల్లో ఆరు కేసులకు సంబంధించి ప్రొసీజర్‌ను అనుసరించలేదని, సరైన సాక్ష్యాధారాలను సమర్పించలేదని కోర్టు గురువారం వ్యాఖ్యానించింది. తరుణ్, పూరి జగన్నాథ్‌ల ఎఫ్ఎస్ఎల్ నివేదికలు కోర్టుకు అందగా.. వాటిల్లో డ్రగ్స్ తీసుకున్న ఆనవాళ్లు లేవని తేలింది. మిగతా వారి విషయంలోనూ సాక్ష్యాధారాలు లేకపోవడంతో..ఆరు కేసులను కొట్టివేస్తున్నట్లు కోర్టు ప్రకటించింది.

15 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చండి

కేంద్ర మంత్రి గడ్కరీకి మంత్రి కోమటిరెడ్డి విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ముఖ్యమైన 15 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని జాతీయ రహదారులు, కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వాటిలో మొదటి ప్రాధాన్యంగా 6 రహదారులను జాతీయ రహదారులుగా 2024-25 వార్షిక ప్రణాళికలో పెట్టి అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం జాతీయ రహదారి కోసం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాలని విన్నవించారు. గురువారం గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి భేటీ అయ్యారు. రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ భాగంపై డీపీఆర్‌ను అందజేశారు.ఆర్ఆర్ఆర్ పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను కేంద్ర మంత్రి ఆదేశించినట్లు వెంకటరెడ్డి చెప్పారు.

ప్రాజెక్టుల అప్పగింతపై చెరోమాట!

(మొదటి పేజీ తరువాయి)

గందరగోళం నెలకొంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల అప్పగింతపై గురువారం హైదరాబాద్‌లోని జలసౌధలో కేఆర్ఎంబీ చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. దీనికి తెలంగాణ నుంచి ఈఎన్‌సీ సి.మురళీధర్, అంతరాష్ట్ర విభాగం చీఫ్ ఇంజనీర్ మోహన్‌కుమార్, నాగార్జునసాగర్ చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్, కృష్ణాబేసిన్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.విజయకుమార్ హాజరుకాగా, ఏపీ నుంచి ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డితో పాటు ఇతర అధికారులు హాజరయ్యారు. దాదాపు గంటన్నరపాటు జరిగిన ఈ సమావేశంలో.. జలవిద్యుత్తు కేంద్రాలు మినహా మిగిలిన 10 ఔట్‌లెట్లపై చర్చించారు. వీటిలో శ్రీశైలం ప్రాజెక్టు స్పిల్‌వేతో పాటు రివర్ స్లూయిస్, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం, మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, నాగార్జునసాగర్ లెఫ్ట్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్, నాగార్జునసాగర్ ఫ్లడ్‌ఫ్లో కెనాల్-హెడ్‌రెగ్యులేటర్-పరిసరాలు, ఏఎమ్మార్ ఎత్తిపోతల పథకం-పంప్‌హౌస్ పరిసరాలు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్‌వేతో పాటు రివర్, చూట్ స్లూయిస్, నాగార్జునసాగర్ రైట్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్ ఉన్నాయి.. వీటన్నింటినీ కృష్ణా బోర్డు నియంత్రణలోకి తీసుకోవడానికి రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలు అంగీకారం తెలిపారు. అయితే నీటి విడుదల కోసం కేఆర్ఎంబీ ప్రత్యక్ష నియంత్రణలో ప్రతి కాంపోనెంట్ వద్ద తెలంగాణ నుంచి ఒకరు, ఏపీ నుంచి మరొక ఉద్యోగిని పెట్టాలని నిర్ణయించారు. 10 కాంపోనెంట్ల వద్ద మూడు షిఫ్టుల్లో 30 మంది చొప్పున బోర్డు నియంత్రణలో పనిచేయడానికి ఇరు రాష్ట్రాలు అంగీకారం తెలిపాయి. నీటి విడుదల మాత్రం బోర్డుకు చెందిన త్రిసభ్య కమిటీ (బోర్డు సభ్యకార్యదర్శి డీఎం రాయిపూరే, తెలంగాణ, ఏపీ ఈఎన్‌సీలు) నిర్ణయం మేరకే జరగాలనే అంగీకారం కుదిరింది. అయితే నాగార్జునసాగర్ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓఅండ్ఎం) పనులను తెలంగాణ, శ్రీశైలం పనులను ఏపీ చేయాలని నిర్ణయించారు. సీఆర్‌పీఎఫ్ బలగాలను నాగార్జునసాగర్ ప్రధాన కట్ట వద్దే పరిమితం చేయాలనీ నిర్ణయించారు. వివాదం తలెత్తితే మాత్రం శ్రీశైలంతో పాటు ఇతర కాంపోనెంట్ల వద్ద కూడా సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించనున్నారు. ఇక ప్రాజెక్టులు/కాంపోనెంట్ల తాత్కాలిక నిర్వహణకు నియమించిన సిబ్బందికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే వేతనాలు చెల్లించాలని నిర్ణయించారు. కాగా, 'నాగార్జునసాగర్ పరిధిలో మొత్తం 8 కాంపోనెంట్లు ఉండగా.. అందులో 7 తెలంగాణ ఆధీనంలో ఉన్నాయి. వాటిలో ఐదింటిని కృష్ణా బోర్డుకు అప్పగించడానికి అంగీకరించాం. శ్రీశైలం పరిధిలో 7 కాంపోనెంట్లు ఉండగా.. అందులో తెలంగాణ ఆధీనంలో ఉన్న ఒక కాంపోనెంట్‌ను అప్పగించడానికి నిర్ణయం తీసుకున్నాం' అని బోర్డు సమావేశం అనంతరం ఈఎన్‌సీ మురళీధర్ ప్రకటించారు.



కేఆర్ఎంబీ కార్యాలయంలో ఈఎన్‌సీ మురళీధర్‌రావు

అప్పగింత నిర్ణయం వైరల్ కావడంతో యూటర్న్!

ప్రాజెక్టుల్ని బోర్డుకు అప్పగించాలని నిర్ణయం జరిగిందని ఈఎన్‌సీ మురళీధర్ పేర్కొన్న విషయం ప్రసార, సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ కావడంతో.. రాష్ట్ర ప్రభుత్వం ఆ వెంటనే నష్ట నివారణ చర్యలకు దిగింది. నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా జనవరి 27న కేంద్ర జలశక్తి శాఖకు రాసిన లేఖను మాధ్యమాలకు విడుదల చేశారు. నీటి వాటాలు తేలేదాకా ప్రాజెక్టులను అప్పగించకూడదని, కృష్ణా జలాలను చెరిసగం పంచాల్సిందేనని తెలంగాణ ప్రభుత్వం పట్టుబడుతున్న విషయాన్ని పేర్కొంటూ రాహుల్ బొజ్జా లేఖ రాయగా.. జనవరి 31వ తేదీన కేఆర్ఎంబీ చైర్మన్‌కు ఈఎన్‌సీ మురళీధర్ కూడా లేఖ రాశారు. 'ఆంధ్రప్రదేశ్ పునర్‌వ్యవస్థీకరణ చట్టంలోని షెడ్యూల్-12 ప్రకారం భౌగోళిక స్వరూపం ప్రకారం ఏ రాష్ట్రానికి చెందిన జలవిద్యుత్తు కేంద్రాలు ఆ రాష్ట్రంలోనే ఉంటాయి. వీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ అప్పగించేది లేదు. శ్రీశైలం నుంచి ఇతర బేసిన్‌లకు నీటి తరలింపును అడ్డుకోవాలి' ఇలా వివిధ అంశాలతో కూడిన లేఖను రాహుల్ బొజ్జా రాశారు. అయితే ఆ లేఖలకు కట్టుబడే కృష్ణా బోర్డు సమావేశంలో తెలంగాణవాదన ఉంటుందని భావించగా.. అందుకు విరుద్ధంగా పరిణామాలు చోటుచేసుకున్నాయి. జనవరి 17వ తేదీన కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ అధ్యక్షతన జరిగిన సమావేశానికి సంబంధించి విడుదల చేసిన మినట్స్‌లోని అంశాలపైనా రాహుల్ బొజ్జా గతంలోనే అభ్యంతరం తెలిపారు. తాము లేవనెత్తిన అంశాలను చేర్చకుండా.. తాము చెప్పని అంశాలను చెప్పినట్లు మినిట్స్‌లో పెట్టారంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. కృష్ణా బేసిన్‌లో నీటివాటాలు తేలేదాకా, శ్రీశైలం, సాగర్‌ల ఆపరేషనల్ ప్రొటోకాల్‌పై స్పష్టత వచ్చేదాకా ప్రాజెక్టులను కృషా బోర్డుకు అప్పగించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

త్వరలో బీజేపీ గూటికి నగేశ్!


ఆదిలాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నేత గోడం నగేశ్ త్వరలో బీజేపీలో చేరనున్నట్లు తెలుస్తోంది. గురువారం ఢిల్లీలో బీజేపీ పెద్దలతో ఆయన రహస్య మంతనాలు జరిపినట్లు సమాచారం. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆదేశాలతో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ కూడా నగేశ్‌తో కలిసి ఢిల్లీకి వెళ్లినట్లు తెలుస్తోంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన నగేశ్ బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ సోయంబాపురావు చేతిలో ఓడిపోయారు. అయితే, నగేశ్.. తనకు ఎంపీ టికెట్ ఇస్తే బీజేపీలో చేరేందుకు సిద్ధమని పార్టీ అధిష్ఠానం పెద్దలతో మాట్లాడినట్లు తెలిసింది.

పదవికి మాత్రమే విరమణ: కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పదవికి మాత్రమే విరమణ.. ప్రజాసేవకు కాదని.. మాజీలుగా మారిన సర్పంచులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. సర్పంచుల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ఐదేళ్లపాటు ప్రజలకు సేవచేసిన వారందరికీ.. ఎక్స్ వేదికగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో గ్రామాల్లో నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు నెలకొల్పి దేశంలోనే మన రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలపడంలో సర్పంచుల పాత్ర ఎనలేనిదని కొనియాడారు.

500 ఎకరాల్లో ఏఐ హబ్!

(మొదటి పేజీ తరువాయి)



ప్రతిపాదించారు. ప్రభుత్వంలోనూ ఏఐని వినియోగించాలని గత సర్కారు భావించింది. అయితే కరోనా విజృంభణతో ఈ ఆలోచనలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఈ అంశంపై ఇప్పుడు ప్రధానంగా దృష్టిసారించింది. ఏఐ ఆధారిత కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ అధికంగా ఉండటంతో బీటెక్‌లో ఈ కోర్సు సీట్లను భారీగా పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కోర్సులో సీట్లు ప్రస్తుతం వర్సిటీల్లో పరిమిత సంఖ్యలో ఉండగా.. వీటిని పెద్దఎత్తున పెంచే యోచనలో ప్రభుత్వం ఉంది. అలాగే ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకుంటున్న ఏఐ హబ్‌ను అంతర్జాతీయ దిగ్గజ కంపెనీల భాగస్వామ్యంతో ఏర్పాటు చేయనుంది. ప్రముఖ పారిశ్రామిక దిగ్గజ సంస్థలు కలిసి ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి)ను ఏర్పాటు చేసిన మాదిరిగా అంతర్జాతీయ టెక్ దిగ్గజాల సంయుక్త ఆధ్వర్యంలో ఏఐ హబ్ ఉండబోతోంది. పరిశ్రమల అవసరాలకనుగుణంగా బీటెక్, యూజీ స్థాయిలో సిలబస్‌లోనూ కంపెనీల సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోబోతోంది. దీంతో చదువులు పూర్తవగానే విద్యార్థులకు ఇక్కడే ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నది సర్కారు ఆలోచన. ఓపెన్ ఏఐ లాంటి కంపెనీలు తమ పరిశోధన కేంద్రాలు ఇక్కడ ఏఐ హబ్‌లో ఏర్పాటు చేసేందుకు కావాల్సిన అన్ని రకాల సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది.

జాబ్ గ్యారంటీ లక్ష్యంగా.. స్కిల్ యూనివర్సిటీ

రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. సాధారణ డిగ్రీ కోర్సులు చదివిన వారికి ఉపాధి అవకాశాలు తక్కువగా ఉండటంతో వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించడాన్ని సీఎం రేవంత్ రెడ్డి తన ప్రాధాన్య అంశంగా పెట్టుకున్నారు. ఈ విషయంపై దావోస్ పర్యటనలోనూ ప్రముఖ కంపెనీలతో సీఎం చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.1,500 కోట్లతో 50 ప్రభుత్వ ఐటీఐల్లో నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని టాటా టెక్నాలజీస్ ప్రకటించింది. టాటాతో పాటు ఇతర సంస్థల సహకారంతో రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 12 స్కిల్ యూనివర్సిటీలుండగా.. ప్రభుత్వ ఆధ్వర్యంలో 4, ప్రైవేటు నిర్వహణలో 8 ఉన్నాయి. వీటిని అధ్యయనం చేసిన తర్వాత స్కిల్ యూనివర్సిటీ గురించి ప్రభుత్వం ప్రకటించనుంది.

వీధికుక్కల దాడిలో ఏడాది బాలుడి మృతి

» గుడిసెలో తల్లి పక్కన నిద్రిస్తుండగా నోట కరచుకెళ్లి దారుణం

» రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో విషాదం

శంషాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో తల్లి పక్కన నిద్రిస్తున్న ఆ పసిబాలుడిని వీధికుక్కలు నోట కరిచి బయటకు లాక్కెళ్లి దారుణంగా గాయపరిచి చంపేశాయి. ఈ హృదయవిదారక ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో గురువారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం, మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రకు చెందిన సూర్యకుమార్ ఉపాధి నిమిత్తం శంషాబాద్‌కు వచ్చి ఇక్కడే గుడిసె వేసుకొని నివాసముంటున్నాడు. తనకు భార్య, ఏడాది వయసున్న కుమారుడు నాగరాజు ఉన్నారు. ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా గురువారం తెల్లవారుజామున ఇంట్లోకి వచ్చిన వీధి కుక్కలు తల్లి పక్కన పడుకుంటున్న నాగరాజును నోట కరిచి వీధిలోకి లాక్కెళ్లి తీవ్రంగా గాయపరిచాయి. ఈ దాడిలో బాలుడు అక్కడిక్కడే మృతిచెందాడు. లేచిచూసేసరికి బాలుడు కనబడకపోవడంతో తల్లిదండ్రులు అతడి కోసం వెతకగా రోడ్డుపై గాయాలతో విగతజీవిగా పడి ఉన్నాడు. రాత్రి తన పొత్తిళ్లలో పడుకున్న చిన్నారి తెల్లారేసరికి విగతజీవిగా కనిపించడంతో ఆ తల్లి గుండెపగిలేలా రోదించింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ రహదారులకు నిధులు ఫుల్

- భూ సేకరణ పూర్తయితే చాలు..
- ఆర్ఆర్ఆర్ సహా త్వరితగతిన ఇతర రోడ్లు పూర్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ దశల్లో, స్థాయుల్లో ఉన్న జాతీయ రహదారుల నిర్మాణాలకు అవసరమైన భూములను సేకరిస్తే.. అయా ప్రాజెక్టులన్నీ త్వరితగతిన పూర్తికానున్నాయి. జాతీయ రహదారుల నిర్మాణాలకు నిధులు కూడా సరిపడా ఉన్నాయని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. గురువారం కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ జాతీయ రహదారుల విభాగానికి రూ.1.68లక్షల కోట్లను కేటాయించడం గమనార్హం..! అయితే.. బీఆర్ఎస్ హయాంలో పలు జాతీయ రహదారుల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణకు సహకరించకపోవడంతో.. ఆయా ప్రాజెక్టులు నత్తనడకన సాగుతున్నాయి. ఆ నిధులకు తోడు.. మళ్లీ ఇప్పుడు కేంద్రం మరికొన్ని నిధులను కేటాయించడంతో.. ప్రస్తుతమున్న రహదారుల ప్రాజెక్టులతో పాటు, మరికొన్ని కొత్త రోడ్లు కూడా మంజూరుకానున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సర్కారు ఇప్పటికే రీజినల్ రింగ్ రోడ్(ఆర్ఆర్ఆర్) నిర్మాణానికి సహకారం అందిస్తామని ప్రకటించింది.

అటవీ శాఖలో సూపరింటెండెంట్లకు గెజిటెడ్ హోదా కల్పించాలి

- మంత్రి సురేఖకు ఉద్యోగుల ఫోరమ్ వినతి

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : అటవీ శాఖలో సూపరింటెండెంట్లుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు గెజిటెడ్ హోదా కల్పించాలని 'టీఎన్జీవోస్ ఫారెస్ట్ డిపార్టుమెంట్ సెంట్రల్ ఫోరమ్' అటవీశాఖ మంత్రి కొండా సురేఖను కోరింది. సచివాలయంలో ఆ 'ఫోరమ్' డైరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మంత్రి కొండా సురేఖ డైరీని ఆవిష్కరించారు. అనంతరం ఫోరమ్ అధ్యక్షులు పొన్న మల్లయ్య, ఉపాధ్యక్షులు కేఎస్ఎన్ మూర్తి తదితరులు వినతిపత్రం అందజేశారు. అటవీశాఖలో పని చేస్తున్న సూపరింటెండెంట్లకు గెజిటెడ్ హోదా లేదని, ఆ హోదా కల్పించాలని మంత్రిని కోరారు.

మత్తు వదలరా..

గంజాయి వ్యసనానికి బానిసైతే బయటపడటం కష్టమే

- కుటుంబసభ్యుల సహకారంతో కోలుకునే అవకాశం
- ఎంత త్వరగా గుర్తిస్తే అంత త్వరగా బయటపడొచ్చు: వైద్యులు

(ఆంధ్రజ్యోతి-హైదరాబాద్)



సరదాగా మొదలయ్యే గంజాయి, ఇతర మత్తుపదార్థాల అలవాటు.. క్రమంగా వ్యసనంగా మారుతుంది! ఆ మత్తుకు వారు పూర్తి బానిసలుగా మారడం చివరి దశ. అలాంటివారికి చికిత్స అందించి తిరిగి సాధారణ స్థితికి తీసుకు రావడం పెద్ద సమస్యగా మారుతోంది. కౌన్సెలింగ్, థెరపీ, ఇతర చికిత్స విధానాలతో వారిని మామూలు మనుషులుగా మార్చే ప్రయత్నం చేసినా కోలుకోవడంపై ఎలాంటి గ్యారంటీ ఇవ్వలేమని.. రికవరీ రేటు 50% లోపే ఉంటుందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారు చెబుతున్నదాని ప్రకారం.. గంజాయికి అలవాటుపడ్డ వారి ప్రవర్తన విపరీత ధోరణిలో ఉంటుంది. సరిగా తినకపోవడం, మాట్లాడకపోవడం, తోచింది చేయడం, సమయపాలన లేకుండా వ్యవహరించడం వంటి లక్షణాలు వారిలో కనిపిస్తాయి. పిల్లలు, కుటుంబ సభ్యుల ప్రవర్తనలో ఈ తరహా మార్పులను గుర్తిస్తే వెంటనే అప్రమత్తం కావాలని.. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వైద్య నిపుణులకు చూపించాలని, వారి సలహా ప్రకారం డీ-అడిక్షన్ కేంద్రాలకు తీసుకెళ్లాలని సూచిస్తున్నారు. అలా కుటుంబసభ్యులు గుర్తించినవారు.. మత్తు కేసుల్లో పోలీసులు పట్టుకుని అప్పగించినవారు.. ఇలా రెండు రకాల వారు డీ-అడిక్షన్ కేంద్రాలకు చేరుతారు. అక్కడ వైద్యనిపుణులు వారిని పరిశీలించి, పరీక్షించి, కుటుంబసభ్యులు ఇచ్చిన సమాచారం ఆధారంగా.. వారి ప్రస్తుత పరిస్థితి ఏమిటి? ఏ దశలో ఉన్నారో ఒక అంచనాకు వస్తారు. ఏ స్థాయిలో మత్తుకు అలవాటు పడ్డారో గుర్తిస్తారు. ప్రత్యేకమైన ప్రశ్నావళిని వారి ముందుంచి.. ఆ ప్రశ్నలకు వారు ఇచ్చిన సమాధానాల ఆధారంగా వారి మానసిక స్థితి అంచనా వేస్తారు. ఆ తర్వాత బాధితుడికి అందించాల్సిన చికిత్సపై ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు. వారిని మత్తు నుంచి బయట పడేయడం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యల గురించి కూడా ఒక అంచనాకు వస్తారు. చాలాకాలంగా మత్తుకు అలవాటు పడ్డట్లైతే వారి శరీరాన్ని.. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో డీ-టాక్స్ చేయిస్తారు. తమంత తాముగా ఈ ఊబి నుంచి బయటపడాలనుకునేవారికి, కుటుంబ సభ్యుల సహకారంతో మత్తునుంచి బయట పడే అవకాశం ఉన్న వారికి 8 సెషన్స్‌లో (వారానికొకసారి చొప్పున రెండు నెలలపాటు) ఔట్ పేషెంట్లుగా చికిత్స అందిస్తారు. హైరిస్క్ ఉంటే.. అలాంటి వారి విషయంలో కనీసం 3 నెలలపాటు మానసిక నిపుణుల పర్యవేక్షణలో ఉంచి చికిత్స అందిస్తారు.



సదుపాయాల్ని బట్టి చార్జీలు..

తెలంగాణలో ప్రభుత్వ, ప్రైవేటు, ఎన్జీవోలు నిర్వహించేవి ఇలా అన్నీ కలిపి.. ఈ తరహా చికిత్సలను అందించే కేంద్రాలు వందకు పైగా ఉన్నాయి. ప్రైవేటులో సదుపాయాల్ని బట్టి నెలకు రూ.20 వేల నుంచి రూ.2 లక్షల దాకా చార్జీలను వసూలు చేస్తారు. మత్తుకు అలవాటు పడ్డ చిన్నారుల కోసం ప్రతి రాష్ట్రంలో చైల్డ్ రీహాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం గతంలో ఆదేశించింది. ఈమేరకు ఢిల్లీ, కోల్‌కత, కేరళలో ఈ తరహా రిహాబిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. తెలంగాణలో మాత్రం ఏర్పాటు కాకపోవడం విషాదం.

మత్తుపై సమాచారమివ్వండి

- టీఎస్ న్యాబ్ చీఫ్ సందీప్ శాండిల్య

మత్తుపదార్థాల వినియోగం, సరఫరా, విక్రయానికి సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా టోల్ ఫ్రీ నంబర్ 8712671111కు సమాచారం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కొటిక్స్ బ్యూరో(టీఎస్ న్యాబ్) చీఫ్ సందీప్ శాండిల్య విజ్ఞప్తి చేశారు.

టోల్ ఫ్రీ నంబర్
87126 71111

tsnabhohyd@tspolice.gov.in అనే మెయిల్ ఐడీకీ కూడా సమాచారం పంపవచ్చని.. ఇలా సమాచారం అందించేవారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన భరోసా ఇచ్చారు.

అప్పులే యమపాశాలై...!

- ముగ్గురు అన్నదాతల ఆత్మహత్య
- సిరిసిల్ల, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఘటనలు

ఎల్లారెడ్డిపేట, జహీరాబాద్, పరిగి, ఫిబ్రవరి 1: పంటలు దిగుబడి రాక.. చేసిన అప్పులు తీర్చేమార్గం కనిపించక ముగ్గురు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటనలు రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో గురువారం జరిగాయి. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రైతు సంబు బీరయ్య (61) తనకున్న నాలుగెకరాల్లో రూ.5 లక్షలు అప్పులు చేసి వరి సాగు చేయగా దిగుబడి రాలేదు. ఈ క్రమంలో మరో రూ. 45 లక్షలు అప్పులు చేసి ఇంటి నిర్మాణ పనులు చేపట్టాడు. ఉన్న ఊరిలో ఉపాధి లేక చిన్న కొడుకు ప్రశాంత్‌ను రూ.3 లక్షలు అప్పు చేసి గల్ఫ్‌కు పంపించాడు. కుమారుడికి అక్కడ పనులు లభించకపోవడం, ఇక్కడ పంట దిగుబడి రాక కుటుంబ పోషణ తలకు మించిన భారంగా మారింది. దీంతో నాలుగెకరాల పొలాన్ని రూ.40 లక్షలకు ఇటీవల విక్రయించినా పూర్తిస్థాయిలో బాకీలు తీరే మార్గం లేకపోవడంతో మనస్తాపం చెందిన బీరయ్య గురువారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అలాగే, సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం హోతి (బి) గ్రామానికి చెందిన రమేశ్ (34) పొలాన్ని కౌలుకు తీసుకుని అప్పు చేసి పంట సాగు చేశాడు. పంట నష్టపోయి రూ.4 లక్షలకు పైగా అప్పులు మిగిలాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన రమేశ్ పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. వ్యవసాయానికి, కుమార్తె పెళ్లికి చేసిన అప్పులు తీర్చేమార్గం లేక వికారాబాద్ జిల్లా పరిగి మండలం నజీరాబాద్ తండాలో రైతు ముడావత్ హరిశ్చందర్ (45) పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఉన్నత విద్యా మండలి కార్యదర్శిగా వెంకటేశ్

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శిగా ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ నియమితులయ్యారు. గురువారం ఆయన ఈ బాధ్యతలను స్వీకరించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న వెంకటేశ్‌కు ఉన్నత విద్యా మండలి కార్యదర్శిగా అదనపు బాధ్యతలను అప్పగించారు. కాగా, ఇంతకాలం ఉన్నత విద్యామండలి కార్యదర్శిగా పని చేసిన శ్రీనివాసును బదిలీ చేసి నార్కెట్‌పల్లి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్‌గా నియమించిన విషయం తెలిసిందే.

మహిళా భద్రత విభాగం డీఐజీగా రెమా రాజేశ్వరి

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహిళా భద్రత విభాగం డీఐజీగా రెమా రాజేశ్వరిని నియమిస్తూ డీజీపీ రవిగుప్తా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 2009 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమె ప్రస్తుతం రామగుండం సీపీగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రస్తుతం మల్టీజోన్-2 ఐజీగా విధులు నిర్వహిస్తున్న తరుణ్‌జోషికి రామగుండం సీపీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు డీజీపీ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నకిలీ పత్రాలతో పాస్‌పోర్టుల కేసులో ఏఎస్ఐ

- అతడితో పాటు మరో ఇద్దరి అరెస్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నకిలీ ధ్రువపత్రాలను సృష్టించి పాస్‌పోర్టులు జారీ చేయించిన కేసులో మరో ముగ్గురు నిందితులను సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. వీరిలో నిజామాబాద్ జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ లక్ష్మణ్ సైతం ఉండడం గమనార్హం. మిగతా ఇద్దరు ఆదిలాబాద్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రంలో పనిచేస్తున్న పోస్టల్ అసిస్టెంట్ ప్రణబ్, ముంబైకు చెందిన ఏజెంట్ అని సీఐడీ అడిషనల్ డీజీ శిఖా గోయల్ గురువారం తెలిపారు. వీరితో కలిపి మొత్తం 14 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. మరిన్ని కీలక వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. ఈ ముఠా శ్రీలంక నుంచి అక్రమంగా వలస వచ్చినవారికి ఇప్పటివరకు 95 పాస్‌పోర్టులు జారీ చేసిందని తెలిపారు.

అమెరికాలో మరో భారతీయ విద్యార్థి మృతి

వాషింగ్టన్, ఫిబ్రవరి 1: అమెరికాలో మరో భారతీయ విద్యార్థి మృతి చెందాడు. గురువారం ఒహాయో రాష్ట్రం సిన్సిన్నాటిలో ఆ విద్యార్థి మృత దేహం కనిపించింది. ఇది ఎవరు, మరణానికి కారణం ఏమిటన్న వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఇటీవల కాలంలో భారతీయ విద్యార్థులు హత్యకు గురవుతుండడంతో ఆందోళన నెలకొంది. గత నెలలోనే జార్జియా రాష్ట్రంలో వివేక్ సైనీ అనే 25 ఏళ్ల విద్యార్థిని ఓ మాదక ద్రవ్యాల బానిస సుత్తితో కొట్టి హత్య చేశాడు. అంతకుముందు పుర్‌డ్యూ యూనివర్సిటీలో చదువుతున్న నీల్ ఆచార్య అనే భారతీయ విద్యార్థి కూడా హత్యకు గురయ్యాడు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నేతిబీర...!

ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్లో చెప్పుకోదగ్గ మెరుపులూ లేవు, జనాకర్షక చర్యలూ లేవు. విత్త క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఆమె పలు రంగాలకు కేటాయింపులు చేశారు. దేశంలో మౌలిక వసతుల అభివృద్ధికి మోదీ ప్రభుత్వం పదేళ్లుగా ప్రాధాన్యత ఇస్తోంది కనుక, అదే ధోరణి కొనసాగిస్తూ రోడ్లు, విమానాశ్రయాలు, రైల్వే, పోర్టులు, గృహనిర్మాణ రంగాలకు కేటాయింపుల్లో పెద్ద పీట వేశారు. వివిధ మౌలిక వసతుల రంగాలపై రూ.11.11 లక్షల కోట్లు ఖర్చు చేయనున్నట్టు ప్రకటించారు.


బడ్జెట్లో మహిళలు, స్టార్టప్‌లకు కొన్ని నజరానాలు ఉన్నాయి. స్వయం సహాయక బృందాల మహిళలు ఏడాదికి కనీసం లక్ష రూపాయలు ఆర్జించుకోగల విధంగా జీవనోపాధి కార్యక్రమాలు అందుబాటులో ఉంచడం లక్ష్యంగా "లక్షాధికారి దీదీ"ల సంఖ్య రెండు నుంచి మూడు కోట్లకు పెంచనున్నట్టు ప్రకటించారు. ఆయుష్మాన్ భారత్ బీమా పథకం ప్రయోజనాలు ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు వర్తింపచేయడం వారి ఆరోగ్య సంరక్షణ దిశగా పెద్ద చర్య. మహిళల సంపూర్ణ వ్యాక్సినేషన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నందున, అందులో భాగంగా 9 నుంచి 14 సంవత్సరాల మధ్యవయస్కులైన బాలికలు సెర్విక్ కేన్సర్ బారిన పడకుండా నివారించే వ్యాక్సినేషన్‌ను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. ఈ చర్యలు జనాభాలో అర్థభాగం ఉన్న మహిళల ఆరోగ్య పరిరక్షణకు, ఆర్థిక సాధికారతకు ఉపకరిస్తాయి. స్టార్టప్‌ల రంగంలో మనదేశం అమెరికా, చైనా తర్వాత మూడో స్థానంలో ఉంది. స్టార్టప్‌లలో సావెరీన్ వెల్త్ ఫండ్, పెన్షన్ ఫండ్ సంస్థలు పెట్టే పెట్టుబడులకు సంపూర్ణ పన్ను విరామం 2025 మార్చి 31 వరకు పొడిగిస్తున్నట్టు ఆర్థిక మంత్రి చేసిన ప్రకటన స్టార్టప్‌లలోకి కొత్త పెట్టుబడులకు, ఉపాధి అవకాశాల కల్పనకు దోహదపడుతుంది.

అయోధ్య రామమందిరం ఆరంభం నాడే, తన కొత్త సంకల్పం అంటూ నరేంద్రమోదీ 'ప్రధానమంత్రి సూర్యోదయ యోజన'ను ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రాణప్రతిష్ఠను, ప్రధాని సంకల్పాన్ని తన బడ్జెట్ ప్రసంగంలో చక్కగా మేళవించి కోటి ఇళ్ల సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు గురించి ఆర్థికమంత్రి వివరించారు. సోలార్ పైకప్పు ఏర్పాటు చేసుకునే ఇళ్ళు 300 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా వాడుకొని, మిగతా విద్యుత్తును గ్రిడ్‌కు విక్రయించుకోవచ్చు. దీనివల్ల గృహవినియోగదారులకు బిల్లుల భారం తగ్గుతుంది. దీనితోపాటు, ప్రజారవాణా వ్యవస్థలో మరిన్ని విద్యుత్ బస్సుల ప్రవేశం ప్రతిపాదన కూడా వాతావరణంలో కర్బన్ ఉద్గారాలను 'నెట్ జీరో' చేసే లక్ష్యానికి ప్రభుత్వాన్ని చేరువ చేస్తుంది. "అందరికీ ఇల్లు" పథకం కింద వచ్చే ఐదేళ్ల కాలంలో మరో రెండు కోట్ల ఇళ్లు నిర్మించాలన్న లక్ష్యం మధ్యతరగతికి ప్రయోజనకారి.

వ్యక్తిగత ఆదాయపు పన్నులో గాని, కార్పొరేట్ పన్నుల్లో గాని ఈ బడ్జెట్లో ఎలాంటి మార్పులు లేవు. భావోద్వేగాలతో ప్రజలను ఆకర్షించగలుగుతున్నప్పుడు మినహాయింపులు, రాయితీలు ప్రత్యేకంగా అక్కరలేదని ప్రభుత్వం అనుకొని ఉంటుంది. 2014—-15 ఆర్థిక సంవత్సరానికి ముందు జారీ చేసిన రూ.25,000 లోపు ఐటీ డిమాండు నోటీసులన్నింటినీ ఉపసంహరించుకోబోవడం పన్ను వివాదాల్లో చిక్కుకున్న కోటిమందికి ఉపశమనం. తాత్కాలిక బడ్జెట్లో ఆర్థికమంత్రి చేసిన భారీ ప్రకటన బహుశా ఇదే. పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం రూ.50,000 కోట్లకు కుదించారు. ఇది, ప్రభుత్వ సంస్థలను ఆదరాబాదరాగా కాక, సరైన ధర వచ్చినప్పుడే అమ్మాలన్న దిశగా ప్రభుత్వ వైఖరి మారిందనేందుకు సంకేతమని కొందరి విశ్లేషణ. కానీ, ఏటా ప్రభుత్వం నిర్దేశిత లక్ష్యంలో వెనుకబడుతూండటంతోనే ఈ కుదింపు జరిగిందన్నది వాస్తవం.

గత పది సంవత్సరాల్లో మోదీ నాయకత్వంలో దేశం ఆర్థికంగా ప్రపంచస్థాయిలో ఐదోస్థానానికి ఎదిగిందని చెబుతూ ఆర్థికమంత్రి ఈ సందర్భంలో తమ విజయాలన్నింటినీ ఏకరువుపెట్టారు. 2014లో అధికారంలోకి వచ్చినది మొదలు పాలనా వ్యవస్థలన్నింటినీ దారిలోపెట్టడానికి, ఆర్థిక రంగాన్ని పట్టాలపైకి ఎక్కించడానికి ఎంతో శ్రమించామని పరోక్షంగా చెప్పుకున్నారు. 2014 సంవత్సరం ముందు స్థితిగతులపై శ్వేతపత్రం విడుదల చేస్తామన్న ప్రకటన వెనుక రాజకీయ కారణాలు ఉండవచ్చునేమో కానీ, విస్తృత చర్చకు తగినంత అవకాశమిస్తుంది.

అయోధ్య సయోధ్యకు దారితీయదా?




■ రాహుల్ కుమార్

సుప్రీంకోర్టు తీర్పుతో నాలుగేళ్ల క్రితం బాబ్రీ మసీదు చరిత్ర ముగిసింది. మసీదు కూలిన చోట రామమందిరం ఘనంగానూ ప్రారంభమైంది. సుదీర్ఘ వివాదాల చరిత్రలో ఒక ఘట్టానికి తెరపడింది. కానీ వివాదాల చరిత్ర ప్రయాణం మాత్రం ఆగలేదు. మరో రెండు వివాదాలు తీవ్రస్థాయిలో ముసురుకుంటున్నాయి. జ్ఞానవాపి, షాహి ఈద్గా మసీదులను హిందువులకు అప్పగించాలన్న డిమాండ్లు మొదలయ్యాయి. అయోధ్య–బాబ్రీమసీదు వివాదం మూడు దశాబ్దాల పాటు రాజకీయాలను తీవ్రంగా ప్రభావితం చేసింది. సగటు మనిషి ఆలోచనల్లో సైతం తీవ్ర మార్పును తీసుకొచ్చింది. మత దృష్టితో చరిత్రను చూసే పద్ధతిని బాగా పెంచింది. మధ్యయుగాల చరిత్రను హిందూ–ముస్లిం సమరంగా భావించే ధోరణి మధ్యతరగతి ప్రజల్లో స్థిరపడటం మొదలైంది. ఈ తరహా సంకుచిత దృష్టికి మూల కారణం ఇప్పటిది కాదు. బ్రిటిషు కాలంలోనే అది మొదలైంది. తమకు ముందున్న పాలకులను క్రూరులుగా, నిరంకుశులుగా, మతోన్మాదులుగా చిత్రీకరించే ధోరణిని బ్రిటిషు అధికారులు, చరిత్రకారులు ప్రారంభించారు. సముద్రాలను దాటి వచ్చి ఇక్కడ ప్రజలపై అంతులేని ఆధిపత్యాన్ని చలాయించాలంటే బలప్రయోగం ఒక్కటే సరిపోదు. తమకు ముందున్న పాలకులకంటే తాము అన్ని విధాలా ఉన్నతులమనీ, నాగరీకులమనీ చెప్పుకోవాలి. ప్రజలు దాన్ని నమ్మేలా చేయటానికి చరిత్ర రచనను మించిన సాధనం లేదు. దానిని చదువరుల బుర్రల్లో బలంగా నాటాలి. అలా జరగాలంటే ప్రభుత్వ నివేదికలు, పాఠ్యపుస్తకాలు, గెజిట్లలో దానికి తగిన స్థానం కల్పించాలి. హిందూ జమిందార్లకు, సుల్తాన్లకు మధ్య పేచీలను ప్రజల మధ్య పేచీలుగా చూపాలి. స్వదేశీ–విదేశీ పీడకుల మధ్య పంపకాల జగడాలను ప్రజల మధ్య జగడాలుగా వ్యాఖ్యానించాలి. ఇలాంటి రాజకీయ అవసరాలతో రూపొందిన చరిత్ర.. గతాన్ని గురించి మనలో కొన్ని బలమైన భావనలు ఏర్పరిచింది. స్వాతంత్ర్యం తర్వాత కూడా ఈ భావనలే ప్రధానంగా కొనసాగాయి. దీనికి తోడు 1947 నుంచి నిన్నమొన్నటి వరకూ జరిగిన మొత్తం చరిత్రను ముస్లింలను సంతృప్తిపరచే చర్యల సమాహారంగా భావించే ధోరణితో ఆ భావనలు మరింత బలాన్ని సంపాదించుకున్నాయి.

నిష్పాక్షిక దృక్పథంతో మన చరిత్రపై గొప్ప రచనలు రాలేదని చెప్పలేం. కానీ ప్రజలకు చేరింది తక్కువ. అధికారం కోసం వెంపర్లాడే రాజకీయాల్లో పైచేయి సాధించటానికి అవి పనికిరావు. కాబట్టే వాటికి తగినంత ప్రాధాన్యం రాలేదు. సుదీర్ఘమైన మన చరిత్రను హిందూ, ముస్లిం యుగాలుగా విభజించిందే బ్రిటిషు వారు. ఆ అసంబద్ధ విభజనను అట్లాగే ఉంచుతూ ప్రాచీన, మధ్యయుగాలుగా కేవలం పేర్లు మార్చి ఇప్పటికీ కొనసాగించే స్వదేశీ చరిత్రకారులు చాలా మంది ఉన్నారు. పాలకులు అనుసరించిన మతాన్ని బట్టి చరిత్రను యుగాలుగా విభజించటం ఎన్నో అనర్థాలకు దారితీసింది. హిందువులు, ముస్లింలు మధ్య ఘర్షణలు, పోరాటాలు, ఓటముల చుట్టూ చరిత్రను తిప్పారు. హిందూ రాజుల పాలనను స్వర్ణయుగంగానూ, ముస్లిం రాజుల పాలనను చీకటి యుగంగానూ చిత్రీకరించే ధోరణే ప్రధానమైంది. ఇలాంటి చరిత్ర రచనల నుంచి ప్రేరణ పొందిన వ్యక్తులే దేశంలో మతాధిక్య భావజాల సంస్థలను, పార్టీలను ఏర్పాటు చేశారు. ఆలయాల విధ్వంసాలకు అసలు కారణాలను వదిలేసి ఒక్క మత కోణం నుంచే వాటిని చూశారు. ప్రార్థనా స్థలాలను విధ్వంసం, అపవిత్రం చేయటం చాలా దేశాల్లోనూ జరిగింది. మతోన్మాదం, రాజకీయ ప్రయోజనం, సంపద దోపిడి లాంటి కారణాలు ఎన్నో వీటి వెనుక ఉన్నాయి. రాజకీయ కారణాలతో ఆలయాలను కూల్చిన పాలకులే మరికొన్ని చోట్ల అదే రాజకీయాల కోసం ప్రార్థనాలయాలకు తోడ్పడిన సంఘటనలూ చరిత్రలో ఉన్నాయి.

హిందూ–ముస్లిం సంఘర్షణగా మన చరిత్రను చూడటంతోనే అయోధ్య వివాదం జటిలమైంది. ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఈ ఆలోచనలోనే ఉండదు కాబట్టి సయోధ్యకు జరిగిన ప్రయత్నాలన్నీ బెడిసికొట్టాయి. అయోధ్యలో హిందూ ఆలయాన్ని కూల్చి దాని స్థానంలో మసీదుని కట్టారనే వాదన నుంచి ఒక మెట్టు దిగటానికి హిందూ పక్షం అంగీకరించలేదు. ముస్లిం పక్షమూ వెనక్కి తగ్గలేదు. ఇరు వర్గాల ఆధారాలను పరిశీలించి చివరికి హిందూ పక్షానికి అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. అలా ఇచ్చినప్పటికీ ఆలయాన్ని కూల్చి మసీదును కట్టారనే వాదనకు సాక్ష్యాలు లేవనే సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. భారత పురావస్తు సంస్థ (ఏఎస్ఐ) నివేదిక కూడా దీన్ని నిర్ధారించలేకపోయిందనీ స్పష్టం చేసింది. నిజానికిది చాలా కీలకమైన విషయం. అప్రియ సత్యం కావటంతో చర్చల్లో దీనికి ప్రాధాన్యం దక్కలేదు. ప్రచార సాధనాలూ దీన్ని తగినంతగా పట్టించుకోలేదు. ఆలయానికి అనుకూలంగా తీర్పును ఇచ్చింది కాబట్టి కూల్చివేత వాదనకు సుప్రీంకోర్టు ఆమోదముద్ర వేసిందనే ప్రచారం పైచేయి సాధించింది. వివాదస్పద స్థలం హిందువులకే చెందుతుందన్న అంశానికే ప్రాధాన్యమిచ్చి తీర్పులోని మిగతా విషయాలను విస్మరించటంతో ఇతర నిర్ధారణలు మరుగున పడిపోయాయి. ఏ ప్రాతిపదికన హిందువులకు స్థలాన్ని అప్పగించాలని సుప్రీంకోర్టు నిర్ణయించిందో తెలుసుకుంటే ముఖ్య విషయాల్లో స్పష్టత వస్తుంది. అయోధ్యలాగా.. జ్ఞానవాపి, షాహి ఈద్గా మసీదుల విషయంలో ఆ తరహా నిర్ణయాన్ని తీసుకోవటం అంత సులువు కాదనీ తెలుస్తుంది.

ఏఎస్ఐ నివేదికలో పేర్కొన్న కీలక విషయాలను సుప్రీంకోర్టు క్రోడీకరించింది. అందులో ప్రధానమైనవి: 1) మసీదు స్థలం కింది పొరల్లో 12వ శతాబ్దికి చెందిన నిర్మాణం ఉన్నట్లు తేలింది. 17 వరుసల్లో 85 స్తంభాల తాలూకు పునాదులు అక్కడున్నాయి 2) అది హిందూ మతానికి చెందిన నిర్మాణమే కావచ్చు. 3) అప్పటికే అక్కడున్న పునాదులను ఉపయోగించి మసీదును కట్టారు. 4) చిన్న వృత్తాకారపు మందిరం కూడా అక్కడ బయటపడింది. 8–10 శతాబ్దికి మధ్య అక్కడ పూజలు జరిగాయనటానికి దాన్ని చిహ్నంగా భావించొచ్చు. ఏఎస్ఐ నివేదికలోని ఈ అంశాలను ప్రస్తావించిన తర్వాత సుప్రీంకోర్టు కొన్ని కీలక వ్యాఖ్యలను చేసింది. అవి: 12వ శతాబ్దికి చెందిన హిందూ నిర్మాణం ఎందుకు నాశనం అయిందన్న విషయంపై ఏఎస్ఐ ఏ కారణాన్ని చెప్పలేదు. అలాగే అక్కడున్న నిర్మాణాన్ని కూల్చివేసి మసీదుని కట్టారా? లేదా? అన్న విషయాన్ని కూడా ఏఎస్ఐ తేల్చలేదు. ఏఎస్ఐ పేర్కొన్న ప్రకారం హిందూ నిర్మాణం 12వ శతాబ్దం నాటిది. మసీదు 16వ శతాబ్దానికి చెందినది. రెండింటికి మధ్య 400 ఏళ్ల అంతరం ఉంది. ఆ 400 ఏళ్ల కాలంలో ఏ జరిగిందన్న దానిపై సాక్ష్యాధారాల్లేవు. పునాదులను మినహా మొత్తం మసీదు నిర్మాణానికి.. పురాతన కట్టడం తాలూకా వస్తువులను ఉపయోగించారన్న నిర్ధారణకు ఏఎస్ఐ రాలేదు. మసీదులోని రాతి స్తంభాలు.. పూర్వ కట్టడ పునాదులకు సంబంధించిన స్తంభాలే అనటానికి కూడా ఏఎస్ఐ సాక్ష్యాలను చూపించలేదు.

ఆలయాన్ని కూల్చి మసీదు కట్టారనటానికి ఏఎస్ఐ నివేదిక ప్రకారం ఆధారాల్లేవు. మరి దేని ఆధారంగా మసీదు స్థలాన్ని హిందువులకు అప్పగించారు? ఎవరికైనా వచ్చే సందేహమే అది. విశ్వాసాల ఆధారంగా ఒక స్థలంపై హక్కుని నిర్ణయించటం చట్ట ప్రకారం సాధ్యం కాదని తీర్పులో సుప్రీంకోర్టు పలుచోట్ల స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు నిర్ధారణల ప్రకారం.. మసీదును 16వ శతాబ్దంలో కట్టినా 1856–57 వరకూ అక్కడ అవిచ్ఛిన్నంగా ప్రార్థనలు జరిగాయనటానికి ముస్లిం పక్షం ఆధారాలు సమర్పించలేకపోయింది. బాబర్ ఆదేశం మేరకు మసీదును కట్టారని చెబుతున్నా అందుకు సంబంధించి లిఖిత సాక్ష్యాల్లేవు. మసీదుపై యాజమాన్య హక్కును నిర్దేశించే సనద్‌లు, ఫర్మానాల్లాంటివి లేవు. హిందూ–ముస్లిం గొడవలతో 1857లోనే మసీదు ప్రాంగణాన్ని బ్రిటిషు పాలకులు రెండుగా విభజించి గోడకట్టారు. గుమ్మటాలున్న కట్టడాన్ని ముస్లింలు ఉపయోగిస్తే మిగతా స్థలాన్ని హిందువులు వాడుకునేవారు. 1857కు పూర్వం కూడా హిందువులు అక్కడ పూజలు చేసేవారనీ విదేశీ యాత్రికులు కూడా పేర్కొన్నారు. మసీదులో ఒకవంక ప్రార్థనలు జరుగుతున్నా ప్రధాన గుమ్మటం ఉన్న స్థలాన్ని రామజన్మభూమిగా విశ్వసించటాన్ని హిందువులు మానలేదు. అక్కడకు వెళ్లటానికి ప్రయత్నించటంతో జరిగిన ఘర్షణల వల్లే అడ్డుగోడను కట్టాల్సి వచ్చింది. అంటే రామజన్మభూమికి సంబంధించి హిందువుల కార్యకలాపాలకు సుదీర్ఘ చరిత్ర ఉంది. 1934లో కూడా హిందువులు మసీదులోకి ప్రవేశించి ప్రధాన గుమ్మటంతో పాటు మరికొన్ని చోట్ల భౌతికంగా నష్టం కలిగించారు. 1949లోనైతే ఏకంగా ప్రధాన గుమ్మటంలోకి చొరబడి విగ్రహాలనే అక్కడ పెట్టారు. దాంతో మసీదులో ప్రార్థనలు ఆగిపోయాయి. 1857 నుంచి 1949 వరకూ మసీదులో క్రమం తప్పకుండా నమాజు చేశారటానికి సాక్ష్యాలున్నాయి. మసీదు ప్రాంగణం నూటికినూరు శాతం ఎన్నడూ ముస్లింల కింద లేదనేది మాత్రం స్పష్టం.

ప్రధానంగా స్థల ఉపయోగం, దాని స్వాధీనత, సుదీర్ఘకాలం అక్కడ ప్రార్థనలు, పూజలు జరగటం లాంటి అంశాలను సాక్ష్యాలుగా పరిగణించి సుప్రీంకోర్టు అయోధ్య తీర్పు ఇచ్చింది. జ్ఞానవాపి, మధుర మసీదుల్లో పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నం. అక్కడ నిరంతరం ప్రార్థనలు జరుగుతున్నాయి. అవి ప్రస్తుతం పూర్తిగా ముస్లింల స్వాధీనంలో ఉన్నాయి. అయోధ్య తీర్పు ప్రకారం చూస్తే వాటిని అక్కడ తొలగించటం అసాధ్యం! అయితే ప్రస్తుత రాజకీయ వాతావరణంలో దేన్నీ అసాధ్యంగా చెప్పలేం. గడిచిన 1000 ఏళ్లలో హిందువులకు అంతా అన్యాయమే జరిగిందనే విపరీత ధోరణి ఎన్ని వైపరీత్యాలకైనా దారితీస్తుంది. రాజ్యాంగ నియమాలు, విలువల కంటే మత విశ్వాసం ఉన్నతమైందనే భావన దేనినైనా సాధ్యం చేస్తుంది! మసీదును కూల్చటం కిరాతక చర్యగా సర్వోన్నత న్యాయస్థానం అభివర్ణించినా.. ప్రార్థనాలయాల పరిరక్షణ చట్టాన్ని సముచితమైందిగా పేర్కొన్నా.. జరుగుతున్న పరిణామాలను చూస్తే స్పష్టమయ్యేది అదే!

> స్థల ఉపయోగం, దాని స్వాధీనత, సుదీర్ఘకాలం అక్కడ ప్రార్థనలు, పూజలు జరగటం లాంటి అంశాలను సాక్ష్యాలుగా పరిగణించి సుప్రీంకోర్టు అయోధ్య తీర్పు ఇచ్చింది. జ్ఞానవాపి, మధుర మసీదుల్లో పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నం. అయోధ్య తీర్పు ప్రకారం చూస్తే వాటిని అక్కడ తొలగించటం అసాధ్యం! రాజ్యాంగ నియమాలు, విలువల కంటే మత విశ్వాసం ఉన్నతమైందనే భావన దేనినైనా సాధ్యం చేస్తుంది! మసీదును కూల్చటం కిరాతక చర్యగా సర్వోన్నత న్యాయస్థానం అభివర్ణించినా.. ప్రార్థనాలయాల పరిరక్షణ చట్టాన్ని సముచితమైందిగా పేర్కొన్నా.. జరుగుతున్న పరిణామాలను చూస్తే స్పష్టమయ్యేది అదే!

'గ్రీన్ సిమెంట్' అసాధ్యం కాదు


■ సునీతా నారాయణ్

మట్టివాసన

ప్రపంచ వ్యాప్తంగా, హరిత గృహ వాయు ఉద్గారాలను తగ్గించడం కష్టసాధ్యంగా ఉన్న రంగాలలో సిమెంట్ పరిశ్రమ ఒకటి. ఆర్థికాభివృద్ధి సాధనకు కీలకమైన ఈ పరిశ్రమ భారీ కర్బన ఉద్గారాలకు కూడా పేరు పొందింది. ప్రపంచవ్యాప్తంగా కార్బన్–డై–ఆక్సైడ్ (సిఓ2) ఉద్గారాలలో 7 శాతం సిమెంట్ ఫ్యాక్టరీల నుంచే వెలువడుతున్నాయి. సిమెంట్ తయారీలో కర్బన ఉద్గారాలు ఒక స్వతస్సిద్ధ భాగం. సిమెంట్ ఉత్పత్తికి వినియోగించే ముడి పదార్థం సున్నపురాయి. సిమెంట్ ఉత్పత్తికి సున్నపురాయి నుంచి కార్బన్–డై–ఆక్సైడ్‌ను విధిగా తొలగించి తీరాలి. ఇది మొత్తం కర్బన ఉద్గారాల తీవ్రతను పెంచుతోంది. ఈ భస్మీకరణ ప్రక్రియకు బట్టీలో చాలా తీవ్ర ఉష్ణోగ్రత (ఇంచుమించు 1450 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు) అవసరం ఎంతైనా ఉన్నది. ఈ భస్మీకరణకు ఇంధనం అవసరం. సిమెంట్ ఫ్యాక్టరీల నుంచి వెలువడే మొత్తం కర్బన ఉద్గారాలలో సగానికి పైగా ఉత్పత్తి ప్రక్రియ నుంచి వెలువడుతున్నవే కావడం గమనార్హం. మిగతావి కొలిమిలోని దహన చర్యల నుంచి ఉత్పన్నమవుతాయి. ఈ దృష్ట్యా ఈ పరిశ్రమను హరితీకరణ (గ్రీనింగ్) చేయడం కష్ట సాధ్యం. అయితే అసాధ్యం కాదు.

నేనూ, సిఎస్ఇ (సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్)లోని నా సహచరులు భారతీయ సిమెంట్ పరిశ్రమను సమగ్రంగా అధ్యయనం చేసి, దాని భవిష్యత్తుకు ఒక దీర్ఘకాలిక ప్రణాళిక (రోడ్ మ్యాప్)ను రూపొందించాము. భారత సిమెంట్ పరిశ్రమను డీ కార్బొనైజ్ (కర్బన ఉద్గారాల రహితంగా) చేసేందుకు ఎంతో చేయవలసి ఉన్నది. ఇది సమర్థంగా చేయగలిగితే ఇతర పరిశ్రమల్లో కూడా పరిస్థితిని చక్కదిద్దవచ్చని మా విశ్లేషణ స్పష్టం చేసింది. కర్బన ఉద్గారాల రహితంగా సిమెంట్‌ను ఉత్పత్తి చేయవచ్చని మేము చెప్పబోవడం లేదు. అయితే ఈ కీలక పరిశ్రమను సాధ్యమైనంతగా హరితీకరణ చేయవచ్చునని మేము దృఢంగా విశ్వసిస్తున్నాము.


భారత ప్రభుత్వ పర్యావరణ మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం 2016లో మొత్తం కర్బన ఉద్గారాలలో 5.63 శాతం సిమెంట్ పరిశ్రమ నుంచి వెలువడినవేనని తెలుస్తుంది. 2019 సంవత్సరంలో ఇది 5.72 శాతంగా ఉన్నదని కూడా ఆ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. సిమెంట్ పరిశ్రమ సత్వరమే అభివృద్ధి చెందుతోంది. చెందాలి కూడా. ఎందుకంటే దేశ ఆర్థికాభివృద్ధికి కీలకమైన మౌలిక సదుపాయాల కల్పనకు సిమెంట్ పరిశ్రమలో మరింత అధిక స్థాయిలో పెట్టుబడులు పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

భారతీయ సిమెంట్ పరిశ్రమ తొలి నుంచీ ఇతర దేశాలలోని ఆ రంగానికి లేనటువంటి అనుకూలతలతో ఉన్నది. ముఖ్యంగా ముడిపదార్థం నుంచి కార్బన్–డై–ఆక్సైడ్‌ను తొలగించడంలో ఈ అనుకూలతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇందుకు రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. అవి: సిమెంట్ తయారీకి సున్నపురాయి బదలు ఫ్లైయాష్ (థర్మల్ విద్యుత్కేంద్రాల నుంచి వెలువడే బూడి)ను ఉపయోగించడం; ఇంధన సామర్థ్యాన్ని కలిగి ఉండడం (ఇది ఇంధన వినియోగ వ్యయాలలో భారీ తగ్గుదలకు విశేషంగా తోడ్పడుతోంది). ఈ చర్యలు ఉత్పత్తి నాణ్యతకు, మార్కెట్ మన్నికకు విశేషంగా దోహదం చేస్తున్నాయి. ఈ పరిస్థితులు భవిష్యత్తులో కూడ సుస్థిరంగా ఉండే అవకాశం పూర్తిగా ఉన్నది.

వస్తువుల ఉత్పత్తిలో ఉపయోగించే పదార్థాలపై కర్బన ఉద్గారాల తీవ్రత ఆధారపడి ఉంటుంది. ఈ దృష్ట్యా మనం వివిధ రకాల సిమెంట్‌లను, అర్థం చేసుకోవల్సి వున్నది. వాతావరణ మార్పును నిరోధించేందుకు ఈ అవగాహన చాల ముఖ్యం. మనం ఉపయోగించుకునే సిమెంట్ మూడు రకాలుగా ఉంటుంది. (1) సాధారణ పోర్ట్ ల్యాండ్ సిమెంట్ (ఒపిసి) – దీని ఉత్పత్తికి సున్నపురాయిని ముడి పదార్థంగా వినియోగిస్తారు; (2) పొజ్జోలనా పోర్ట్ ల్యాండ్ సిమెంట్ (పిపిసి) – దీని తయారీకి ఫ్లైయాష్‌ను, పాక్షికంగా సున్నపురాయిని ఉపయోగిస్తారు; (3) పోర్ట్ ల్యాండ్ శ్లాగ్ సిమెంట్ (పిఎస్‌సి)– దీని ఉత్పత్తిలో సున్నపురాయికి బదులు శ్లాగ్ (లోహ మలం – కరిగించిన లోహం నుంచి బయటికి వచ్చిన మురికి)ను పాక్షికంగా ఉపయోగిస్తారు. భారతీయ ప్రమాణాల బ్యూరో మరోరకం సిమెంట్ (దీన్ని కాంపోజిట్ సిమెంట్ –సిసి అంటున్నారు)కు కూడా ప్రమాణాలను నోటిపై చేసింది. దీని ఉత్పత్తిలో సున్నపురాయికి ప్రత్యామ్నాయంగా ఫ్లైయాష్, శ్లాగ్‌ను గరిష్ఠంగా 60 శాతం మేరకు ఉపయోగిస్తారు. సిమెంట్ ఉత్పత్తిలో సున్నపురాయిని ఎంత తక్కువగా ఉపయోగిస్తే కర్బన ఉద్గారాలు అంత తక్కువగా వెలువడుతాయి. సున్నపురాయిని గరిష్ఠంగా ఉపయోగించుకునే ఒపిసి సిమెంట్, ప్రతి ఒక్క టన్ను సిమెంట్‌కు 0.84 టన్ను కార్బన్–డై–ఆక్సైడ్‌ను ఉద్గారిస్తుంది. పారిశ్రామిక వ్యర్థ పదార్థాన్ని ఉపయోగించుకునే పిఎస్‌సి ఉత్పత్తిలో కర్బన ఉద్గారాలు అర టన్ను కంటే తక్కువగా ఉంటాయి.

ప్రస్తుతం అతి తక్కువ ఉద్గారాలకు కారణమవుతున్న పిపిసి సిమెంట్‌కు మార్కెట్‌లో 65 శాతం వాటాను కలిగి ఉన్నది. అయితే మన దేశంలో ఇప్పటికీ ఒపిసి సిమెంట్‌నే అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్నారు. ఉత్పత్తి అవుతున్న మొత్తం సిమెంట్‌లో ఒపిసి సిమెంట్ 30 శాతం వరకూ ఉంటోంది. భారతీయ సిమెంట్ పరిశ్రమ పురోభివృద్ధికి సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ రూపొందించిన దీర్ఘకాలిక ప్రణాళిక ఒపిసి సిమెంట్ ఉత్పత్తిని నియంత్రించాలని సూచించింది. కేవలం 10 శాతం మేరకే దాని ఉత్పత్తిని అనుమతించాలని సిఫారసు చేసింది. 2030 సంవత్సరం నాటికి ఇతర రకాల సిమెంట్ ఉత్పత్తికి లక్ష్యాలను నిర్దేశించాలని పేర్కొంది. పిపిసి సిమెంట్ ఉత్పత్తిలో ఫ్లైయాష్ వినియోగాన్ని మరింతగా 35 శాతం నుంచి 45 శాతానికి పెంచాలని కూడా సిఫారసు చేసింది ఆ సిమెంట్‌ల వినియోగం పెరుగుతున్న కొద్దీ కర్బన ఉద్గారాల తీవ్రత తగ్గుతుంది.

సిమెంట్ పరిశ్రమ డీ కార్బొనైజేషన్‌కు అనుసరించాల్సిన రెండో మార్గం కంబశ్చన్ (దహన క్రియ – ప్రాణవాయువుతో కాంతిని, ఉష్ణాన్ని కలిగించే రసాయనిక చర్య) ప్రక్రియ స్థానంలో ఇంధనాన్ని ఉపయోగించడం. దీనివల్ల వ్యర్థ పదార్థాల



> సిమెంట్ తయారీలో సున్నపురాయికి ప్రత్యామ్నాయంగా వేరే ముడి పదార్థాలను ఉపయోగించి ఉత్పత్తి చేసిన, బొగ్గుకు బదులు పునరుద్ధరణీయ ఇంధనంతో ఉత్పత్తి అవుతున్న సిమెంటును హరిత, తక్కువ కార్బన్ సిమెంట్‌గా నిర్వచించాలని ప్రభుత్వానికి సిఎస్ఇ సిఫారసు చేసింది. తదనుగుణంగా, భారతీయ సిమెంట్ పరిశ్రమ తన ఉత్పత్తిని 2030 సంవత్సరం నాటికి రెట్టింపు చేసినా కర్బన ఉద్గారాలను సగానికి తగ్గించుకోవడం సాధ్యమవుతుంది.

నిర్వహణకు అవకాశాలు మెరుగవుతాయి. సిమెంట్ పరిశ్రమ ప్రస్తుతం ప్రధానంగా బొగ్గు, లిగ్నైట్, పెట్‌కోక్‌పై ఆధారపడుతోంది వీటి వాడకాన్ని తగ్గించడం వల్ల ఉద్గారాల తీవ్రత కూడా తగ్గుతుంది. చాలా సిమెంట్ కంపెనీలు నేడు తమ బట్టీలలో భస్మీకరణకు మునిసిపల్ ఘన వ్యర్థాలను ఉపయోగించుకుంటున్నాయి. అయితే అది సిమెంట్ తయారీకి పూర్తిగా అనువైన ఇంధనం కాదు. కనుక చెత్తచెదారాన్ని ప్రాసెస్ చేసి దాన్ని బొగ్గుకు ప్రత్యామ్నాయ ఇంధనంగా ఉపయోగించుకోవచ్చు.

సిమెంట్ తయారీలో సున్నపురాయికి ప్రత్యామ్నాయంగా వేరే ముడి పదార్థాలతో ఉత్పత్తి చేసిన, బొగ్గుకు బదులు పునరుద్ధరణీయ ఇంధనంతో ఉత్పత్తి అవుతున్న సిమెంట్‌ను హరిత, తక్కువ కార్బన్ సిమెంట్‌గా నిర్వచించాలని ప్రభుత్వానికి సిఎస్ఇ సిఫారసు చేసింది. తద్వారా, భారతీయ సిమెంట్ పరిశ్రమ తన ఉత్పత్తిని 2030 సంవత్సరం నాటికి రెట్టింపు చేసినా కర్బన ఉద్గారాలను సగానికి తగ్గించుకోవడం సాధ్యమవుతుంది. ఈ హరిత సిమెంట్‌కు జీఎస్టీ తక్కువగా ఉంటుంది. ఇది అటు ఉత్పత్తిదారుకు, ఇటు వినియోగదారుకు, మరీ ముఖ్యంగా పర్యావరణ భద్రతకు హితకరమైనదిగా చెప్పవచ్చు. అయితే ఈ హరిత భారతదేశాన్ని నిర్మించేందుకు ప్రభుత్వమూ పారిశ్రామికవేత్తలతో పాటు వినియోగదారులు కూడా పూర్తిగా సహకరించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్'

'బెల్టు' తీయాలి సీఎం గారూ!?

తెలంగాణ సమాజాన్ని నైతికంగా, ఆర్థికంగా పతనం చేస్తున్న మద్యం బెల్టుషాపులు తక్షణం తొలగించాల్సిన అవసరం ఉంది. సంపూర్ణ మద్యనిషేధం సాధ్యం కాకపోయినా బెల్టుషాపులు తొలగించడం, లైసెన్సు షాపుల అమ్మకం సమయాలు క్రమబద్ధీకరణ చేయడం ద్వారా కనీసం మద్య నియంత్రణ చేసే అవకాశం ఉంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రామాలలో బెల్టుషాపులు విచ్చలవిడిగా పెరిగిపోయాయి. ఒక్కో గ్రామానికి అరడజను నుంచి డజను దాకా అధికారిక మద్యం షాపులు నడుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఒకటి, రెండు మినహాయిస్తే ప్రతి కిరాణా షాపు, బడ్డీ కొట్టు మద్యం అమ్మకం రిటైల్ దుకాణాలుగా మారిపోయాయి. ఫలితంగా కూలీ–నాలీ చేసుకునేవారు, ముఖ్యంగా 18 సంవత్స రాలలోపు పిల్లలు, కొందరు మహిళలు కూడా మద్యం మహమ్మారికి బానిసలుగా మారిపోతున్నారు. పేదకుటుంబాలు ఈ వ్యసనంతో ఛిద్రం అవుతున్నాయి.



మద్యానికి బానిసలైన వారు అనారోగ్యం పాలై ఆస్పత్రుల చుట్టూ తిరగడం ద్వారా ఆర్థికంగా కోలుకోలేక కుటుంబాలు పతనం అవుతున్నాయి. అనేక అనైతిక సంఘటనలకు ఈ మద్యం మహమ్మారి కారణం అవుతున్నది. పట్టుమని 30ఏళ్ళు నిండకుండానే మద్యానికి బానిసలయిన యువత మరణిస్తున్నారు. దీంతో చిన్న వయస్సులోనే కొందరు యువతులు ఒంటరి మహిళలుగా మారటంతో అర్థంతరంగా కుటుంబభారం వారి నెత్తిన పడుతున్నది. తెలంగాణలో ఒంటరి మహిళల పెన్షన్ల పెరుగుదల గణాంకాలను పరిశీలిస్తే మద్యం మహమ్మారి ఎంత దారుణంగా కుటుంబాలను ఛిద్రం చేస్తుందో అర్థం అవుతుంది. అనేక పేదకుటుంబాలు ఈ మద్యం మూలంగా సరైన ఆహారం కూడా తినలేని పరిస్థితిలో ఉన్నాయి.

2014లో తెలంగాణలో ఆరువేల కోట్ల రూపాయల మద్యం అమ్మకాలు జరిగితే! 2024నాటికి అది 36వేల కోట్లకు పెరిగింది. గడచిన పదేళ్ళలో ఆరు రెట్లు మద్యం అమ్మకాలు పెరగడంతో పాటు అదే స్థాయిలో మద్యం మరణాలు, వివిధ జబ్బులు పెరిగాయి. బెల్టుషాపుల ద్వారా మద్యం అందుబాటులో ఉండడం వల్లే ఈ అనర్థాలు జరుగుతున్నాయి. మద్యం షాపులు పెంచుతున్న పాలకులు, మద్యం మానడం కోసం కౌన్సిలింగ్ సెంటర్లు, మద్యం డీ–ఎడిక్ట్ కేంద్రాలు పెంచకపోవడం విస్మయం కలిగిస్తోంది.

ఇకపోతే మద్యానికి బానిసలయిన యువత మద్యం మత్తుచాలక గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారు. ఈ డ్రగ్స్ మహమ్మారి పబ్‌లను దాటి అత్యంత గౌరవప్రదమైన కళాశాలలు, పాఠశాలల ముంగిటకు వచ్చేశాయి. సిగరెట్లలో, చాక్లెట్లలో విచ్చలవిడిగా గంజాయి, డ్రగ్స్ నింపి అమ్మకాలు చేస్తున్నారు. ఫలితంగా భవిష్యత్తు తరం కూడా తెలంగాణలో మత్తుబానిసలుగా మారి, సమాజంలో విలువలు పతనం వైపు ప్రయాణం చేస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. నిషేధిత గుట్కా (పొగాకు ఉత్పత్తులు) యధేచ్ఛగా అమ్మకం జరుగుతున్నాయి. ఇవన్నీ గత పాలకులకు తెలియక కాదు? ఆయా వ్యాపారాలు తమ నాయకుల కనుసన్నల్లో జరగడమే ప్రధాన కారణం. నిరోధించాల్సిన అధికారగణం చేష్టలుడిగి చూస్తూ ఉండిపోవడమే కాక, ఆ మత్తుపదార్థాల అవినీతి రొంపిలో పీకల్లోతు కూరుకుపోయింది. మద్యం నియంత్రణకు ఏర్పడిన ఎక్సైజ్ శాఖ పనీతీరు అందుకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు మరింత విస్తృతపరిచే శాఖగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి.

తెలంగాణలో నూతన ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాల నిరోధం కోసం చేపట్టిన చర్యలు ప్రశంసనీయంగా ఉన్నాయి. అయితే 36వేల కోట్ల రూపాయల మద్యం అమ్మకాల రాబడిని ప్రస్తుత పరిస్థితిలో ప్రభుత్వం వదులుకుంటుందా అన్న అనుమానాలు కూడా ప్రజల్లో ఉన్నాయి. అయినా ప్రజల బాగోగులు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాగ్దానం చేసిన విధంగా తక్షణం పట్టణాలు, గ్రామాలలోని బెల్టుషాపులు మూయించాలి. మునుగోడు శాసనసభ్యుడు రాజగోపాల్ రెడ్డి లాగా తమ తమ నియోజకవర్గాల్లో బెల్టుషాపులు నిరోధించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై కూడా ఉంది. ప్రజలు కూడా బెల్టుషాపులు

'మహాలక్ష్మి' బస్సు అసెంబ్లీ దాకా నడవాలి!

తెలంగాణ శాసనసభ ఎన్నికల ఫలితాలను మహిళలే ప్రభావితం చేశారు. ఎన్నికలలో 1,13,65,697 మంది పురుషులు, 1,14,46,644 మంది స్త్రీలు ఓటు వేశారు. పురుషుల కంటే మహిళలే అధికంగా ఓటు వేసిన 56 నియోజకవర్గాలలో నాటి అధికార పక్షానికి 13 సీట్లు మాత్రమే లభించాయి. మహిళలలోని ఈ రాజకీయ చైతన్యం రాజకీయ సాధికారతకు దారి వేయగలదా?

స్వంత పార్టీలో ఎన్నో ఒత్తిళ్ళు ఉన్నా, పార్టీ నష్టపోయే అవకాశం ఉన్నా తెలంగాణకు కట్టుబడిన సోనియాగాంధీ, తెలంగాణ ప్రస్తావనలతో, ప్రశ్నలతో నెలల తరబడి పార్లమెంటుపై ఒత్తిడి కొనసాగించిన సుష్మా స్వరాజ్ రాష్ట్ర అవతరణలో కీలక పాత్ర పోషించారు. మరి తెలంగాణ శాసనసభకు ఎంతమంది మహిళలు ఎన్నిక అవుతున్నారు? 2018నాటి ఆరుగురి సంఖ్యతో పోల్చితే 2023లో పదిమంది కొంత మెరుగే అయినా, మహిళా శాసనసభ్యులు మొత్తం మీద ఎనిమిది శాతం దాటలేదు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆరంభించిన మహాలక్ష్మి (మహిళల ఉచిత బస్సు ప్రయాణం)పై ఎన్ని వ్యాఖ్యలు వచ్చినా మహిళల ఆర్థిక సాధికారతకు 'మహాలక్ష్మి' కీలకం. 'గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్టు 2023' ప్రకారం 146 దేశాలలో భారత్‌కు 127వ స్థానం దక్కింది. మన దేశంలో కార్మిక శక్తిలో మహిళల భాగస్వామ్యం 28.26శాతం. పట్టణాలలో మరీ తక్కువ. ఇది అమెరికాలో 56 శాతం, చైనాలో 63శాతం, జపాన్‌లో 54శాతం, జర్మనీలో 55 శాతంగా ఉంది. ఆ స్థాయిలో కార్మిక శక్తిలో మహిళల భాగస్వామ్యం పెరిగితేనే 2047నాటికి భారత్ అధిక ఆదాయ దేశంగా మారే అవకాశం ఉంది. ఇందుకు మహిళల మొబిలిటీ పెంచడం (ఉచిత బస్సు ప్రయాణం) కొంత తోడ్పాటు ఇస్తుంది. కనీసం పని కోసం నడిచి వెళ్ళే వారికి సమయం ఆదా అవుతుంది. పని ప్రదేశాలు అందుబాటులోకి వస్తాయి. ఇంటికి, వంటింటికి మాత్రమే పరిమితం కాకుండా తమ చుట్టూ ఉన్న సమాజాన్ని పరిశీలించడానికి అవకాశం లభిస్తుంది.

కానీ ఇది మాత్రమే సరిపోదు. 'సమయ పేదరికం' (టైం పావర్టీ) మరో అవరోధం. మహిళలు ప్రయాణించాలన్నా, ఉద్యోగం చేయాలన్నా ముందు వారికి తీరిక సమయం ఉండాలి కదా. భారత్‌లో చేసిన ఏకైక 'టైం యూస్ సర్వే' ప్రకారం 75శాతం మహిళలు రోజూ 204 నిమిషాలు వంట, భోజన ఏర్పాట్ల కోసం, మరో 100 నిమిషాలు ఉచిత గృహ సేవల కోసం వెచ్చిస్తారు. ఇది 'సమయ పేదరికం' సృష్టిస్తుంది. మహిళలు ఇంట్లో ఉచితంగా చేసిపెట్టే సేవలకు కనీస వేతనాలు చెల్లిస్తే దేశ జీడీపీలో 9 శాతం అవుతుందని ఐఎలఓ లెక్క గట్టింది. ఖర్చు గురించి సందేహించేవారు 'మహాలక్ష్మి' పథకం చంద్రుడికో నూలు పోగు వంటిది మాత్రమేనని గుర్తించాలి. తెలంగాణ మహిళలు ఇంతకు మించిన అధికారాలకు అన్ని విధాలా అర్హులు.

> మహిళలు ఇంట్లో ఉచితంగా చేసిపెట్టే సేవలకు కనీస వేతనాలు చెల్లిస్తే దేశ జీడీపీలో 9 శాతం అవుతుందని ఐఎలఓ లెక్క గట్టింది. ఖర్చు గురించి సందేహించే వారు 'మహాలక్ష్మి' పథకం చంద్రుడికో నూలుపోగు వంటిది మాత్రమేనని గుర్తించాలి. తెలంగాణ మహిళలు ఇంతకు మించిన అధికారాలకు అన్ని విధాలా అర్హులు.



'అభయహస్తం' అమలు కోసం ప్రజా పాలన (గ్రామ సభలు నిర్వహించడం) వల్ల దరఖాస్తుల స్వీకరణను మించిన సామాజిక ప్రయోజనం– గ్రామ సభలో పాల్గొనాలనే చైతన్యం ప్రజలలో, ముఖ్యంగా మహిళలలో కలిగి– ప్రత్యక్ష ప్రజాస్వామ్యపు పునాది శక్తివంతమవుతుంది. గ్రామ సభా సంస్కృతి – అంటే పెద్ద సంఖ్యలో గ్రామ సభలో పాల్గొనే సంస్కృతి – శుభ పరిణామం.

'గ్రామ స్వరాజ్'కు గ్రామసభ గుండె వంటిది. గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాలో నమోదయిన ఓటర్లందరూ గ్రామసభ సభ్యులే. గ్రామ సభలో గ్రామీణుల హాజరు వల్ల సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుంది. ప్రభుత్వ పనుల సామాజిక తనిఖీకి గ్రామ సభ వేదిక అవుతుంది. గ్రామ సభలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటే బాలలు, మహిళల సమస్యలపై చర్చకు, పరిష్కారానికి అవకాశం ఏర్పడి, తెలంగాణ గ్రామాలు బాలలకు, మహిళలకు స్నేహ పూర్వకమైన గ్రామాలుగా గుర్తింపు పొందుతాయి. అయితే గ్రామ సభలో పాల్గొనేందుకు మహిళలు ముందుకు రావాలంటే వారికి ప్రత్యక్ష ప్రజాస్వామ్య అవశ్యకత గురించి వివరంగా చెప్పడం కూడా అవసరం. ఇందుకు క్షేత్ర స్థాయి కార్మికులు, పౌర సమాజ ప్రతినిధులు గృహ సందర్శనలు చేయాలి. వారికి అందుకు తగిన శిక్షణ అందించాలి.

మహిళా గ్రామ సభల (గ్రామ సభలో ఎక్కువ మహిళలు హాజరు కావటం) వల్ల మహిళా సర్పంచులు క్రియాశీలంగా మారే అవకాశం ఉన్నది. తెలంగాణలో ఆరు వేలకు పైగా మహిళా సర్పంచులు ఉన్నారు. వీరు ఒకటి రెండు మార్లు సర్పంచులుగా పని చేసి కనుమరుగు అవుతున్నారు. వీరిలో సామర్థ్యం, పట్టుదల ఉన్న వారిని కొంత శిక్షణతో శక్తివంతమైన నేతలుగా మార్చే అవకాశం ఉంది. అట్టి మహిళా సర్పంచులను గుర్తించి నాయకత్వ శిక్షణ అందిస్తే సర్పంచుగానే ఆగిపోకుండా శాసనసభ సభ్యులుగా, పార్లమెంటు సభ్యులుగా ఎదుగుతారు. 2029 నాటికి 'నారీ శక్తి వందన్ చట్టం' అమలు అయితే శాసనసభలో 40కి పైగా మహిళా సభ్యులు ఉండాలి. వారు రాజకీయ కుటుంబాల చాటు నుంచి కాకుండా – పాలనానుభావం గలిగిన మహిళా సర్పంచుల నుండి వస్తే అది ప్రజాస్వామ్య విజయం.

• శ్రీనివాస్ మాధవ్
సీనియర్ ఫాకల్టీ,





కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలను నిరాశకు గురి చేసింది. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ఆకట్టుకునేందుకు తాత్కాలిక బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు ఆర్థిక మంత్రి వరాలు ప్రకటిస్తుందని ఆశపడ్డారు. తీరా మొండిచేయి చూపారు. ఓట్ ఆన్ ఎకౌంట్ బడ్జెట్ అయినందున చెప్పుకోదగిన ప్రకటనలు, ప్రతిపాదనలు, కేటాయింపులు ఏమీ లేవు. ఈ క్రమంలోనే ఉమ్మడి జిల్లాకూ ఎలాంటి వరాలు, కేటాయింపులు దక్కలేదు. ప్రతిపాదనలు కూడా ప్రస్తావనకు రాలేదు. దీంతో జిల్లా ప్రజలు ఉసూరుమన్నారు.

మళ్లీ మొండిచేయి!

నిరాశ మిగిల్చిన నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్

- ఉమ్మడి వరంగల్ జిల్లాకు నిధుల కేటాయింపులు నిల్
- ఊసులేని కాజీపేట డివిజన్
- ప్రస్తావనకు రాని బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన వర్సిటీ
- మేడారం జాతరకు జాతీయ హోదాను మరిచిన కేంద్రం
- అన్నదాతల ఆశలపై నీళ్లు
- పేద, మధ్య తరగతులకు మరో రెండు కోట్ల ఇళ్లు

హనుమకొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఉమ్మడి వరంగల్ జిల్లాను కనికరించలేదు. ఏళ్లతరబడి ఎదురుచూస్తున్న పనులకు మోక్షం కలగలేదు. గురువారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉమ్మడి జిల్లా ప్రజలకు మొండిచేయి చూపింది. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న పనులను పట్టించుకోనే లేదు.

కలగానే..

ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన కాజీపేట జంక్షన్‌ను డివిజన్‌గా ఉన్నతీకరణ ఊసే లేదు. కొత్త రైలు మార్గాల ప్రస్తావన అసలే లేదు. రాష్ట్ర విభజన హామీ అయిన మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ కల ఈ సారి కూడా సాకారం కాలేదు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం పార్లమెంట్‌లో ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో ములుగులో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటును ప్రస్తావించారు. దీంతో నిర్మలమ్మ బడ్జెట్‌లో ఈ విశ్వవిద్యాలయానికి అదనంగా నిధులేమైనా ప్రకటిస్తారేమో..? లేదా ప్రత్యేకంగా ప్రకటన ఏమైనా ఉంటుందేమోనని ఆశించారు. కానీ అలాంటిది ఏమీ లేక పోవడంతో ప్రజలు అసంతృప్తికి లోనయ్యారు. వరంగల్ జిల్లా గీసుగొండలో నిర్మాణంలో ఉన్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పీఎం మిత్ర పథకం కింద ఎంపికైన దృష్ట్యా దీనికి ఈ బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులేమైనా కేటాయింపులు జరగొచ్చని కూడా జిల్లా ప్రజలు ఆశించారు. కానీ బడ్జెట్‌లో ఆ ఊసే ఎత్త లేదు.

గిరిజన జాతరపై మళ్లీ చిన్నచూపు

వచ్చే నెల చివరి వారంలో ఆసియాలోనే అతిపెద్దదైన.. గిరిజన కుంభమేళాగా భావించే సమ్మక్క - సారలమ్మ జాతర జరగబోతోంది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈ జాతరకు జాతీయ హోదా కల్పిస్తుందని బీజేపీ అగ్ర నాయకులు వాగ్దానం చేశారు. దీంతో బడ్జెట్‌లో జాతరకు జాతీయ హోదా కల్పిస్తున్నట్టు ఆర్థిక మంత్రి ప్రకటన చేస్తారేమోనని అంతా ఎదురు చూశారు. కానీ అలాంటి ప్రస్తావనే లేదు.

పాత పన్ను బకాయిలు రద్దు

బడ్జెట్‌లో పాత ఆదాయపు పన్ను బకాయిలను మాఫీ చేస్తున్నట్టు ప్రకటించడంతో టాక్స్ పేయర్లలో కొంతమేరకు సంతోషం వ్యక్తం అవుతోంది. ఆదాయ పన్ను బకాయిలు వసూలు చేసేందుకు ఆదాయం పన్ను శాఖ ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ సాధ్యం కాలేదు. దీంతో కేంద్ర ప్రభుత్వం వాటిని రద్దు చేయాలని నిర్ణయించుకున్నది. ఈ మేరకు 2009-10 ఆర్థిక సంవత్సరానికి ముందువరకు ఉన్న రూ.25వేలలోపు ఆదాయపన్ను పాత బకాయిలన్నిటినీ రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. దీనివల్ల ఉమ్మడి జిల్లాలో 10 వేల మందికి లాభం జరుగుతుంది. అలాగే 2010 నుంచి 2014 వరకు రూ.15వేలలోపు పేరుకుపోయి ఉన్న ఆదాయం పన్ను పాత బకాయిలను సైతం రద్దు చేశారు. దీని వల్ల మరో 5 వేల మందికి లబ్ధి చేకూరనున్నది.

చిన్న వ్యాపారులకు ఊరట

రూ.2కోట్లలోపు టర్నోవర్ కలిగిన చిన్న వ్యాపారులకు ప్రస్తుతం ఆడిట్ అవసరం లేదు. ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.3కోట్లకే ప్రభుత్వం పెంచింది. రూ.3కోట్లలోపు వార్షిక వ్యాపార లావాదేవీలు కలిగిన వ్యాపారులకు ఆడిట్‌తో పని లేదు. ప్రభుత్వం కల్పించిన ఈ వెసులుబాటు వల్ల ఉమ్మడి జిల్లాలో మొత్తంగా 30వేల మందికి పైగా చిన్న వ్యాపారులకు లాభం జరుగనున్నది. ఉమ్మడి జిల్లాలో ఆదాయం పన్ను చెల్లింపుదారులు లక్షా 50వేల మంది వరకు ఉన్నారు. అయితే రూ.3కోట్ల లోపు వార్షిక టర్నోవర్‌లో ఆదాయం 8 శాతం అంటే రూ.24 లక్షల వరకు చూపించాలి. ఇంతకన్నా తక్కువ ఆదాయం చూపిస్తే ఈ వెసులుబాటు వర్తించదు.

వృత్తిదారులకూ వెసులుబాటు

డాక్టర్లు, న్యాయవాదులు ఇతరత్రా వృత్తిదారులకు కూడా బడ్జెట్‌లో కొంత ఊరట కల్పించారు. రూ.50లక్షల లోపు టర్నోవర్ ఉండి 50శాతం ఆదాయం (రూ.24లక్షలు) చూపించిన వారికి ప్రస్తుతం ఆడిట్ చేయించాల్సిన అవసరం లేదు. ఇప్పుడు బడ్జెట్‌లో ఈ మొత్తాన్ని ప్రభుత్వం రూ.75 లక్షలు చేసింది. అంటే వార్షిక టర్నోవర్ రూ.75లక్షలు ఉంటే ఈ మొత్తంలో 50శాతం అంటే రూ.35లక్షల ఆదాయం చూపిస్తే ఆడిట్ అవసరం ఉండదు. ఈ ఆదాయం మొత్తం మీదే పన్ను విధింపు ఉంటుంది. అయితే రూ.వార్షిక టర్నోవర్ రూ.50లక్షలు దాటితే మళ్లీ ఆడిట్‌కు పోవలసి వచ్చేది. దీనిని రూ.75లక్షలకు పెంచడంవల్ల వృత్తిదారులకు ఊరట లభించినట్లయింది. దీని వల్ల ఉమ్మడి జిల్లాలో ఆరేడు వందల మందికి లబ్ధి కలుగుతుంది. ఆదాయం పన్నుకు సంబంధించి మిగతా స్లాబ్‌ల్లో ఎలాంటి మార్పులు చేయలేదు.

రైల్వే కేటాయింపులు చేశారిలా..

- కాజీపేట-బల్లార్షా మధ్య వివిధ పనులకు కేంద్ర బడ్జెట్‌లో మొత్తం రూ.1749.48 కోట్లను కేటాయించారు. మూడోలైన్, ఆర్‌పీఆర్‌లు, ఆగ్యుమెంటేషన్, అండర్‌ఫ్లోర్ వీల్ లేథ్ తదితర పనులు వీటిలో ఉన్నాయి.
- కాజీపేట-బల్లార్షా మధ్య మందమర్రి నుంచి రాఘవాపూర్ స్టేషన్ వరకు మూడోలైన్ విస్తరణకు రూ.1437.95కోట్లు
- సికింద్రాబాద్-కాజీపేట మధ్య లెవల్ క్రాసింగ్ స్థానంలో రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.18.06కోట్లు
- కాజీపేట-విజయవాడ మధ్య 80వ నెంబర్ లెవల్ క్రాసింగ్ స్థానంలో రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.15.06కోట్లు
- కాజీపేట-కామ్‌టెక్ డిజైన్ పిట్‌లైన్ (24 కోచ్‌ల పొడవు) నిర్మాణానికి రూ.7.55కోట్లు
- కాజీపేట వ్యాగన్ పీరియాడికల్ ఓవర్ హాలింగ్ వర్క్ షాపు కోసం రూ. 150 కోట్లు
- కాజీపేట (ఎలక్ట్రికల్ లోకోషెడ్) 125 నుంచి 175 కిమీ మధ్య హోమింగ్ కెపాసిటీ ఆగ్యుమెంటేషన్ కోసం రూ. 1.70 కోట్లు
- కాజీపేట లోకోషెడ్-వించ్ ప్లస్ షెడ్ కలుపుకొని సీఎన్‌సీ అండర్‌ఫ్లోర్ వీల్ లేత్ ఏర్పాటుకు రూ.9.16కోట్లు
- భద్రాచలం రోడ్డు-డోర్నకల్ సెక్షన్ (54.65 కి.మీ) రైల్వే పనులకు రూ.100కోట్లు
- కాజీపేట-భద్రాచలం (201-04 కి.మీ.) వద్ద మందమర్రి - రాఘవాపురం స్టేషన్ (33.42 కి.మీ మూడోలైన్ నిర్మాణానికి రూ.1447.95కోట్లు

రైతులకు నిరాశ

ఈ బడ్జెట్‌లో రైతులకు నిరాశే ఎదురైంది. రైతు సంక్షేమానికి, పంటల గిట్టుబాటు ధరల విషయంలో ఎలాంటి ప్రకటనలు లేవు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా రైతులకు తీపి కబురు అందిస్తుందని ఆశించారు. పంట పెట్టుబడిగా ప్రస్తుతం అందచేస్తున్నసాయాన్ని రూ.6వేల నుంచి రూ.10వేలకు పెంచవచ్చునని భావించారు. కానీ ఈవిషయంలో బడ్జెట్‌లో ఎలాంటి ప్రస్తావన లేకపోవడంతో అన్నదాతలు నిరాశకు లోనయ్యారు. పంటల గిట్టుబాటు ధరల విషయమై కూడా ఎలాంటి ప్రకటన చేయలేదు, కానీ పండిన పంటల నిల్వ కోసం ఆధునాతన గోదాముల నిర్మాణం తదితర ప్రాతిపదిక సౌకర్యాల కల్పనకు రూ.లక్షకోట్లను కేటాయించినట్టు ప్రకటించారు. దీనివల్ల తమకు ఒరిగేదేమీ లేదని రైతులు పెదవి విరుస్తున్నారు.

వేతన జీవులకు కాస్త ఊరట

బడ్జెట్‌లో వేతన జీవులకు కొంత ఊరట కల్పించారు. ఏడాదికి రూ.7 లక్షల వరకు ఎలాంటి ఆదాయ పన్ను ఉండబోదని ఆర్థికమంత్రి ప్రకటించారు. దీనివల్ల ఉమ్మడి జిల్లాలో సుమారు 50 వేల మందికి లబ్ధి చేకూరనున్నది. ఆదాయం పన్ను మినహాయింపు మొత్తాన్ని రూ.7 లక్షల నుంచి రూ.10లక్షల వరకు పెంచితే బాగుండేదన్న అభిప్రాయం పన్ను చెల్లింపుదారుల్లో వ్యక్తం అవుతోంది.

సొంతింటి కల సాకారం దిశగా..

ప్రధానమంత్రి ఆవాస యోజన కింద రానున్న ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో మరో రెండు కోట్ల ఇళ్లను నిర్మించనున్నట్టు ఆర్థికమంత్రి ప్రకటించారు. ఈ పథకం కింద కేంద్రం రూ.1.25 లక్షల వరకు ఆర్థికసాయాన్ని అందచేస్తుంది. మిగతాది లబ్ధిదారులు సమకూర్చుకోవలసి ఉంటుంది. అలాగే మధ్యతరగతి కోసం ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు ఆర్థిక మంత్రి తెలిపారు. జిల్లాలు, బ్లాక్‌ల అభివృద్ధికి రాష్ట్రంతో కలిసి పనిచేస్తామని ప్రకటించడం వల్ల ఉమ్మడి జిల్లాలోని వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధికి నోచుకునేందుకు అవకాశం ఏర్పడింది. రూఫ్ టాప్ సోలార్ ఎనర్జీని ప్రోత్సహించేందుకు బడ్జెట్‌లో రాయితీ ప్రకటించారు. రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లు కలిగి ఉన్నవారికి నెలకు రూ.300యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కేంద్రం ప్రకటించింది.

యువతకు చేయూత

యువతను ఆదుకునేందుకు, వారికి ఉపాధి కల్పన లక్ష్యంగా రూ.లక్ష కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయనున్నట్టు చేసిన ప్రకటన విద్యావంతులు, నిరుద్యోగుల్లో కొత్త ఆశలను రేపింది. చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం పెట్టుబడిసాయాన్ని అందచేస్తుంది. దీని వల్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిన్నతరహా పారిశ్రామిక యూనిట్ల స్థాపనకు తగిన ప్రోత్సాహం లభించినట్లవుతుందని భావిస్తున్నారు.

నేటి నుంచి గ్రామాల్లో ప్రత్యేక పాలన

- హనుమకొండ జిల్లాలో 208 పంచాయతీలు
- 128 మంది అధికారుల నియామకం

మండలం	జీపీలు	అధికారులు
ఆత్మకూరు	16	8
భీమదేవరపల్లి	22	15
దామెర	14	6
ధర్మసాగర్	19	15
ఎల్కతుర్తి	19	12
హసన్‌పర్తి	15	14
ఐనవోలు	17	12
కమలాపూర్	24	11
నడికూడ	14	10
పరకాల	10	9
శాయంపేట	24	8
వేలేరు	14	8

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 1: గ్రామ పంచాయతీల్లో శుక్రవారం నుంచి ప్రత్యేక అధికారుల పాలన అమలులోకి రానుంది. గురువారంతో పంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసింది. పంచాయతీల ఎన్నికలు నిర్వహించని రాష్ట్రప్రభుత్వం.. పాలనా వ్యవహారాల నిర్వహణకు గాను ప్రత్యేక అధికారులను నియమించింది. ప్రత్యేక అధికారులు శుక్రవారం నుంచి పంచాయతీల నిర్వహణ బాధ్యతలు నిర్వహించనున్నారు. కాగా, హనుమకొండ జిల్లాలో ఆత్మకూరు, శాయంపేట, పరకాల, దామెర, నడికూడ, ఐనవోలు, హసన్‌పర్తి, కమలాపూర్, భీమదేవరపల్లి, ఎలుకతుర్తి, ధర్మసాగర్, వేలేరు మండలాల్లో 208 పంచాయతీలుండగా, 128 మంది ప్రత్యేక అధికారులను నియమించారు. సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఒక్కో అధికారికి రెండు నుంచి మూడు పంచాయతీల బాధ్యతలు అప్పగించారు. మేజర్ పంచాయతీల బాధ్యతలను గెజిటెడ్ స్థాయి అధికారులకు, మిగతా పంచాయతీలకు నాన్ గెజిటెడ్ అధికారులను నియమించారు. ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పంచాయతీల పాలనా వ్యవహారాలు నిర్వహించనున్నారు. నిధుల వినియోగానికి వీరిద్దరికి చెక్ పవర్ ఉంటుంది.

ఆందోళనలో సర్పంచ్‌లు

ఆరు మాసాలపాటు పదవీకాలం పొడగించాలని ప్రభుత్వాన్ని కోరిన సర్పంచ్‌లు.. కోర్టును ఆశ్రయించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనులకు ఖర్చు చేసిన డబ్బులు చాలా మంది సర్పంచ్‌లకు రావాల్సి ఉంది. గత ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో సర్పంచ్‌లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. పలుమార్లు గత ప్రభుత్వం చుట్టు తిరిగినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. నూతన ప్రభుత్వం ఏర్పడి రెండు మాసాలే కావడం.. ఈలోపు సర్పంచ్‌ల పదవీకాలం పూర్తి కావడంతో బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. పెండింగ్ బిల్లులు ప్రభుత్వం చెల్లిస్తుందా లేదా అని తాజా మాజీ సర్పంచ్‌లు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

ప్రారంభమైన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 1: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. గురువారం నుంచి మొదటి విడత ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎ.గోపాల్ తెలిపారు. ఉదయం జనరల్ విభాగంలో నిర్వహించిన పరీక్షకు 1,023 మందికిగాను 966 మంది హాజరు కాగా, 57 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే వొకేషనల్ విభాగంలో 763 మందికి గాను 661 మంది హాజరు కాగా, 102 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 1,786 మంది విద్యార్థులకు 1,627 మంది హాజరుకాగా, 159 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలో జనరల్ విభాగంలో 569మంది విద్యార్థులకుగాను 533 హాజరుకాగా 26 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ విభాగంలో 693గాను 648 మంది హాజరు కాగా, 45 మంది గైర్హాజరు అయ్యారు. మొత్తంగా 1,262 మందికి గాను, 1181 హాజరు కాగా 71 మంది గైర్హాజరు అయినట్లు ఆయన తెలిపారు.

రేషన్ కార్డుదారులు ఈ-కేవైసీ చేసుకోవాలి

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 1: జిల్లాలోని రేషన్ కార్డుదారులు విధిగా ఈ-కేవైసీ చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పి.వసంతలక్ష్మీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పౌరసరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ నెల 29వ తేదీలోపు సమీపంలోని రేషన్ దుకాణాలలో వేలిముద్రలు (ఇ-కేవైసీ) ఇవ్వాలని సూచించారు.

హక్కుల సాధనకు శ్రామిక మహిళలు ఉద్యమించాలి

- సీఐటీయూ జాతీయ కార్యదర్శి ఏఆర్ సిందూ
- బాలవికాసలో సీఐటీయూ జాతీయ సమావేశాలు



సీఐటీయూ జాతీయ సమావేశాల్లో మాట్లాడుతున్న సిందూ

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 1: శామిక మహిళల హక్కులపై కేంద్ర బీజేపీ ప్రభుత్వం దాడి చేస్తోందని, దేశ మహిళలు హక్కుల సాధన కోసం ఉద్యమించాలని సీఐటీయూ జాతీయ కార్యదర్శి ఏఆర్ సిందూ పిలుపునిచ్చారు. సీఐటీయూ జాతీయ సమావేశాలు హనుమకొండ జిల్లా కాజీపేట ఫాతిమానగర్‌లోని బాలవికాసలో గురువారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు ముఖ్య కార్యకర్తలు, నాయకులతో కలిసి సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి నర్సికొట్టె అమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఆర్ సిందూ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం కనీస వేతనాలు, నిరుద్యోగం, అధిక ధరలు వంటి సమస్యలతో దేశంలో ప్రజలను శ్రమ దోపిడీకి గురిచేస్తోందని మండిపడ్డారు. ఈ వినాశకర విధానాలకు ప్రతిఘటనగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మె గ్రామీణ భారత్‌బంద్‌ను ప్రజలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, హక్కుల సాధన కోసం మహిళలు పెద్దఎత్తున పాల్గొనాలని చెప్పారు. దేశంలో మహిళల హక్కులను కాలరాస్తూ మతోన్మాదాన్ని, భావోద్వేగాలను రెచ్చగొడుతూ బీజేపీ ప్రభుత్వం డ్రామాలు చేస్తోందని మండిపడ్డారు. మనువాదంతో మానవ హక్కులకు భంగం కలిగిస్తోందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో గరిష్ట ఐక్యతతో భవిష్యత్ పోరాటాలకు మహిళలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ.. ఈ నెల 3 వరకు ఈ సమావేశాలు జరుగుతాయని వెల్లడించారు. ఈ సమావేశంలో జాతీయ అధ్యక్షురాలు హేమలత, జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్, జాతీయ కోశాధికారి సాయిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్, శ్రామిక మహిళా నాయకులు రమ, విజయలక్ష్మి, సీఐటీయూ జిల్లా ఆఫీసర్ బేరర్స్ నాయకులు టి.ఉప్పలయ్య, ప్రభాకర్‌రెడ్డితో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయండి

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



అభివృద్ధి పనులను సమీక్షిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 1: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి 'కుడా', జీడబ్ల్యూఎంసీ అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండలోని కుడా కార్యాలయంలో కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఇతర అధికారులతో కలిసి వివిధ అభివృద్ధి పనులను ఆయన సమీక్షించారు. స్మార్ట్‌సిటీ పనులు, జంక్షన్ల అభివృద్ధి, సుందరీకరణ తదితర అంశాలను చర్చించారు. కాజీపేట, పబ్లిక్‌గార్డెన్ లేబర్ అడ్డా, టీటీడీ, శాయంపేట జంక్షన్ల పనులను త్వరగా చేపట్టాలని ఆదేశించారు. కాళోజీ కళాక్షేత్రం, భద్రకాళి మాడ వీధుల ప్రగతిని అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు.

నియోజకవర్గానికి రూ.10కోట్లు

ఉమ్మడి వరంగల్ జిల్లాకు రూ.120 కోట్ల సీడీఎఫ్ నిధులు విడుదల

వరంగల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొత్త ప్రభుత్వం ఎమ్మెల్యేలకు తీపి కబురు చెప్పింది. అధికార పగ్గాలు చేపట్టిన రెండు నెలల్లోనే నియోకవర్గాల అభివృద్ధి నిధులు (సీడీఎఫ్)ను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాల వారీగా అభివృద్ధి కోసం నిధులు కేటాయించింది. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రుల అనుమతితో ప్రతీ నియోజకవర్గంలో రూ.10కోట్ల నిధులను ఖర్చు చేసేందుకు అనుమతి ఇచ్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఒక్కో నియోజకవర్గానికి రూ.10కోట్ల చొప్పున మొత్తం రూ.120కోట్లు కేటాయించింది. నియోజకవర్గానికి కేటాయించిన రూ.10కోట్లలో రూ.2కోట్ల నిధులను విద్యాభివృద్ధికి ఖర్చు చేయాలని, వాటితో ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు, పాఠశాల అభివృద్ధి పనులకు వెచ్చించాల్సి ఉంటుంది. అలాగే రూ.1కోటితో నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, నల్లాలు, చేతిపంపులు, తాగునీటి బావులు తదితర వాటికి ఖర్చు చేయాలని సూచించింది. అలాగే ప్రతీ నియోజకవర్గంలో రూ.50లక్షల చొప్పున మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సముదాయాల కార్యాలయాల్లో నిర్వహణ కోసం వెచ్చించాలని ప్రభుత్వం ఆదేశించింది. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 నియోజకవర్గాలకు కేటాయించిన రూ.120కోట్ల నిధుల్లో విద్యాభివృద్ధికి రూ.24కోట్లు, తాగునీటికి రూ.12కోట్లు, మండల, జిల్లా కార్యాలయాల నిర్వహణకు రూ.6కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా రూ.42కోట్ల ఖర్చు చేయగా, మిగిలిన రూ.78కోట్లను ఎమ్మెల్యేలు ఇతర అభివృద్ధి పనులకు వెచ్చించాలి. అయితే ఈనిధులను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అనుమతితోనే ఖర్చు చేయాల్సి ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. కాగా, కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోపే సీడీఎఫ్ విడుదల చేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ప్లీజ్.. ఒక్క చాన్స్..!



- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిత్వాల కోసం ఆశావహుల తీవ్ర ప్రయత్నాలు
- వరంగల్, మహబూబాబాద్ స్థానాలకు భారీగా డిమాండ్

వరంగల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో విజయమిచ్చిన జోష్‌తో ఉన్న కాంగ్రెస్‌లో పార్లమెంట్ ఎన్నికల సందడి మొదలైంది. ఈ పార్టీ నుంచి ఎంపీ టికెట్ ఆశించే వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్ (ఎస్సీ రిజర్వుడు), మహబూబాబాద్ (ఎస్టీ రిజర్వుడు) పార్లమెంట్ స్థానాల నుంచి పోటీ చేసేందుకు పాత, కొత్తతరం నేతలు ఆసక్తి చూపుతున్నారు. ఈ నియోజకవర్గాల పరిధిలో మెజారిటీ స్థానాల్లో హస్తం హవా సాగడం, అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టడంతో.. టికెట్ వస్తే చాలు గెలుపు ఖాయమనే ధీమాతో పలువురు ఆశావహులు టికెట్ కోసం తమ గాడ్‌ఫాదర్ల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ఒక్క అవకాశం ఇవ్వండంటూ పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎంపీ టికెట్ దరఖాస్తుల విక్రయాలు మొదలుకావటంతో ఆశావహులు దరఖాస్తు చేసుకుంటూనే టికెట్‌పై గట్టి ప్రయత్నాలు చేస్తుండటంతో టికెట్ ఎవరికి దక్కుతుందో అనే ఉత్కంఠ నెలకొంది.

రెండు డజన్లకుపైగా ఆశావహులు

ప్రధానంగా వరంగల్ (ఎస్సీ రిజర్వుడు) స్థానం నుంచి పోటీకి పెద్దసంఖ్యలో కాంగ్రెస్ నేతలు క్యూ కడుతున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత అద్దంకి దయాకర్ పేరు ప్రధానంగా వరంగల్ ఎంపీ స్థానం నుంచి వినిపిస్తోంది. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి సైతం ఎంపీ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాల్లో ఉన్నారు. ఇప్పటికే ఏఐసీసీ అగ్ర నాయకురాలు సోనియాగాంధీని కలిసి తనకు వరంగల్ టికెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, 2019లో ఎంపీగా పోటీ చేసిన కాంగ్రెస్ సీనియర్ నేత, పరకాలకు చెంది దొమ్మాటి సాంబయ్య, స్టేషన్ ఘన్‌పూర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన సింగపురం ఇందిర, డాక్టర్ రాగమల్ల పరమేశ్వర్, ఆత్మకూరుకు చెందిన డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, భాస్కర్, నమిండ్ల శ్రీనివాస్‌తో పాటు డజను మందికి పైగా కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు. హనుమకొండకు చెందిన మోజెస్ ఆనంద్‌పాల్, పరంజ్యోతి, సాంబయ్యలు ఇప్పటికే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. మరో ఐదారుగురు కీలక నేతలు కూడా టికెట్ కేటాయించాలని కాంగ్రెస్ పెద్దలకు విజ్ఞప్తులు చేస్తున్నారు.

అలాగే మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి డజనుమందికిపైగా ఆశావహులు ఉన్నారు. మాజీ మంత్రి బలరాంనాయక్‌తో పాటు మాజీ జడ్పీ చైర్‌పర్సన్ ధన్వంతి భర్త లక్ష్మీనారాయణనాయక్ టికెట్ ఆశిస్తున్నారు. అలాగే పోలీసు అధికారి నాగరాజు, ప్రొఫెసర్లు భట్టు రమేష్, జీవన్‌లాల్‌తో పాటు ఎట్టి వెంకన్న, రాయపురం సాంబయ్య తదితరులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే వీరిలో చాలామంది గాంధీభవన్ నుంచి దరఖాస్తు ఫారాలు కూడా తీసుకుని దరఖాస్తు చేసుకునే పనిలో ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలు ఉండగా, రెండు డజన్లకుపైగా ఆశావహులు పోటీ పడుతుండటంతో టికెట్ ఎవరికి దక్కుతుందో అనే టెన్షన్ క్యాడర్‌లో నెలకొంది.

గాడ్ ఫాదర్ల చుట్టూ చక్కర్లు

వరంగల్, మహబూబాబాద్ ఎంపీ టికెట్ కోసం పోటీ తీవ్రంగా ఉండటంతో ఆశావహులు

మిగతా 8వ పేజీలో

చికిత్స పొందుతూ ఆర్టీసీ డ్రైవర్ మృతి

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 1: హనుమకొండ వేయిస్తంభాల దేవాలయం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఆర్టీసీ డ్రైవర్ రామరాజు యాదగిరి (55) చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ భవాని నగర్‌కు చెందిన యాదగిరి వరంగల్-1 డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం విధులు ముగించుకున్న తర్వాత వరంగల్‌లో ఉన్న స్నేహితుల వద్దకు వెళ్లి రాత్రి9.30 గంటలకు ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా కుక్క అడ్డుగా రావడంతో వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో రక్తస్రావమై స్పృహతప్పి పడిపోయాడు. అక్కడి వారు గుర్తించి 108కు ఫోన్ చేయడంతో సిబ్బంది ఎంజీఎంకు తరలించి చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

గ్యాస్ ట్యాంకర్ బోల్తా - డ్రైవర్ మృతి



రాంపూర్ రింగ్ రోడ్డు వద్ద బోల్తా పడ్డ గ్యాస్ ట్యాంకర్

ధర్మసాగర్, ఫిబ్రవరి 1: అదుపు తప్పి గ్యాస్ ట్యాంకర్ బోల్తా పడడంతో డ్రైవర్ నటరాజన్ (46) గురువారం మృతి చెందారు. సీఐ శ్రీధర్‌రావు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడుకు చెందిన నటరాజన్ చర్లపల్లి నుంచి ట్యాంకర్‌లో హెచ్‌పీ గ్యాస్‌ను లోడ్ చేసుకొని తిరిగి కమాలాపూర్‌కు బయలు దేరి వెళుతున్నాడు. ఈ క్రమంలో రాంపూర్ రంగ సముద్రం చెరువు వద్దకు రాగానే ట్యాంకర్ అదుపు తప్పి డివైడర్‌పై నుంచి దూసుకపోయి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ నటరాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్ల అదృశ్యం

ఐనవోలు, ఫిబ్రవరి 1: మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న 10 తరగతి బాలుడు, బాలిక అదృశ్యమయ్యారు. బాలుడిది ఐనవోలు మండలం కాగా, బాలికది ఖిలావరంగల్ మండలం. బుధవారం వీరు పాఠశాలకు వెళ్తున్నామని ఇంటి నుంచి బయలుదేరారు. సాయంత్రం పిల్లలు పాఠశాల నుంచి ఇంటికి రాలేదని తల్లిదండ్రులు ఆందోళనకు గురై ఆరా తీశారు. ఆచూకీ లభించకపోవడంతో తమ పిల్లలు కనిపించడంలేదని వేరు వేరుగా రెండు పోలీస్‌స్టేషన్లలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మైనర్లు కావడంతో గోప్యంగా ఉంచారు.

వృద్ధుడి నుంచి ఏటీఎం కార్డు చోరీ

రూ.84వేలు డ్రా చేసిన గుర్తు తెలియని వ్యక్తి

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 1: హనుమకొండ కొత్తబస్‌స్టేషన్‌లో వృద్ధుడి నుంచి గుర్తు తెలియని వ్యక్తి ఏటీఎం కార్డును చోరీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ పద్మాక్షికాలనీకి చెందిన వావిళ్ల రామసుబ్బయ్య 80 యేళ్లు. గతంలో వ్యాపారం చేసేవాడు. ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటున్నాడు. వయస్సులో ఉండగా దాచుకున్న డబ్బులను బ్యాంకులో జమచేసుకుని నెలవారిగా వచ్చే మిత్తీ డబ్బులతో కాలం వెల్లదీస్తున్నాడు. ఈ క్రమంలో జనవరి 26న హనుమకొండ కొత్తబస్‌స్టేషన్ సమీపంలో ఉన్న ఏటీఎం సెంటర్ వద్దకు రామసుబయ్య వెళ్లాడు. డబ్బులు డ్రా చేయడం తెలియకపోవ డంతో అక్కడే ఉన్న గుర్తు తెలియని వ్యక్తికి ఏటీఎం కార్డును నుంచి డబ్బులు డ్రా చేసి ఇవ్వాలని పిన్‌నెంబర్ చెప్పాడు. ఆ వ్యక్తి ఏటీఎం పనిచేయడంతో లేదని చెప్పి తన వద్ద ఉన్న మరో ఏటీఎం కార్డును వృద్ధుడి చేతికి అప్పగించి అక్కడి నుంచి చల్లగా జారుకున్నాడు. నాలుగు రోజుల తర్వాత రామసుబ్బయ్య బ్యాంకు ఖాతా నుంచి రూ.84 వేలు డ్రా చేసినట్టు మెస్సేజ్ వచ్చింది. దీంతో గురువారం హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

ఇద్దరు మహిళలపై కేసు నమోదు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 1: విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిపై దురుసుగా ప్రవర్తిస్తూ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరు మహిళలపై హనుమకొండ పోలీసులు పలు సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేశారు. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ యాదవనగర్‌కు చెందిన కాందాడి విజయ, నీలవేణి అనే ఇద్దరు మహిళలకు యాదవనగర్‌లోని మాదిరెడ్డికుంటలో ఇళ్ల నిర్మాణం చేసుకునేందుకు ప్రభుత్వం గతంలో కొంత ఇంటి స్థలాన్ని కేటాయించింది. కానీ వారు కేటాయించిన స్థలం కంటే ఎక్కువ స్థలంతో పాటు ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన కొంత స్థలానికి ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్నారు. దీనిపై భూ యజమానులు మున్సిపాలిటీలో ఫిర్యాదు చేయడంతో మున్సిపాలిటీ సిబ్బంది గురువారం మాదిరెడ్డికుంటకు చేరుకుని ఆక్రమించిన స్థలంలో నిర్మాణాలను కూల్చివేసే ప్రయత్నం చేశారు. దీనిపై పోలీసు రక్షణ తీసుకున్నారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న పోలీసులపై ఇద్దరు మహిళలు నానా దుర్భాష లాడడంతో పాటు పోలీసులను నెట్టి వేస్తూ దాడికి యత్నించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చి సిబ్బందిపై దుర్భాషలాడారు. దీంతో ఇద్దరు మహిళలు విజయ, నీలవేణిలపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు.

రైలు కింద పడి వ్యవసాయ కూలీ మృతి

సుబేదారి/గిర్మాజీపేట, ఫిబ్రవరి 1: న్యూశాయంపేటకు చెందిన బొల్లం అశోక్(48) అనే వ్యక్తి అనారోగ్యంతో న్యూశాయంపేట రైల్వే ట్రాక్‌పై తల పెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ సీఐ నరేష్ కథనం ప్రకారం.. మృతుడు అశోక్ కొన్నిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. గురువారం నొప్పి తీవ్రత పెరగడంతో తట్టుకోలేక న్యూశాయంపేట ట్రాక్ వద్ద గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భారత్‌కు 31 సాయుధ డ్రోన్లు

వాషింగ్టన్, ఫిబ్రవరి1: వాస్తవాధీన రేఖ వెంబడి చైనాకు చెక్ పెట్టేందుకు.. హిందూ మహాసముద్రంలో పట్టు పెంచుకునేందుకు ఇండియాకు ఎంతగానో ఉపయోగపడే ఎమ్‌క్యూ-9బి ప్రిడేటర్ డ్రోన్లను విక్రయించడానికి అమెరికా ప్రభుత్వం గురువారం ఆమోదం తెలిపింది. ఈ డీల్ కింద 3.99 బిలియన్ డాలర్ల (సుమారు రూ.33వేల కోట్లు) విలువైన 31 డ్రోన్లను అమెరికా సరఫరా చేయనుంది. ఎమ్‌క్యూ-9బి రిమోట్లీ పైలెటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్‌గా పిలిచే ఈ సాయుధ డ్రోన్ల కొనుగోలుపై గత జూన్‌లో ప్రధాని మోదీ అమెరికాలో పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరింది. ఇందుకు అవసరమైన అనుమతి మంజూరు చేస్తూ అమెరికా కాంగ్రెస్ సర్టిఫికెట్ ఇచ్చిందని డిఫెన్స్ సెక్యూరిటీ కో-ఆపరేషన్ ఏజెన్సీ తాజాగా తెలిపింది. అమెరికా-భారత్ మధ్య వ్యూహాత్మక సంబంధాల బలోపేతంలో భాగంగా ఈ మెగా డ్రోన్‌డీల్ జరిగిందని పేర్కొంది. భారత్ భద్రతను పెంచేందుకు, ఇండో-పసిఫిక్, దక్షిణాసియా ప్రాంతంలో సుస్థిర, శాంతి, ఆర్థిక ప్రగతిని పెంపొందించేందుకు ఇది ఉపకరిస్తుందని తెలిపింది. మానవరహిత నిఘా విషయంలో భారత్ సామర్థ్యాలు మరింత బలోపేతమవుతాయని అభిప్రాయపడింది. సైన్యం ఆధునికీకరణకు భారత్ కట్టుబడి ఉందని, అందువల్ల వీటిని అందజేయడంలో తమకు ఇబ్బందేమీ లేదని పేర్కొంది. వీటిని హై ఆల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యూరెన్స్ (హెచ్ఏఎల్ఈ-హేల్)యూఏవీలుగా వ్యవహరిస్తారు. ఈ 31లో 15 డ్రోన్లను సీగార్డియన్ పేరుతో నేవీకి ఇస్తారు. స్కై గార్డియన్ పేరుతో ఎయిర్‌ఫోర్స్‌కు 8డ్రోన్లు, ల్యాండ్ వర్షన్ పేరుతో ఆర్మీకి మిగతా 8కేటాయిస్తారు. ఖలిస్థాన్ ఉగ్రవాది గురుప్రీత్ సింగ్ పన్నున్ హత్యకు భారత్ కుట్రపన్నుతున్నందున డ్రోన్లఅమ్మకాల ఒప్పందాన్ని అమెరికా నిలిపివేస్తుందంటూ వార్తలువచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ ఆమోదం లభించింది.

వీసా ఫీజులు భారీగా పెంచిన అమెరికా

వాషింగ్టన్, ఫిబ్రవరి1: అమెరికాకు వచ్చే విదేశీయుల నుంచి వసూలు చేసే నాన్-ఇమిగ్రెంట్ వీసా ఫీజులను బైడెన్ ప్రభుత్వం బుధవారం భారీగా పెంచింది. వీసా ఫీజులను పెంచడం 2016 తర్వాత ఇదే ప్రథమం. ఏప్రిల్1 నుంచి ఇవి అమల్లోకి వస్తాయి. భారతీయులకు అత్యంత ఉపయోగకరంగాఉండే హెచ్-1బీ, ఎల్-1, ఈబీ-5 వీసాల రుసుములు గణనీయంగా పెరిగాయి. విదేశాల వృత్తి నిపుణులు అమెరికాలో ఉద్యోగాలు చేయడానికి హెచ్-1బీ వీసాలు ఇస్తారు. ఇందుకు ఉద్దేశించిన ఫారం I-129 ఫీజు 460డాలర్ల (రూ.38,150)నుంచి 780డాలర్ల (రూ.64,690)కు పెరిగింది. హెచ్-1బీ వీసాల రిజిస్ట్రేషన్ రుసుము 10 డాలర్ల నుంచి 215 డాలర్ల (రూ.17,830)కు పెంచారు. ఈ నిర్ణయం వచ్చే ఏడాది నుంచి అమల్లోకి వస్తుంది. బహుళజాతి కంపెనీ ఉద్యోగుల బదిలీకి ఉద్దేశించిన ఎల్-1 వీసాల రుసుములు 460డాలర్ల నుంచి 1,385 డాలర్ల (రూ.1,14,860)కు పెరిగాయి. అమెరికా పౌరులకు ఉద్యోగాలిచ్చే వారికి ఈబీ-5 వీసాలు మంజూరు చేస్తారు. వీటి రుసుములు 3,675డాలర్ల నుంచి 11,160 డాలర్ల (రూ.9,25,510)కు పెరిగాయి. మరికొన్ని రకాల వీసాల ఫీజులు స్వల్పంగా తగ్గాయి.

కాంగ్రెస్ వలలో పడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

చేయకండి. సీఎంను కలవాలనుకుంటే సమాచారం ఇచ్చి వెళ్లండి' అని సున్నితంగా హెచ్చరించినట్లు సమాచారం. "కాంగ్రెస్ ప్రభుత్వం చాలా సవాళ్లను ఎదుర్కొనాల్సి ఉంది. రాష్ట్ర ఆదాయం అంతంత మాత్రంగా ఉంది. కనీసం అంచనా వేయకుండానే ఇబ్బడిముబ్బడి హామీలిచ్చారు. అమలు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ఉంటుందా? ఉండదా? అనేది వారి చేతుల్లోనే ఉంది. ప్రతిపక్షంగా సమర్థంగా వ్యవహరిద్దాం. ఏడాది లోపే ప్రజలకు అసలు విషయం తెలుస్తుంది. మనం తొందరపడాల్సిన పనిలేదు. సంయమనం పాటిద్దాం. చక్కగా నిలబడితే చాలు.. వచ్చే ప్రభుత్వం మనదే"నని కేసీఆర్ పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలించామని.. ఓడిపోయినంత మాత్రాన నిరుత్సాహం, భయడాల్సిన అవసరం లేదన్నారు. కృష్ణా ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించే అంశంపై పార్లమెంటులో నిరసన తెలపాలని ఎంపీలకు సూచించారు. కేంద్ర జల శక్తి శాఖ మంత్రినీ కలవాలని నిర్దేశించారు. లోక్‌సభ ఎన్నికల్లో గట్టిగా పోరాడదామని.. అందరితో చర్చించి, మంచి అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు.

అసాధ్యమని ఆర్బీఐనే చెప్పింది

రూ.36 వేల కోట్ల రైతు రుణమాఫీ అసాధ్యమని, ఏక మొత్తంలో ఇన్ని కోట్లు మాఫీ వీలుకాదని ఆర్బీఐ తెలిపిందని పార్టీ నేతల వద్ద కేసీఆర్ వ్యాఖ్యానించారు. అయినా.. ఏపీలో చెల్లించారు. తెలంగాణలోనూ రుణమాఫీ చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి రైతాంగాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. "మనం అధికారంలో ఉన్నపుడే కేంద్ర ప్రభుత్వం ఏమీ చేయలేదు. కాంగ్రెస్ ఉంటే చేస్తుందా? వాళ్లకూ చేయదు. శుక్రవారం తెలంగాణ భవన్‌కు వస్తా. బడ్జెట్ సమావేశాల్లో పాల్గొంటా" అని కేసీఆర్ తెలిపారు. కాగా, బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనుసరించాల్సిన తీరుపై అంశాల వారీగా చర్చించారు. కేటీఆర్, పోచారం, హరీశ్‌రావు, తలసాని, ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా ప్రమాణం

గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. శాసనసభ స్పీకర్ గడ్డ ప్రసాద్ తన



చాంబర్‌లో మధ్యాహ్నం 12.45 గంటలకు ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పోచారం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. అనంతరం అసెంబ్లీ ఆవరణలోని ప్రతిపక్ష నేత చాంబర్‌లో కేసీఆర్ ప్రత్యేక పూజలు చేసి బీఆర్ఎస్ శాసనసభాపక్ష నేతగా బాధ్యతలు చేపట్టారు. కాగా, ఈ కార్యక్రమాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, కాలె యాదయ్య, పద్మారావుగౌడ్ హాజరు కాలేదని సమాచారం.

రేవంత్ నేను పాత మిత్రులం!

త్వరలోనే రేవంత్‌ను కలుస్తా: మల్లారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): "నేను రేవంత్‌రెడ్డి పాత మిత్రులం. టీడీపీలో కలిసి పనిచేశాం. ఇప్పుడు ఆయన రాష్ట్ర సీఎం. ఆయనను కలిస్తే తప్పేంటి" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. రేవంత్‌ను త్వరలోనే కలుస్తానని చెప్పారు. కీసర ఆలయంలో నిర్వహించబోయే పూజా కార్యక్రమాలకు ఆహ్వానిస్తానని తెలిపారు. గురువారం అసెంబ్లీ ప్రాంగణంలో మల్లారెడ్డి మీడియాతో మాట్లాడారు. మల్కాజిగిరి ఎంపీ స్థానంలో పోటీ చేయాలని బీఆర్ఎస్ అధిష్ఠానం తనను కోరుతోందని చెప్పారు. అయితే, తన కుమారునికి అవకాశం కల్పించాలని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశానన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని చెప్పారు. అయితే, "రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఆ పార్టీ వాళ్లకు షాక్.. అధికారం కోల్పోవడం మాకు షాక్" అని మల్లారెడ్డి వ్యాఖ్యానించారు. కాగా, హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం నెమ్మదించిందన్న మల్లారెడ్డి.. త్వరలో గోవాలో రియల్ వ్యాపారం చేస్తానని చెప్పారు. ఇప్పటికే గోవాలో ఓ హోటల్ కొన్నట్లు తెలిపారు.

పాత.. కొత్త స్పీకర్ల కలయిక!



బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 1: ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రంలో అసెంబ్లీ స్పీకర్లుగా పనిచేసిన, చేస్తున్న ముగ్గురు ఒకచోట కలిశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తరఫున అసెంబ్లీ స్పీకర్‌గా 2014-19 వరకు మధుసూదనా చారి, 2019-23 వరకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి కొనసాగారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున 2023 డిసెంబరు నుంచి గడ్డం ప్రసాద్.. స్పీకర్‌గా కొనసాగుతున్నారు. గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం సందర్భంగా వారు ముగ్గురు కలిశారు. ఈ సందర్భంగా ముగ్గురూ కలిసి ఫొటో దిగారు.

టచ్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. హైకమాండ్ వద్దనడంతో ఆగాం

- ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ

కామారెడ్డి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): "బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చాలా మంది కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పలువురు ఎమ్మెల్యేలు కలవడమే ఇందుకు నిదర్శనం. వారంతా కాంగ్రెస్‌లో చేరే అవకాశాలున్నాయి. అయితే.. హైకమాండ్ ఇప్పుడప్పుడే పార్టీ ఫిరాయింపులు వద్దని చెప్పింది. అందుకే.. ఫిరాయింపులను ప్రోత్సహించడంలేదు" అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ వ్యాఖ్యానించారు. గురువారం ఆయన కామారెడ్డిలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని ప్రసంగించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవదన్నారు. కేటీఆర్ అహంకారపూరితంగా మాట్లాడుతున్నారంటూ షబ్బీర్ అలీ మండిపడ్డారు. "రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌ను ఛీ కొట్టినప్పటికీ కేటీఆర్ అహంకారం తగ్గడంలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కాకముందే సర్కారును కూల్చేస్తామని, త్వరలోనే ప్రభుత్వం పడిపోతుందంటూ కేటీఆర్ అహంకారపూరిత మాటలు మాట్లాడుతున్నారు. ప్రభుత్వాన్ని ఎలా కూలుస్తారో చూస్తాం" అని సవాల్ విసిరారు. పదేళ్లుగా రాష్ట్రాన్ని బీఆర్ఎస్ లూటీ చేసిందని ఆరోపించారు. ఓ అధికారి వద్దే రూ.100 కోట్ల అవినీతి సొమ్ము బయటపడడం బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని ఆయన విమర్శించారు.

ఎంపీ టికెట్ ఆశావహులతో గాంధీభవన్‌లో సందడి

కాంగ్రెస్ టికెట్ కోసం 41 మంది దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు దరఖాస్తులు సమర్పించడానికి వచ్చిన ఆశావహులు, వారి అనుచరులతో గాంధీభవన్‌లో గురువారం సందడి నెలకొంది. పార్టీ తరఫున తమకు టికెట్ కేటాయించాలని కోరుతూ 41 మంది అభ్యర్థులు దరఖాస్తులు ఇచ్చారు. బుధవారం ఏడుగురు దరఖాస్తు చేసుకోగా గురువారం 34 మంది పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ దరఖాస్తులను సమర్పించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి ఖమ్మం పార్లమెంట్ స్థానానికి దరఖాస్తు చేశారు. అదే నియోజకవర్గం నుంచి తనకు అవకాశం కల్పించాలని పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు దరఖాస్తు సమర్పించారు. భువనగిరి నుంచి చామల కిరణ్ కుమార్ రెడ్డి, నిజామాబాద్ నుంచి ఆకుల లలిత తదితరులు లోక్‌సభ బరిలో నిలిచేందుకు తమకు అవకాశం కల్పించాలని దరఖాస్తులు అందజేశారు. నియోజకవర్గాల వారీగా.. మహబూబాబాద్ 9, నాగర్‌కర్నూల్ 8, వరంగల్ 6, భువనగిరి 6, ఖమ్మం 2, నిజామాబాద్ 3 చొప్పున దరఖాస్తులు అందినట్లు గాంధీభవన్ వర్గాలు పేర్కొన్నాయి.

బడ్జెట్‌లో అందమైన అబద్ధాలు చెప్పారు

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

హైదరాబాద్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్‌లో అందమైన భాషతో అందమైన అబద్ధాలు చెప్పారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ విమర్శించారు. బడ్జెట్‌లో ఉద్యోగాల ఊసే లేదని, కార్పొరేట్ రంగానికి పెద్దపీట వేశారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే లేదని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు ప్రకటించలేదన్నారు. విద్యా రంగానికి 10శాతం నిధులు కేటాయించాల్సి ఉన్నా విస్మరించారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ అన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసేలా బడ్జెట్ ఉందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ విమర్శించారు.

ఇది భ్రమల బడ్జెట్: తమ్మినేని

కేంద్ర బడ్జెట్‌ను కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టే, ప్రజలను భ్రమల్లో పెట్టే బడ్జెట్ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రకటించిన బడ్జెట్ ఇది అని పేర్కొన్నారు.

గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు యాభై ఏళ్లు

- భాగ్యనగరం నుంచి వాల్తేరుకు మొదటి రైలు ఇదే
- 1974 ఫిబ్రవరి 1న ప్రారంభమైన ఎక్స్‌ప్రెస్



సికింద్రాబాద్/హైదరాబాద్ సిటీ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఎక్స్‌ప్రెస్.. ఏపీలోని ఉభయ గోదావరి జిల్లాలతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన రైలు ప్రయాణికులకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రైలు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో బెర్త్ దొరికిందంటే.. బంగారం బిస్కెట్ దొరికినంతగా విశాఖ ప్రాంతవాసులు ఆనందపడతారంటే అతిశయోక్తికాదు. 1974 ఫిబ్రవరి 1న హైదరాబాద్-విశాఖపట్నం మధ్య ప్రారంభమైన మొట్టమొదటి రైలు ఇది. అంటే ఈ రైలు ప్రవేశపెట్టి గురువారానికి సరిగ్గా యాభై ఏళ్లు పూర్తయ్యాయి. గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రస్తుతం హైదరాబాద్(నాంపల్లి) స్టేషన్ నుంచి సాయంత్రం 5.05గంటలకు బయల్దేరి సికింద్రాబాద్, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అనకాపల్లి మీదుగా.. విశాఖపట్నానికి చేరుకుంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్దండులైన ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు ఇది ఎంతో ముఖ్యమైన రైలుగా ఉండేది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు రావాలన్నా, ఇక్కడ్నుంచి స్వస్థలాలకు వెళ్లాలన్నా ఈ రైలులో వెళ్లడాన్ని సౌకర్యవంతంగా భావిస్తారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ప్రజాప్రతినిధులు, అధికారుల తాకిడి కొంత తగ్గినా.. సాధారణ ప్రయాణికుల నుంచి ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. దక్షిణ మధ్యరైల్వే ఆధ్వర్యంలో నడుస్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు మొత్తం 18స్టేషన్లలో ఆగుతుంది. 24 బోగీలతో అతిపొడవైన రైలుగా పేరుగాంచిన ఈ ఎక్స్‌ప్రెస్ 710 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. గురువారం సాయంత్రం గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు రైల్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు నాంపల్లి స్టేషన్‌లో ఘనంగా పుట్టిన రోజు వేడుకలు నిర్వహించడం విశేషం. దక్షిణ మధ్య రైల్వే కూడా ఈ ఎక్స్‌ప్రెస్‌ను సర్వాంగ సుందరంగా అలంకరించింది. ఈ రైలు ఆగే అన్ని స్టేషన్లలో వేడుకలు జరిపారు. 1990లోనే 24 కోచ్‌లతో అతి పెద్ద రైలుగా పేరొందిన గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో 2000 సంవత్సరం నుంచి ఫస్ట్‌క్లాస్ ఏసీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. 1993 నుంచే థర్డ్ ఏసీ కోచ్‌లున్న ఈ రైలు.. దక్షిణ మధ్య రైల్వేలోనే మొదటి ఏసీ కోచ్ ఉన్న ఎక్స్‌ప్రెస్‌గా పేరుగాంచింది. ఈ ఎక్స్‌ప్రెస్‌ను నేరుగా దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ పర్యవేక్షిస్తారంటే దానికి ఉన్న ప్రాముఖ్యత చెప్పనక్కర్లేదు. రైలు నిర్వహణ నుంచి సమయపాలన, పరిశుభ్రత, ఆహార నాణ్యత, ఫిర్యాదులు, ఇతర ఆపరేషన్స్ అన్నీ ప్రతిరోజూ జీఎం టేబుల్ మీద ఉండాల్సిందేనని చెబుతుంటారు.

జనాభా వృద్ధి రేటు సవాళ్లపై కమిటీ

- ఉన్నతాధికారులతో ఏర్పాటు చేయనున్న కేంద్రం
- సంతానోత్పత్తి రేటు తగ్గుతోందంటూ నివేదికలు
- తగినంతగా రీ ప్లేస్‌మెంట్ లేదనే ఆందోళనలు..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశంలో జనాభా వృద్ధి రేటులో ఎదురవుతున్న సవాళ్లపై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మల తెలిపారు. సంతానోత్పత్తి రేటు భర్తీ స్థాయుల (రీప్లేస్‌మెంట్ రేట్) కంటే పడిపోయినట్లు గణాంకాలు సూచిస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశంలో 2011లో చివరిసారిగా జనాభా లెక్కల సేకరణ చేపట్టారు. 2021లో మళ్లీ గణన నిర్వహించాల్సి ఉన్నప్పటికీ కొవిడ్ నేపథ్యంలో వాయిదా వేశారు. ఈ క్రమంలో జనాభాపై సాధికార లెక్కలు లేవు. వృద్ధి రేటు 2.1 నుంచి 2కి తగ్గిందంటూ 2020 నాటి శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్), 2.2 నుంచి 2కు పడిపోయిందంటూ నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) పేర్కొన్నాయి. దీనికి పరిష్కార మార్గాలను కమిటీ సూచించనుంది. జనాభా వేగవంతమైన వృద్ధి, మార్పుల నుంచి ఉత్పన్నమయ్యే సవాళ్లను పరిశీలించనుంది.

74 టీఎంసీలు కేటాయించాలి!

గోదావరి-కావేరి అనుసంధానంపై కేంద్రాన్ని డిమాండ్ చేసిన తెలంగాణ

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరి అనుసంధానంలో తరలించే 148 టీఎంసీల జలాల్లో 74 టీఎంసీలను తమకు కేటాయించాలని తెలంగాణ కోరింది. నదుల అనుసంధానంలో తెలంగాణకు 45 టీఎంసీలు కేటాయించాలని ప్రతిపాదించారని, అవి సరిపోవని తెలిపింది. పూర్వ నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పలు ప్రాంతాలకు సాగునీటిని అందించాల్సి ఉన్నందున, 74 టీఎంసీలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. గోదావరి-కావేరి అనుసంధానంపైతెలంగాణ లేవనెత్తిన అంశాలపై చర్చించడానికి వీలుగా గురువారం జలసౌధలో జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) హైదరాబాద్ విభాగం చీఫ్ ఇంజనీర్ దేవేందర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. దీనికి తెలంగాణ నుంచి ఈఎన్‌సీ బి.నాగేంద్రరావు, అంతరాష్ట్ర విభాగం చీఫ్ ఇంజనీర్ మోహన్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. గోదావరి-కావేరి అనుసంధానంతో వివిధ అంశాలపై రాష్ట్ర అధికారులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కాగా తెలంగాణ అభ్యంతరాలపై మళ్లీ సమావేశం ఉంటుందని ఎన్‌డబ్ల్యూడీఏ స్పష్టం చేసింది. అనుమానాలన్నీ నివృత్తి చేశాకే నదుల అనుసంధానంలో ముందుకెళతామని తెలిపింది.

నేటి నుంచి పంచాయతీల్లో 'ప్రత్యేక' పాలన

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్పంచుల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో శుక్రవారం నుంచి పంచాయతీలకు ప్రత్యేక అధికారులు బాధ్యత వహించనున్నారు. ఈ మేరకు గ్రామ ప్రత్యేకాధికారుల నియామకం, బాధ్యతల స్వీకరణ, విధి విధానాలను సూచిస్తూ.. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీఓ, తహశీల్దారు, ఎంపీఓ, డీటీ, ఆర్ఐ, ఇంజనీర్లు, ఎంఈవోలు, ఇతర గెజిటెడ్ స్థాయి అధికారులను గ్రామ ప్రత్యేక అధికారులుగా నియమించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడంతో పదేళ్ల తర్వాత మళ్లీ గ్రామాల్లో ప్రత్యేక పాలన ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించడంతో గురువారం సర్పంచుల వద్ద ఉన్న డిజిటల్ కీలు, చెక్కులు, ఇతర రికార్డులన్నీ సీజ్ చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు.

నేడు ఈజీఎస్ ఉద్యోగులకు పే స్కేల్ ప్రకటన..?

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 'గత ప్రభుత్వం పే స్కేల్ ప్రకటిస్తామని హామీ ఇచ్చింది.. అది అమలుకు నోచుకోలేదు.. కొత్త ప్రభుత్వం మా ఆశలు నెరవేరుస్తుందని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నేడు(శుక్రవారం) ఇంద్రవెల్లి సభలో తమ పే స్కేల్ ప్రకటిస్తారని, సంబురాలు జరుపుకొనేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నామని ఈజీఎస్ ఉద్యోగులు ఒక ప్రకటనలో తెలిపారు.

కోర్టు ఆదేశాలిచ్చిన గంటల్లోనే జ్ఞానవాపీ సెల్లార్‌లో పూజలు

- హైకోర్టులో అప్పీలు చేసిన మసీదు కమిటీ

వారాణసి, ఫిబ్రవరి 1: జ్ఞాన్‌వాపీ మసీదు సెల్లార్‌లోని 'వ్యాస్ కీ టెఖానా'లో ఉన్న హిందూ దేవత విగ్రహాలకు పూజలు చేసుకోవచ్చంటూ జిల్లా కోర్టు ఆదేశాలు ఇచ్చిన కొద్ది గంటల్లోనే అక్కడ ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో పూజలు చేసి లక్ష్మీదేవి, వినాయకులకు హారతి ఇచ్చారు. 31 సంవత్సరాల అనంతరం వ్యాస్‌జీ కా టెఖానాను పూజల కోసం తెరిచారని కాశీ విశ్వనాథ మందిర ట్రస్టు అధ్యక్షుడు నాగేంద్ర పాండే తెలిపారు. కాగా, తమకు అప్పీలు వంటి న్యాయ ప్రక్రియకు కూడా అవకాశం ఇవ్వకుండా హిందువులు పూజలు చేసుకోవడానికి అనుమతి ఇవ్వడం తగదని పేర్కొంటూ మసీదు కమిటీ గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే తొలుత హైకోర్టులో పిటిషన్ వేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ చెప్పడంతో దాన్ని అమలు చేసింది. అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ సమర్పించి అత్యవసరంగా విచారణ జరపాలని కోరింది.

హేమంత్ సోరెన్‌కు ఒక రోజు కస్టడీ

- 10 రోజుల పాటు ఇవ్వాలన్న ఈడీ వినతిపై నేడు తీర్పు
- రాంచీలో 8.5 ఎకరాలు ఆక్రమించినట్టు కేసు నమోదు

రాంచీ, ఫిబ్రవరి 1: మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను గురువారం ఇక్కడి పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టు ఒక రోజు జ్యుడీషియల్ కస్టడీకి పంపించింది. పోలీసులు ఆయనను ఇక్కడి బీర్సా ముండా సెంట్రల్ జైలుకు తరలించారు. ఆయనను పది రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలన్న వినతిపై కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించనుంది. ఈడీ బుధవారం ఆయనను ఏడు గంటల పాటు విచారించింది. అనంతరం ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయగా రాత్రి పది గంటల సమయంలో గవర్నర్ హౌస్ వద్ద అరెస్టు చేసింది. కాగా, రాత్రి సమయంలో గవర్నర్ హౌస్ ఆవరణలోనే అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ గురువారం సోరెన్ లాయర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ సమయంలో ఆయన ధరించిన మతపరమైన లాకెట్, రింగ్‌లను తీసివేయాలని ఈడీ అధికారులు కోరగా అందుకు ఆయన నిరాకరించారు. రాంచీలో సోరెన్ 12 చోట్ల 8.5 ఎకరాల విస్తీర్ణంగల స్థలాలను అక్రమంగా కలిగి ఉన్నారంటూ ఈడీ కేసుపెట్టింది. ఈ వ్యవహారంలో నగదు అక్రమ నగదు చలామణి జరిగినట్టు ఆరోపించింది. తొలుత భూమి రికార్డుల నకిలీ పత్రాలను తయారు చేస్తున్నారంటూ రెవెన్యూ శాఖ సబ్ ఇన్‌స్పెక్టర్ భాను ప్రతాప్ ప్రసాద్‌పై కేసు నమోదయింది. ఆయన వద్ద 11 ట్రంకు పెట్టెల్లో ఒరిజినల్, నకిలీ దస్తావేజులు, 17 ఒరిజినల్ రిజిస్టర్లు లభించాయి. దీనిపై జరిగిన విచారణలో ఇందులో సోరెన్‌కు సంబంధం ఉందంటూ ప్రసాద్ ఫోన్‌లో లభించిన సమాచారం ఆధారంగా ఈడీ కేసు నమోదు చేసింది. వాంగ్మూలం నమోదు చేయడానికని పిలిచి ఎలా అరెస్టు చేస్తారని సోరెన్ తరఫున హాజరైన అడ్వకేట్ జనరల్ రాజీవ్ రంజన్ ప్రశ్నించారు. ఇది ప్రభుత్వాన్ని కూలగొట్టడానికి జరిగిన కుట్ర అని ఆరోపించారు.



జేఎంఎం కూటమి ఎమ్మెల్యేలను తరలించడానికి బేగంపేట విమానాశ్రయం వద్ద సిద్ధంగా ఉన్న బస్సులు

ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

చంపయి సోరెన్ గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిశారు. హేమంత్ సోరెన్ రాజీనామా చేసిన అనంతరం రాష్ట్రానికి కొత్త సీఎం లేకపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొని ఉన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి లేకపోవడంతో రాజకీయ సంక్షోభం ముదిరిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్న తమ విజ్ఞప్తిని అంగీకరించాలని కోరారు. కాగా, చంపయి సోరెన్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించడంలో గవర్నర్ ఆలస్యం చేయడంతో.. జేఎంఎం-కాంగ్రెస్ కూటమి ఎమ్మెల్యేలను హైదరాబాద్ తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం రెండు చార్టర్డ్ విమానాలను సిద్ధం చేయగా.. సాయంత్రం 6.30 గంటల సమయంలో పొగమంచు ఎక్కువగా ఉండడంతో వాటిని రద్దు చేశారు. 81 మంది సభ్యులున్న ఝార్ఖండ్ అసెంబ్లీలో జేఎంఎం కూటమికి 43 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇక మనీలాండరింగ్ కేసులో ఈడీ తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ మాజీ సీఎం హేమంత్ సోరెన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌ను విచారించేందుకు సీజేఐ ముగ్గురు న్యాయమూర్తులతో ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేశారు. సోరెన్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరపనున్నారు.

గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకం

ఐనవోలు, ఫిబ్రవరి 1 : సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో పరిపాలన దృష్ట్యా గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులు నియామకమయ్యారు.

మండల వ్యాప్తంగా మొత్తం 17 పంచాయతీలకు అధికారులను ఖరారు చేశారు. గర్మిళ్లపల్లి-బి.రాజు(ఇరిగేషన్ ఏఈ), ఐనవోలు,ఉడుతగూడెం-విక్రమ్‌కుమార్(తహసీల్దార్), కక్కిరాలపల్లి - ప్రశాంత్(ఇరిగేషన్ ఏఈ), కొండపర్తి- ఎం.శంకర్(డీఈ), లింగమోరిగూడెం, పెరుమాండ్లగూడెం,పంథిని-వెంకటరమణ(ఎంపీడీవో), ముల్కలగూడెం, నర్సింహులగూడెం, ఒంటిమామిడిపల్లి-జి.రఘుపతిరెడ్డి(ఎంపీవో), నందనం-ఎన్.జీవన్(ఇరిగేషన్ ఏఈ), పున్నేలు-ఆడెపు కవిత(ఏవో), రాంనగర్- జి. కార్తీక్(పీఆర్ ఏఈ), రెడ్డిపాలెం-అనిల్‌కుమార్ (డిప్యూటీ తహసీల్దార్), వనమాల కనపర్తి- కె. రవికుమార్(ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ), వెంకటపూర్- సీహెచ్. తిరుపతిరెడ్డి,(సెరికల్చర్) వీరు నేటి నుంచి ప్రత్యేక అధికారులుగా విధులు నిర్వహించనున్నారు.

అనధికార నిర్మాణాల తొలగింపు



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న బల్దియా సిబ్బంది

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 1: హనుమకొండ యాదవనగర్‌లో అక్రమ నిర్మాణాన్ని జీడబ్ల్యూఎంసీ అధికారులు గురువారం కూల్చివేశారు. అక్రమంగా నిర్మించిన షెడ్డు, ప్రహరీ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. గతంలోనూ ఈ నిర్మాణం విషయంలో ఘర్షణ చోటు చేసుకుంది. అప్పట్లోని టౌన్ ప్లానింగ్ అధికారులపై దాడులు జరిగాయి. మళ్లీ నిర్మాణాలు జరిగిన విషయాన్ని తెలుసుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీపీ వెంకన్న వెల్లడించారు.

16నాటి సమ్మెను జయప్రదం చేయాలి



అడిషనల్ కమిషనర్ అనిసూర్ రశీద్‌కు సమ్మె నోటీసు అందచేస్తున్న బల్దియా కార్మిక సంఘాల ప్రతినిధులు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 1: ఈ నెల 16న చేపట్టనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని బల్దియా కార్మిక సంఘాల ప్రతినిధులు కార్మికులకు పిలుపునిచ్చారు. గురువారం సమ్మె నోటీసును హనుమకొండలోని జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ అనిసూర్ రశీద్‌కు అందచేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సమ్మె జరుగనున్నట్లు తెలిపారు. బల్దియా కార్మికులు సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల ప్రతినిధులు పుల్ల రమేశ్, గాగ్గుల దయాకర్, ముక్కెర రామస్వామి, సింగారపు బాబు తదితరులు పాల్గొన్నారు.

లక్షలాదిమందితో సమ్మె చేపడుతున్నాం..

హనుమకొండ రూరల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16వ తేదీన దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మాలోతు సాగర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో లేబర్ అసిస్టెంట్ కమిషనర్ రమేశ్‌బాబుకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా మాలోతు సాగర్ మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రాజకీయ సంస్థల అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో లక్షలాది మంది కార్మికవర్గంతో సమ్మె చేపడుతున్నామని, దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ వరంగల్ జిల్లా కమిటీ నాయకులు కందగట్ల రఘుపతి, దుపాకి రాజు, సంగెం రాజు, శ్రామిక మహిళా నాయకురాలు స్వప్న, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటరు నమోదు చేసుకోండి

మడికొండ, ఫిబ్రవరి 1 : ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు ఈనెల 5వ తేదీలోగా పూర్తి చేసుకోవాలని పీఆర్‌టీయూ కాజీపేట మండల అధ్యక్షుడు మాలకొండా రెడ్డి పట్టభద్రులను కోరారు. మడికొండలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో గురువారం ఓటరు రిజిస్ట్రేషన్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా మాలకొండా రెడ్డి మాట్లాడుతూ.. పట్టభద్రులైన, అర్హత కలిగిన ప్రతీ ఒక్కరూ ఆన్‌లైన్‌లోగాని, ఆఫ్ లైన్‌లో గానీ వెంటనే తమ ఓటును రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సరైన వ్యక్తిని ఎన్నుకోవడంలో ఓటరు బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

నీళ్లు రావడం లేదు సారూ...

కమిషనర్‌కు కొత్తగడ్డ వాసుల మొర

సమస్య పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు



పారిశుధ్య తనిఖీల్లో కార్మికుల హాజరును పరిశీలిస్తున్న కమిషనర్ రిజ్వాన్ బాషా

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 1: క్షేత్రస్థాయిలో నీటి సరఫరా పరిశీలనకు వెళ్లిన కమిషనర్‌కు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య కళ్లకు కట్టినట్లు ఆవిష్కృతమైంది. తాగునీటి సరఫరా రావడం లేదంటూ 37వ డివిజన్ తూర్పుకోట పరిధిలోని కొత్తగడ్డ ప్రాంత వాసులు ఏకరవు పెట్టారు. మిషన్ భగీరథ కాంట్రాక్టర్ పైప్‌లైన్ ఎత్తును పెంచడం కారణంగా సమస్య ఉత్పన్నమైనట్లు వివరించారు. గురువారం వరంగల్ 37వ డివిజన్ తూర్పు కోటలోని పెరుగవాడ, కొత్తగడ్డ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి నల్లా నీరు సరఫరా తీరు గురించి అడిగారు.

ఈ క్రమంలో కొత్తగడ్డ ప్రాంత ప్రజలు నీరు రావడం లేదని విన్నవించారు. ఇందుకు గల కారణాలను సైతం కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాకు వివరించారు. అధికారులను మందలించిన కమిషనర్.. యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని స్పష్టం చేశారు. నీరు వృథా కాకుండా చూడాలని, పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తాగునీరు సరఫరా పర్యవేక్షణ లోపభూయిష్టంగా ఉందని ఇంజనీరింగ్ అధికారులకు అక్షింతలు వేశారు. వేసవి కాలం సమీపిస్తున్న క్రమంలో డీఈలు డివిజన్ల వారిగా ప్రతిరోజు పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. లేకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మిషన్ భగీరథ సమస్యలపై పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకొని వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు.

అనంతరం హనుమకొండలోని ఉజిలిబేస్ ప్రాంతంలో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికుల హాజరును పరిశీలించిన కమిషనర్.. గైర్హాజర్ అయిన కార్మికులను విధుల నుంచి తొలగించాలని సీఎంహెచ్‌వో డాక్టరు రాజేశ్‌ను ఆదేశించారు. ఉద్యోగమంటే తమాషాగా ఉందంటూ కార్మికులను ఉద్దేశించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ రోజు ఉదయం 5 గంటలకే కార్మికులు పనుల్లో ఉండాలని స్పష్టం చేశారు. అంతే కాకుండా ప్రతీ కార్మికుడు యూనిఫామ్ ధరించాల్సిందేనని తేల్చిచెప్పారు. లేకుంటే గైర్హాజరుగానే అటెండెన్స్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టరు రాజేశ్, ఈఈ శ్రీనివాస్, డీఈ రవి కిరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు భాస్కర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల సాధనకు ఉద్యమిద్దాం

వడ్డెపల్లి, ఫిబ్రవరి 1: జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమిద్దామని అడహక్ బాధ్యులు, సీనియర్ జర్నలిస్ట్ నాంపల్లి నంబూద్రీపాల్ అన్నారు. గురువారం హనుమకొండలోని ఓ ప్రైవేట్ సమావేశ మందిరంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం జర్నలిస్టుల పోరాట ఐక్య వేదికను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ పాలకవర్గం బాధ్యతలు స్వీకరించి, సుమారు సంవత్సర కాలం గడుస్తున్నప్పటికీ ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు, అడహక్ బాధ్యులు చెన్నా రామకృష్ణ, నూటెంకి ప్రభాకర్, సయ్యద్ మగ్దూం, సిరిపురం తిరుపతిరెడ్డి, ఎమ్డీ శంషోద్దీన్, అనంతుల రమేష్, టి.వి.రాజుగౌడ్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మడికొండ, ఫిబ్రవరి 1 : మడికొండలోని రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ ఆవరణలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం కాజీపేట మండల అధ్యక్షుడు మోడెం రాజేందర్ ఆధ్వర్యంలో గురువారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారు బుర్ర రాజ్‌కుమార్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు గొని సాంబయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్, మండల ఉపాధ్యక్షుడు నరసింహగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల సమ్మె

డిపోల్లో, రోడ్లపై నిలిచిన ఆర్టీసీ బస్సులు



బస్‌స్టేషన్ సమీపంలో రోడ్లపై నిలిపి ఉన్న ఆర్టీసీ బస్సులు

సుబేదారి, ఫిబ్రవరి 1: వేతనాలు పెంచాలని ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు గురువారం ఉదయం సమ్మెకు దిగారు. నెల రోజుల నుంచి వేతనాలు పెంచాలని సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ ప్రైవేట్ బస్సు యజమానులు పట్టించుకోలేదని డ్రైవర్లు సమ్మెకు దిగారు. దీంతో వరంగల్ 1 డిపో, వరంగల్ - 2 డిపో, హనుమకొండ డిపోల్లోన్ని బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కొన్ని బస్సులు రోడ్లపై నిలిపారు. అయితే ప్రైవేట్ బస్సు యజమానులు డ్రైవర్లతో మధ్యాహ్నం చర్చలు జరిపి వేతనాలు పెంచుతామని హామీ ఇవ్వడంతో ఎట్టకేలకు డ్రైవర్లు డ్యూటీలో చేరారు.

ఇబ్బంది పడిన ప్రయాణికులు

ప్రైవేట్ బస్సు డ్రైవర్లు సమ్మెకు దిగడంతో బస్‌స్టేషన్‌లో సరిపడా బస్సులు లేక దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు కొంతసేపు ఇబ్బంది పడ్డారు. గంటలతరబడి బస్‌స్టేషన్‌లోనే వేచి చూశారు. అయితే ఆర్టీసీ అధికారులు ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా వేరే రూట్ల బస్సులను అదనంగా కేటాయించారు. ఎట్టకేలకు డ్రైవర్లకు, యజమానులకు చర్చలు సఫలం కావడంతో ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు వెళ్లారు.

గద్దర్ త్యాగాలను గుర్తించిన సర్కార్



మాట్లాడుతున్న డాక్టర్ జిలుకర శ్రీనివాస్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 1: ప్రజాయుద్ధనౌక గద్దర్ త్యాగాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం నంది అవార్డులను గద్దర్ అవార్డులుగా మార్చిందని విముక్త చిరుతల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ అన్నారు. గురువారం హనుమకొండ రాంనగర్‌లోని విముక్త చిరుతల పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గద్దర్ అవార్డులుగా మార్చిన సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ సమాజం, కవులు, కళాకారులు రుణపడి ఉంటారని అన్నారు. సమావేశంలో విముక్త చిరుతల పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మచ్చ దేవేందర్, రాష్ట్ర, జిల్లా నాయకులు చెరుపల్లి ఆనంద్, కొయ్యాడ కిరణ్ కుమార్, అంబాల అనిల్, అన్నాల రవి, బొట్టు శ్రీధర్, భిక్షపతి పాల్గొన్నారు.

ప్రజాసేవకులకు సంతాపం



సంతాపం వ్యక్తం చేస్తున్న నాయకులు

ఐనవోలు, ఫిబ్రవరి 1: ఐనవోలు దేవస్థానం మాజీ చైర్మన్ వడిచర్ల శ్రీనివాస్, రెడ్డిపాలెం ఉద్యమకారుడు, బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మర్రెడ్డిలు ఇటీవల మృతి చెందింది తెలిసిందే. గురువారం దశదిన కర్మలు నిర్వహించగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ప్రజాసంఘాల నాయకులు వారి చిత్రపటాలకు నివాళులు అర్పించి ప్రజాజీవితంలో వారు చేసిన సేవలను కొనియాడుతూ వారి ఆత్మకు శాంతికలగాలని సంతాపం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పోలేపల్లి శంకర్‌రెడ్డి, రాజశేఖర్, దేవస్థానం మాజీ చైర్మన్ మునిగాల సంపత్‌కుమార్, సర్పంచ్ శ్యామల బాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ సతీష్, బొల్లేపల్లి పరమేశ్వర్, యూత్ మండల అధ్యక్షుడు మరుపట్ల నరేష్, దుప్పెల్లి కొంరయ్య, ఎంపీటీసీ రాజేందర్, కట్కూరి రాజు, డబ్బా శ్రీనివాస్, రాఘవులు, యువరాజ్ కాంగ్రెస్ నాయకులు కొత్తూరి సునిల్, భాస్కర్, ఏలియా, రహీం, ప్రజాసంఘాల నాయకులు అమరవాది సారంగపాణి, రాజారపు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వల్లంపట్ల సాహిత్యంతో సామాజిక చైతన్యం

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 1: ప్రముఖ రచయిత వల్లంపట్ల నాగేశ్వర్‌రావు సృష్టించిన సాహిత్యంతో సామాజిక చైతన్యం వెల్లివిరిసిందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. కేయూ తెలుగు విభాగం, వల్లంపట్ల ఆర్ట్స్ అకాడమీ, వెల్ఫేర్ సొసైటీ సంయుక్తంగా 'వల్లంపట్ల సాహిత్యం- సామాజిక చైతన్యం' అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం రాత్రి ముగిసింది. ఈ సందర్భంగా కేయూ తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ బన్న అయిలయ్య అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశంలో అంపశయ్య నవీన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

సమాజంలో నెలకొన్న రుగ్మతలను నిర్మూలించేందుకు తన రచనల్లో సామాజిక ఇతివృత్తాన్ని పెంపొందించి ప్రజలను చైతన్యపరిచిన గొప్ప సామాజిక తత్వవేత్త వల్లంపట్ల నాగేశ్వర్‌రావు అని చెప్పారు. తెలంగాణ తొలిదశ ఉద్యమం, హరితమిత్ర, బాల్య వివాహాలు నివారణ, ఎయిడ్స్ నివారణ, అక్షరదీపిక, హేతువాద ఉద్యమంతో పాటు అనే ఉద్యమాల్లో తన కలాన్ని, గలాన్ని అందించిన గొప్ప ప్రజా కళాకారుడు వల్లంపట్ల అని పేర్కొన్నారు. సాహిత్యంలోని అనేక ప్రక్రియల్లో రచనలు చేసిన వల్లంపట్ల ఇప్పటివరకు వెయ్యి పాటలు, 180 కళారూపాలు కథలు, కవిత్వం, బుర్రకథలు, పల్లెసుద్దులు వెలువరించారని చెప్పారు. వల్లంపట్ల ఉపాధ్యాయులుగా, ప్రజా వాగ్గేయకారుడుగా ఒక ప్రవాహంలా కొనసాగిన ఆయన జీవితం.. నేటితరాలకేకాక, భావితరాలకు ఆదర్శనీమని చెప్పారు. మహాకవి డాక్టర్ కత్తి పద్మారావు వల్లంపట్ల ఓసాంస్కృతిక విప్లవ కేంద్రమనే పుస్తకాన్ని సభలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కత్తి పద్మారావు మనోభావాలను వేదిక మీద తెలియజేస్తూ.. నూతన సమాజం కోసం అవిరళ కృషి చేసిన వల్లంపట్ల నాగేశ్వర్‌రావుకు కేంద్రం ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును, రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్సీ, కేయూ గౌరవ డాక్టరేట్ ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. రెండురోజుల పాటు వర్సిటీలో వల్లంపట్లపై జాతీయసదస్సు నిర్వహించడం ముదావాహమని చెప్పారు. ఈ సదస్సులో కేయూ యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, పొట్లపల్లి శ్రీనివాసరావు, వీఆర్ విద్యార్థి, డాక్టర్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

షాపింగ్ మాల్ తొలగింపు సరైనదే..

● వరంగల్‌లో బల్దియా కూల్చివేతను సమర్థించిన హైకోర్టు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 1: వరంగల్‌లోని ఒక షాపింగ్ మాల్ అక్రమ నిర్మాణాన్ని బల్దియా అధికారులు కూల్చివేయడాన్ని రాష్ట్ర హైకోర్టు సమర్థించింది. ఈ మేరకు గురువారం హైకోర్టు తీర్పు ఇస్తూ బల్దియా చర్యలు సరైనవిగానే పేర్కొన్నట్లు జీడబ్ల్యూఎంసీ అధికారిక ప్రకటనలో తెలిపింది. కొద్దిరోజుల కిందట సెట్‌బ్యాక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ షాపింగ్ మాల్ నిర్మాణమైన క్రమంలో బల్దియా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. దీంతో సదరు యజమానులు కోర్టును ఆశ్రయించడం షాపింగ్‌మాల్ సీజ్ ఆర్డర్‌ను తొలగించేందుకు న్యాయస్థానం నిరాకరించింది. స్టిల్+3 ప్లాన్‌కు అనుమతులు పొందిన యజమానులు ఇందుకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారు. వీటిని బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేయడం, షాపింగ్‌మాల్ యాజమాన్యం ఆశ్రయించడం, స్టే ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించినట్లు బల్దియా అధికారులు తెలిపారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 1: శిక్షణా తరగతులకు ప్రతీరోజు క్రమం తప్పకుండా హాజరై సిలబస్‌ను అవగాహన చేసుకొని చదవడం వల్ల సమయం వృథా కాదని బీసీ సంక్షేమశాఖ వరంగల్ జిల్లా అధికారి పుష్పలత తెలిపారు. బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్ 1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సులకు ఉచిత శిక్షణ తరగతులను గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఉత్తమ ఫలితాలు పొందాలంటే ఉపాధ్యాయులు చెప్పే ప్రతీ పాఠాన్ని అర్థం చేసుకోవడంతోపాటు ప్రాక్టీస్ చేయాలన్నారు. దీని వల్ల ఉత్తీర్ణత పెరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపీవి.ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఐనవోలు, ఫిబ్రవరి 1: పోయిన సెల్‌ఫోన్‌ను పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీతో గుర్తించి బాధితుడికి పోలీసులు అందజేశారు. ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరలో జమ్మికుంటకు చెందిన జమీల్‌కు చెందిన సెల్‌ఫోన్ చోరీకి గురైంది. ఫోన్ పోయిన విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసి ఫోన్ వివరాలు అందజేశాడు. ఎస్సై అనిల్ కుమార్ సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో వర్ధన్నపేట మండలం డీసీ తండాలో ఓ వ్యక్తి ఫోన్ వినియోగిస్తున్నది గుర్తించి అతడి నుంచి తీసుకొని బాధితుడికి ఫోన్ అందజేయడంతో సంతోషం వ్యక్తం చేశాడు.

టీ ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా యాకయ్య



యాకయ్య

వడ్డెపల్లి, ఫిబ్రవరి 1: టీ ఎమ్మార్పీఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జిగా నెక్కొండ మండల కేంద్రానికి చెందిన ఈదునూరి యాకయ్య మాదిగ నియమితులయ్యారు. ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాది గ ఈ మేరకు గురువారం హనుమకొండ వడ్డెపల్లిలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఎమ్మార్పీఎస్ టీఎస్‌ను ఉమ్మడి జిల్లాలో బలోపేతం చేస్తానని యాకయ్య మాదిగ పేర్కొన్నారు.

ఎంజీఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

యునైటెడ్ ఫెడరేషన్ కార్యదర్శి యాకూబ్ పాషా



మాట్లాడుతున్న యాకూబ్ పాషా

హనుమకొండ అర్బన్, ఫిబ్రవరి 1: ఎంజీఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని యునైటెడ్ ఫెడరేషన్ కార్యదర్శి యాకూబ్‌పాషా కోరారు. గురువారం తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎంజీఎంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాకూబ్‌పాషా మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కొన్ని సంఘాలు వింత పోకడలకు పోతూ అసలు ఉద్దేశాలను విస్మరించి భజన, క్షీరాభిషేకాల సంఘాలు గుర్తింపు తెచ్చుకున్నాయని ఆరోపించారు. తోటి ఉద్యోగులు, కార్మికులు పిట్టల్లా రాలిపోతుంటే, ఆత్మహత్యలకు పాల్పడుతున్నా నోరు విప్పడం లేదన్నారు. 317 జీవోతో ఉద్యోగుల జీవితాలు అతలాకుతలం అవుతున్నా, ఉద్యోగుల ప్రాథమిక హక్కు కోల్పోతున్నట్లు పేర్కొన్నారు. సంఘాలకతీతంగా ఈనెల 18న పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ నందు నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈసమావేశంలో కృష్ణప్రసాద్, బొట్ల రమేశ్, నవీన్ కుమార్, భాస్కర్, కిరణ్, రెహమాన్, మధు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ ఆఫీసర్ల నియామకంతో మెరుగైన వైద్య సేవలు



మాట్లాడుతున్న టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 1: నర్సింగ్ ఆఫీసర్ల నియామకంతో మెరుగైన వైద్య సేవలు అందుతాయని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ అన్నారు. గురువారం హనుమకొండలోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. ఐనవోలు మండలంలో పని చేస్తున్న పంచాయతీ సెక్రటరీలకు టీఎన్‌జీవోస్ యూనియన్ మెంబర్‌షిప్ ఇచ్చామన్నారు. ఆరోగ్యశాఖలో 6, 956 నర్సింగ్ ఆఫీసర్ల నియామకంతో రాష్ట్రంలో ఇకపై మెరుగైన వైద్య సేవలు అందుబాటులో వస్తాయని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన కొద్దిరోజుల్లోనే నర్సింగ్ ఆఫీసర్లకు నియామకపత్రాలు అందించి వారి కుటుంబాల్లో సంతోషాలు నింపిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, రఘుపతిరెడ్డి, శ్యాం సుందర్, రామునాయక్, లక్ష్మీప్రసాద్, అశోక్, నవీన్, వెంకన్న, రఫీ, రఘురాం, రాజ్‌కుమార్ రులు పాల్గొన్నారు.

జూడో పోటీలకు విద్యార్థుల ఎంపిక

సుబేదారి, ఫిబ్రవరి 1: పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఈనెల 5, 6 తేదీల్లో నిర్వహించే సౌత్, వెస్ట్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల జూడో పోటీలకు ములుగురోడ్‌లోని ఎల్బీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కళాశాలలో బీకాం ఫైనల్ ఇయర్ చదువుతున్న టి.భువనేశ్వర్‌సింగ్, బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న ఎం. దర్శిత్‌లు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీఎల్‌హెచ్‌రావు తెలిపారు. జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థులు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తోపాటు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బి. ప్రభాకర్, అధ్యాపకులు అభినందించారు.

సిద్ధాపూర్‌లో అక్రమ మద్యం పట్టివేత

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 1: హసన్‌పర్తి మండలం సిద్ధాపూర్ గ్రామంలో బెల్టుషాపుపై వరంగల్ టాస్క్‌ఫోర్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో గ్రామ చౌరస్తాలో బెల్టు షాపు నిర్వహిస్తున్న దూలం సాంబయ్య నుంచి రూ.28వేల అక్రమ మద్యాన్ని పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధాపూర్ గ్రామానికి చెందిన సాంబయ్య చాలాకాలంగా గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం విక్రయిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నాడు. పక్కా సమాచారం అందడంతో తమ సిబ్బంది మూకుమ్మడిగా దాడులు నిర్వహించి వివిధ రకాల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.28వేల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న మద్యాన్ని హసన్‌పర్తి పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేశారు. ఈ దాడులలో టాస్క్‌ఫోర్స్ పోలీసులతోపాటు సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

ప్లీజ్.. ఒక్క చాన్స్..!

5వ పేజీ తరువాయి

తమ గాడ్‌ఫాదర్‌ల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఢిల్లీ, హైదరాబాద్‌లోని పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రిజిస్ట్రార్‌గా ఉన్న హరికోట్ల రవికి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితోపాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆశీస్సులు ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. వీరి మద్దతుతోనే ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీతో హరికోట్ల రవి భేటీకి అవకాశం దక్కినట్లుగా సమాచారం. అలాగే పలువురు ఆశావహులు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను కలిసి తమకే టికెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. 'ఒక్క చాన్స్ ప్లీజ్.. పార్టీకి చేసిన సేవను గుర్తించండి..' అంటూ పార్టీ అగ్రనేతలను కోరుతున్నారు.

దరఖాస్తులు షురూ..

పార్లమెంట్ టికెట్ ఆశించే వారి నుంచి కాంగ్రెస్ పార్టీ దరఖాస్తులు స్వీకరిస్తోంది. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎంపీ టికెట్ల దరఖాస్తుల కోసం ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించారు. ఎంపీ ఎన్నికల దరఖాస్తు ఫారమ్‌లో 17 అంశాలతో సెల్ఫ్ డిక్లరేషన్‌ను పొందుపరిచారు. వ్యక్తిగత, రాజకీయ, సామాజిక సేవ కార్యక్రమాల వివరాలను తెలియజేస్తూ దరఖాస్తు చేస్తున్నారు. ఎంపీ టికెట్ దరఖాస్తు ఫారమ్ కోసం జనరల్ అభ్యర్థులు రూ.50వేలు, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు రూ.25వేల డీడీని తీసి దరఖాస్తుతో పాటు గాంధీభవన్‌లో ఇవ్వాల్సి ఉంటుంది. వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల నుంచి పోటీ చేసే అభ్యర్థులు దరఖాస్తులు చేసుకుంటున్నారు.



ఆదాయ పన్ను రేట్లు మారలే!



» దిగుమతి సుంకాలు, ప్రత్యక్ష పరోక్ష పన్ను రేట్లలో ఎలాంటి మార్పులూ చేయట్లేదని నిర్మలమ్మ వెల్లడి

» ఐటీ పరిమితి పెంపుపై సగటు వేతనజీవికి నిరాశే

ఊహించిందే జరిగింది. నిర్మలమ్మ పద్దులో సగటు వేతనజీవికి ఎలాంటి ఊరటా లభించలేదు. దిగుమతి సుంకాలతో సహా.. ప్రత్యక్ష, పరోక్ష పన్ను రేట్లలో ఎలాంటి మార్పులూ చేయబోవట్లేదని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అంటే.. ఆదాయపన్నుకు సంబంధించి ప్రస్తుతం ఉన్న పాత, కొత్త విధానాలు యథాతథంగా కొనసాగుతాయన్నమాట. అయితే.. 1962 నుంచి అపరిష్కృతంగా ఉన్న చిల్లర, వివాదాస్పద పన్ను డిమాండ్ నోటీసుల్లో కొన్నింటిని ఉపసంహరించుకోవడం ద్వారా 1.1 కోట్ల మందికి రూ.3500 కోట్ల మేర ప్రయోజనం కల్పించే ప్రకటన ఒకటి నిర్మల తన బడ్జెట్ ప్రసంగంలో చేశారు. 2009-10 ఆర్థిక సంవత్సరం వరకూ పెండింగ్‌లో ఉన్న ఈ తరహా వివాదాస్పద పన్ను డిమాండ్లలో రూ.25 వేలలోపు ఉన్నవాటిని.. 2010-11 ఆర్థిక సంవత్సరం నుంచి 2014-15 ఆర్థిక సంవత్సరం వరకూ పెండింగ్‌లో ఉన్న పన్ను నోటీసుల్లో రూ.10 వేల లోపు ఉన్న వాటిని ఉపసంహరించుకుంటామని ఆమె ప్రకటించారు. ఉదాహరణకు.. 2001లో ఒక వ్యక్తి రూ.5000 పన్ను చెల్లించాడనుకుందాం. కానీ, అతడి ఆదాయం ప్రకారం చెల్లించాల్సింది రూ.30 వేలు. ఈ వ్యత్యాసాన్ని గుర్తించిన ఆదాయపన్ను అధికారులు మిగతా రూ.25 వేలూ చెల్లించాలని డిమాండ్ నోటీసు ఇస్తారు. దానికి ఆ వ్యక్తి.. తాను అంత పన్ను చెల్లించక్కర్లేదని జవాబు ఇస్తాడు. ఇలా 2001 నుంచి పెండింగ్‌లో ఉన్న ఆ వ్యవహారం తాజాగా నిర్మలా సీతారామన్ ప్రకటించిన మినహాయింపుతో పరిష్కారమైపోతుంది. ఇలాంటి ప్రత్యక్ష పన్ను డిమాండ్లు 2.68 కోట్లు ఉన్నాయని.. వాటి విలువ రూ.35 లక్షల కోట్ల దాకా ఉంటుందని రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. వాటిలో 2.1 కోట్ల డిమాండ్లు రూ.25 వేలలోపువేనని.. అందులో 2009-10 లోపువి 58 లక్షలు.. 2010-11 నుంచి 2014-15 దాకా ఉన్నవి 53 లక్షలని.. మొత్తం కలిపి 1.1 కోట్ల డిమాండ్లు అని ఆయన వివరించారు. కాగా.. సావరిన్ వెల్త్ ఫండ్స్, పెన్షన్ ఫండ్లు పెట్టిన పెట్టుబడులకు, 'యాక్షన్ ప్లాన్ ఆఫ్ స్టార్టప్ ఇండియా' పథకం కింద స్టార్టప్ కంపెనీలకు, ఐఎఫ్ఎస్‌సీ (ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీస్ సెంటర్స్) యూనిట్లకు.. ఇస్తున్న పన్ను ప్రయోజనాలు ఈ ఏడాది మార్చి 31తో ముగిసిపోనున్నాయి. వాటిని మరో ఏడాది పాటు (2025 మార్చి 31 దాకా) కొనసాగించాలని నిర్ణయించినట్టు నిర్మల వెల్లడించారు. ఆదాయపన్ను రిటర్నుల ప్రాసెసింగ్ సమయం 2013-14 నాటికి సగటున 93 రోజులుగా ఉండేదని.. తమ ప్రభుత్వం ఇప్పుడు ఆ సమయాన్ని 10 రోజులకు తగ్గించివేసిందని, తద్వారా రిఫండ్లు వేగంగా వస్తున్నాయని గుర్తుచేశారు.


రూఫ్‌టాప్ సోలార్ ద్వారా

300 యూనిట్ల ఉచిత విద్యుత్తు

» అదనపు విద్యుత్తును విక్రయించుకునేందుకూ అవకాశం

» 'ప్రధానమంత్రి సూర్యోదయ యోజన' పేరుతో కొత్త పథకం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌లో గృహవిద్యుత్తు వినియోగానికి సంబంధించి 'ప్రధానమంత్రి సూర్యోదయ యోజన' పేరిట సరికొత్త పథకాన్ని ప్రకటించింది. ఇందులో భాగంగా.. ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు చేసుకున్న వారికి నెలకు 300 యూనిట్ల వరకు ఉచితంగా వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపింది. అంతేకాకుండా.. అదనపు విద్యుత్తును డిస్ట్రిబ్యూషన్ కంపెనీలకు విక్రయించవచ్చని, తద్వారా ఏడాదికి రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు ఆదా చేసుకోవచ్చని పేర్కొంది. ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్‌కు కూడా ఈ పథకాన్ని వినియోగించవచ్చని తెలిపింది. ఈ సోలార్ సిస్టమ్ ఏర్పాటు ద్వారా వ్యాపార అవకాశాలు పెరుగుతాయని, వీటి తయారీ, సరఫరా, ఇన్‌స్టాలేషన్, నిర్వహణతో పెద్దసంఖ్యలో యువతకు ఉపాధి లభిస్తుందని వివరించింది. జనవరి 22న అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ అనంతరం ప్రధాని మోదీ ఈ పథకాన్ని ప్రకటించిన విషయాన్ని నిర్మలా సీతారామన్ గుర్తు చేశారు. ప్రభుత్వరంగ సంస్థ అయిన ఆర్ఈసీ లిమిటెడ్‌కు ఈ పథకం అమలు బాధ్యతలు అప్పగించినట్లు ప్రకటించారు. ఏడాదిలోగా దేశంలో కోటి ఇళ్లకు రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు చేయాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 2019 మార్చి 8న న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ మంత్రిత్వ శాఖ రెసిడెన్షియల్ రూఫ్‌టాప్ సోలార్ (ఆర్‌టీఎస్) ఫేజ్-2ను ప్రారంభించింది. కేంద్ర ఆర్థిక సహాయం, సబ్సిడీతో రెసిడెన్షియల్ సెక్టార్‌లో 4 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యంతో ఆర్‌టీఎస్‌ను ఏర్పాటు చేయాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు. 2023 నవంబరు నాటికి 2651.10 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఆర్‌టీఎస్‌ను ఏర్పాటు చేశారు. తాజాగా ప్రధానమంత్రి సూర్యోదయ యోజనలో మరింత మెరుగైన సబ్సిడీ ఇచ్చే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.



గ్రేటర్‌లో పెరగనున్న సోలార్ విద్యుత్తు ఉత్పత్తి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్యోదయ యోజన పథకంతో గ్రేటర్ హైదరాబాద్‌లో సోలార్ విద్యుత్తు ఉత్పత్తి మరింత పెంచుకునే అవకాశముందని విద్యుత్తు రంగ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం గ్రేటర్ జోన్‌లో 20 వేలకు పైగా సోలార్ రూఫ్‌టాప్ కనెక్షన్లు ఉండగా ఇన్‌స్టాల్ సామర్థ్యం 300 మెగావాట్లుగా ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుంటున్న వారికి 30 శాతం రాయితీ కల్పిస్తోంది. మూడు కిలోవాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసుకునే సోలార్ రూఫ్‌టాప్‌కు రూ.1.6 లక్షల వ్యయం అవుతుండగా, 30 శాతం రాయితీ పోను రూ.1.1 లక్షలు ఖర్చవుతుందంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీ శాతం పెంచితే మరింత ప్రయోజనం చేకూరుతుందని రిటైర్డ్ ఇంజనీర్లు చెబుతున్నారు.

రూపాయి రాక	
కార్పొరేట్ పన్ను	17
ఆదాయపు పన్ను	19
కస్టమ్స్ సుంకం	4
కేంద్ర ఎక్సైజ్ సుంకం	5
జీఎస్టీ	18
పన్నేతర ఆదాయం	7
రుణేతర మూలధన వసూళ్లు	1
రుణాల ద్వారా	28

రూపాయి పోక	
కేంద్ర పథకాలకు	16
వడ్డీ చెల్లింపులకు	20
రక్షణకు	8
సబ్సిడీలకు	6
ఆర్థిక సంఘం, ఇతర బదిలీలకు	8
కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటా	20
కేంద్ర ప్రాయోజిత పథకాలకు	8
పింఛన్లు, ఇతర ఖర్చులకు	13

మధ్యంతర బడ్జెట్‌లో మహిళ, శిశు అభివృద్ధి శాఖకు రూ.26 వేల కోట్లు కేటాయించారు.

ప్రధాన మంత్రి ముద్ర యోజన పథకం ద్వారా రూ. 22.5 లక్షల కోట్ల విలువైన 43 కోట్ల రుణాలను మంజూరు చేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు.

రాష్ట్రాలకు వడ్డీలేని రుణాల పథకాన్ని మరో ఏడాది పాటు పొడగించనున్నారు. రాష్ట్రాలకు మూలధన వ్యయం పెంచేందుకు ఈ ఏడాది రూ.1.3 లక్షల కోట్ల మేరకు వడ్డీ లేని రుణం కల్పిస్తామని వెల్లడించారు.

ఆర్థికం పరుగుకు 'కూ.. చుక్‌చుక్'..!

» ఎనర్జీ-మినరల్-సిమెంట్ సరఫరాకు ఒకటి

» హై-ట్రాఫిక్ మార్గాలుగా మరొకటి

» పోర్టులతో కనెక్టివిటీకి ఇంకొక కారిడార్

» 40వేల బోగీలు 'వందేభారత్' స్థాయికి అప్‌గ్రేడ్

2.55 లక్షల కోట్లతో రైల్వే బడ్జెట్

3 కారిడార్లుగా రైల్వే శాఖ

న్యూఢిల్లీ: ఆర్థికం పరుగులు పెడుతూ.. జీడీపీకి ఊతవిచ్చేలా రైల్వేలను అభివృద్ధి చేస్తామని కేంద్ర బడ్జెట్ స్పష్టం చేసింది. తాజా నిర్ణయాలతో ప్రయాణికుల సేవలు మరింత మెరుగవుతాయని పేర్కొంది. ప్రస్తుత రైల్వే నెట్‌వర్క్‌ను మూడు కారిడార్లుగా విభజించడంతోపాటు.. 40 వేల సాధారణ ప్యాసింజర్ బోగీలను వందేభారత్ స్థాయికి అప్‌గ్రేడ్ చేస్తామని రైల్వే బడ్జెట్‌లో స్పష్టం చేసింది. ఈ సారి రైల్వే బడ్జెట్‌లో రూ.2,55,393 కోట్లను ప్రకటించగా.. గత ఏడాది కంటే ఇది రూ.15 వేల కోట్లు ఎక్కువ కావడం గమనార్హం..!

మూడు భాగాలుగా రైల్వే..!

రైల్వే శాఖను మూడు ప్రధాన ఆర్థిక కారిడార్లుగా అభివృద్ధి చేస్తారు. వీటిల్లో మొదటి కారిడార్ ఎనర్జీ-మినరల్-సిమెంట్‌కు సంబంధించినదని, రెండో దానికి పోర్టులతో కనెక్టివిటీ ఉంటుంది. ఇక మూడోది.. రవాణా సాంద్రత ఎక్కువగా ఉండే కారిడార్. ఈ మూడు కారిడార్లను 'పీఎం గతిశక్తి పథకం' కింద గుర్తించి, వివిధ మార్గాల ద్వారా అనుసంధానిస్తారు. ఈ కారిడార్ల వల్ల సరుకు రవాణా, ప్యాసింజర్ రైళ్ల కార్యకలాపాలు మెరుగవుతాయని, ప్రమాదాలను నివారించే సురక్షిత సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని కేంద్రం భావిస్తోంది. అన్నింటికీ మించి, ఈ మూడు కారిడార్ల వల్ల జీడీపీ పెరుగుదల ఉంటుందని అభిప్రాయపడుతోంది. 40 వేల సాధారణ రైలు బోగీలను వందేభారత్ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. ఈ నిర్ణయం వల్ల ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించవచ్చని కేంద్రం భావిస్తోంది. ఇప్పటికే దేశంలో వందేభారత్ సెమీ-హైస్పీడ్ రైళ్లు నడుస్తుండగా.. రానున్న రోజుల్లో వీటి సంఖ్య మరింత పెరగనుంది. ప్రస్తుతం వందేభారత్ రైళ్లను స్లీపర్ కోచ్‌లుగా అప్‌గ్రేడ్ చేస్తున్నారు.

పట్టణీకరణ నేపథ్యంలో..

దేశంలో పట్టణీకరణ వేగవంతంగా జరుగుతున్న నేపథ్యంలో.. పట్టణాల రూపురేఖల మార్పునకు మెట్రోరైల్, నమో భారత్ రైళ్ల మరింత ఊతమివ్వనున్నట్లు కేంద్రం అభిప్రాయపడింది. గత ఏడాది అక్టోబరులో ప్రధాని నరేంద్ర మోదీ రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్(ఆర్ఆర్‌టీఎస్) రైలును ఢిల్లీ-మేరఠ్ మధ్య ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ రైళ్ల పేరును నమో భారత్‌గా మార్చారు. 200 కిలోమీటర్లలోపు ప్రాంతీయ ప్రాంతాలను ఈ రైళ్లు అనుసంధానం చేస్తాయి. ప్రస్తుతం దేశంలోని 20 నగరాల్లో 895 కిలోమీటర్ల మేర మెట్రోరైలు సేవలు కొనసాగుతుండగా.. మరో 986 కిలోమీటర్ల మేర మెట్రోలైన్లు నిర్మాణంలో ఉన్నాయి.



కేంద్ర పన్నుల్లో వాటా రూ.25,639 కోట్లు!

» కేంద్ర ప్రాయోజిత పథకాల కింద 19,760 కోట్లు

» 15వ ఆర్థిక సంఘం గ్రాంటు రూ.3,200 కోట్లు

» కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కేటాయింపులివే

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పన్నుల్లో వాటా కింద తెలంగాణకు రూ.25,639 కోట్లు రానున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో పన్నుల వాటా కింద రాష్ట్రానికి రూ.23,400 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. ఈసారి మరో రూ.2,239 కోట్లను పెంచింది. ఇక కేంద్ర ప్రాయోజిత పథకాల (సీఎస్ఎస్) కింద రాష్ట్రానికి రూ.19,760.59 కోట్లు రానున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఆశించిన ఇతరత్రా గ్రాంట్ల ప్రస్తావన మాత్రం బడ్జెట్‌లో లేదు. ఇక 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు స్థానిక సంస్థల గ్రాంటు కింద మరో రూ.3,200 కోట్లు రానున్నాయి. ఈ మూడు పెద్ద పద్దులు తప్ప రాష్ట్రానికి చెప్పుకోదగ్గ కేటాయింపులు లేవు. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం ఈసారి కేంద్రం ముందు భారీ డిమాండ్లను పెట్టింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ప్లాంట్లకు నిధులు కేటాయించాలని, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి కింద మూడేళ్లకు సంబంధించిన రూ.1800 కోట్లను విడుదల చేయాలని కోరింది. హైదరాబాద్-నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్‌కు కూడా అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ అనుమతులిస్తే రాష్ట్రానికి రూ.2,300 కోట్లు విడుదలవుతాయని ఆశించింది. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి, మెట్రో రైలు రెండో దశకు నిధులివ్వాలని, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో బలోపేతానికి రూ.88 కోట్లు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో బలోపేతానికి రూ.90 కోట్ల చొప్పున అదనంగా కేటాయించాలని కోరింది. కానీ, మధ్యంతర బడ్జెట్‌లో కేంద్రం వీటికి ఎలాంటి భరోసా ఇవ్వలేదు. అయితే లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రవేశపెట్టే పూర్తి బడ్జెట్‌లో రాష్ట్రానికి కొన్ని కేటాయింపులు ఉండొచ్చని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణకు రూ.5,071 కోట్లు

» కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు

» రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర బడ్జెట్‌లో రూ.5,071 కోట్ల నిధులను కేటాయించినట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ వెల్లడించారు. గురువారం ఆయన వర్చువల్‌గా దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. రానున్న 6-8 ఏళ్లలో జాతీయ స్థాయిలో 40 వేల కిలోమీటర్ల మేర రైల్వే ట్రాక్‌లను నిర్మిస్తామన్నారు. గడిచిన పదేళ్లలో తెలంగాణలో రైల్వే ప్రాజెక్టుల అభివృద్ధికి రూ.31,221 కోట్లను ఖర్చు చేశామని చెప్పారు. 2009-14 మధ్యకాలంలో రాష్ట్రంలో ఏటా సగటున 70 కిలోమీటర్ల ట్రాక్‌లను నిర్మించగా.. గడిచిన పదేళ్లలో ఆ సగటు 142 కిలోమీటర్లకు పెరిగిందని వివరించారు. "గత పదేళ్లలో 414 ఆర్‌యూబీలు, ఆర్వోబీలను నిర్మించాం. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద తెలంగాణలో 40 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేశాం. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించేలా.. రాష్ట్రవ్యాప్తంగా 45 రైల్వే స్టేషన్లలో వన్‌స్టేషన్-వన్ ప్రోడక్ట్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశాం" అని ఆయన పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు కేంద్రం నిధులు.!

» పీఎంఏవై కింద వినియోగించే అవకాశం

» వచ్చే ఐదేళ్లలో దేశంలో 2 కోట్ల ఇళ్ల నిర్మాణం



హైదరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఇందిరమ్మ ఇల్లు' పథకానికి కేంద్రం నుంచి నిధులు అందనున్నాయి. గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) కింద రాబోయే ఐదేళ్లలో 2 కోట్ల ఇళ్ల నిర్మాణం చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్రం ప్రకటించింది. ఇందుకోసం రూ.80,967కోట్లను కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయబోయే 'ఇందిరమ్మ ఇల్లు' పథకానికి పీఎంఏవై కింద నిధులు అందనున్నాయని స్పష్టమవుతోంది. పీఎంఏవై పథకాన్ని అందుకోవాలంటే ముందుగా రాష్ట్రంలో ఎన్ని ఇళ్లను నిర్మించనున్నారు? అర్బన్‌లో ఎన్ని? రూరల్‌లో ఎన్ని? అనే వివరాలను ఓ సమగ్ర నివేదిక రూపంలో కేంద్రానికి అప్పగించాల్సి ఉంటుంది. కేంద్రం ఆ నివేదికను పరిశీలించి, ఎన్ని ఇళ్లకు సాయం చేసేందుకు నిర్ణయించిందో తెలుపుతూ రాష్ట్రానికి లేఖ రాస్తుంది. అందుకు రాష్ట్ర ప్రభుత్వం సమ్మతిస్తే.. కేంద్రం నిధులను అందజేస్తుంది.

అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట: కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాకర్షక పథకాల కంటే అభివృద్ధి, సంక్షేమానికే కేంద్రం పెద్ద పీట వేసిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఫలితంగా పేదరికం తగ్గి వివిధరంగాల్లో దేశం సమగ్రాభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. యువత ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఉందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరించేందుకు ఈ బడ్జెట్ ఓ గ్యారంటీగా నిలుస్తుందని, అన్ని రంగాలకు విశ్వసనీయత కల్పించేలా బడ్జెట్ ఉందని లక్ష్మణ్ పేర్కొన్నారు.

ఎడారిలో ప్రవాసీ మహిళకు మొండిచేయి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

గల్ఫ్ దేశాల్లో సమస్యలను ఎదుర్కొనే ప్రవాస భారతీయ మహిళల సహాయార్థం వన్ స్టాప్ సెంటర్ నెలకొల్పుతున్నట్లు ప్రకటించిన కేంద్రం ఈసారి బడ్జెట్‌లో మళ్లీ మొండి చేయి చూపింది. నిర్భయ నిధి కింద కేంద్రం ఈసారి తాత్కాలిక బడ్జెట్‌లో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు ఎలాంటి కేటాయింపులు జరుపలేదు. అలాగే, ప్రవాసీయుల సంక్షేమానికి సంబంధించి కూడా ఏ రకమైన కేటాయింపులు లేవు. నూతన పాసుపోర్టు కేంద్రాలు, కార్యాలయాల ఏర్పాటు, భవనాల నిర్మాణానికి సంబంధించి కూడా ఎలాంటి ప్రకటనలూ చేయలేదు. దశలవారీగా చిప్‌లతో కూడిన ఈ-పాసుపోర్టుల జారీ కోసం ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం పాసుపోర్టు సేవల కోసం గతేడాది కంటే కూడా తక్కువగా కేటాయింపులు జరిపింది. విదేశీ ప్రభుత్వాలకు ప్రత్యేకించి పొరుగు దేశాలు, ఆఫ్రికా ఖండంలో అభివృద్ధి ప్రాజెక్టుల కోసం రూ.6,541.79 కోట్లను కేటాయించగా అందులో భూటాన్‌ది సింహభాగం. విదేశాల్లో ప్రత్యేకించి నేపాల్ నుంచి మొదలు అటు ఆఫ్రికా వరకు చైనా క్రియాశీలకంగా దౌత్య సంబంధాలను పటిష్ఠం చేసుకోవడానికి పావులు కదుపుతుండగా కేంద్ర ప్రభుత్వం మాత్రం ఆఫ్రికా దేశాల్లో చెప్పుకోదగ్గ స్థాయిలో ఏవిధమైన సహాయక ప్రాజెక్టులకు కేటాయింపులు చేయలేదు.

పరిశోధనలకు రూ.లక్ష కోట్లతో కార్పస్ ఫండ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: స్టార్టప్‌ల పరిశోధనలు, ఆవిష్కరణలను పెంచేందుకు వీలుగా ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా 50 ఏళ్లపాటు వడ్డీరహిత రుణాలను అందించనుంది. ఇందుకుగాను రూ.లక్ష కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయనుంది. ఈ నిధితో నామమాత్ర లేదా వడ్డీ లేకుండా దీర్ఘకాలిక రుణాలను ఇవ్వనున్నారు. మరోవైపు రక్షణ రంగంలో డీప్‌టెక్‌ను బలోపేతం చేసేందుకు గాను నూతన పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించనుంది.

నదులు అనుసంధానం అయ్యేదెలా..?

» బడ్జెట్ కేటాయింపులు రూ.3,500 కోట్లు

» ఏటా కావాల్సింది రూ.20 వేల కోట్ల పైనే

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నదుల అనుసంధానానికి కేంద్రం ఈసారీ అరకొర నిధులే కేటాయించింది. ప్రస్తుతం అడుగు ముందుకు పడిన వాటిలో మూడు ప్రాజెక్టులు పూర్తి కావాలంటేనే ఏటా రూ.20 వేల కోట్లకు పైగా వెచ్చించాలి. అయితే, ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయించిన రూ.3,500 కోట్లు ఏ మూలకూ సరిపోవని సాగునీటి రంగ నిపుణులు అంటున్నారు. కేటాయింపులు ఇలాగే ఉంటే ప్రాజెక్టుల పూర్తికి వందల ఏళ్లు పడుతుందని చెబుతున్నారు. దేశవ్యాప్తంగా పెనిన్సులర్ కాంపోనెంట్‌లో 16 ప్రాజెక్టులు ఉండగా.. అందులో 7 ప్రాజెక్టుల డీపీఆర్‌లు సిద్ధమయ్యాయి. హిమాలయన్ కాంపోనెంట్‌లో 14 ప్రతిపాదనలు ఉండగా.. అందులో 4 డీపీఆర్‌లు తయారుచేస్తున్నారు. పెనిన్సులర్ కాంపోనెంట్‌లో ప్రస్తుతం కెన్-బెత్వా నదుల అనుసంధానం పనులు జరుగుతుండగా.. తాజాగా రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఉన్న పర్బతి-కలిసింధ్-చంబల్ నదుల అనుసంధానికి అంగీకారం కూడా కుదిరింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.75 వేల కోట్లు. తాజాగా గోదావరి-కావేరి అనుసంధానానికి కూడా రాష్ట్రాల మధ్య ప్రాథమికంగా అంగీకారం కుదిరింది. దీని నిర్మాణ అంచనా వ్యయం రూ.74,326 కోట్లు. కెన్-బెత్వా నదుల అనుసంధానం అంచనా వ్యయం రూ.44,605 కోట్లు. ఈ మూడు ప్రాజెక్టులు పూర్తి కావాలంటే రూ.2 లక్షల కోట్లకు పైగా నిధులు కావాలి. నదుల అనుసంధానం ప్రాజెక్టులకు అయ్యే వ్యయంలో 60 శాతం కేంద్రం భరించాల్సి ఉంటుంది. ఈ లెక్కన కేంద్రం రూ.1.20 లక్షల కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. ప్రతిపాదించిన ప్రాజెక్టులను చేపట్టిన ఐదేళ్లలోపు పూర్తిచేయాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ లెక్కన కేంద్రం ఏటా రూ.24 వేల కోట్లు కేటాయించాలి. 2024-25 బడ్జెట్‌లో రూ.3,500 కోట్లు కేటాయించారు. దీంతో అనుసంధానానికి చాలా ఏళ్లు పట్టవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉపాధికి తగ్గింపు.. ఆవాస్‌కు పెంపు

» యూరియా సబ్సిడీలో భారీ కోత

» రూ.1,65,217 కోట్ల నుంచి రూ.1,19,000 కోట్లకు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మధ్యంతర బడ్జెట్‌లో కొన్ని పథకాలకు నిధుల కేటాయింపులను 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే తగ్గించగా, మరికొన్ని పథకాలకు పెంచారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ.90,806 కోట్ల నుంచి రూ.86 వేల కోట్లకు, అమృత్ నగరాలు, స్మార్ట్ సిటీల మిషన్‌కు రూ.15,153 కోట్ల నుంచి రూ.10,400 కోట్లకు తగ్గించాలని ప్రతిపాదించారు. జాతీయ సామాజిక సహాయ కార్యక్రమానికి నిధులను పెంచలేదు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమానికి కొద్దిపాటి నిధుల పెంపును ప్రకటించారు. జాతీయ ఆహార భద్రత కింద ఎఫ్‌పీఎస్ డీలర్లకు ఇచ్చే మార్జిన్‌ను రూ.8,572 కోట్ల నుంచి రూ.7,075 కోట్లకు తగ్గించారు. ఇక కేటాయింపులు పెరిగిన పథకాలను చూస్తే.. ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు రూ.73,615 కోట్ల నుంచి రూ.80,671 కోట్లకు, జలజీవన్ మిషన్‌కు రూ.54,700 కోట్ల నుంచి రూ.70,163 కోట్లకు, జాతీయ ఆరోగ్య మిషన్‌కు రూ.33,803 కోట్ల నుంచి రూ.38,183 కోట్లకు, సమగ్ర శిక్షా అభియాన్‌కు రూ.32,515 కోట్ల నుంచి రూ.37,500 కోట్లకు, అంగన్‌వాడి, పోషక్ అభియాన్‌లకు రూ.19,876 కోట్ల నుంచి రూ.21,200 కోట్లకు, ప్రధానమంత్రి గ్రామీణ్ సడక్ యోజనకు రూ.18,783 కోట్ల నుంచి రూ.19,000 కోట్లకు పెంచారు. వీటితోపాటు జాతీయ జీవనోపాధి మిషన్ (ఆజీవిక)కు రూ.12,083 కోట్ల నుంచి రూ.15,047 కోట్లకు, ప్రధానమంత్రి కృషి సించాయి యోజనకు రూ.6,380 కోట్ల నుంచి రూ.11,391 కోట్లకు, ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజనకు రూ.6,186 కోట్ల నుంచి రూ.7,500 కోట్లకు, ఆయుష్మాన్ భారత్‌కు రూ.1228 కోట్లనుంచి రూ.4,108 కోట్లకు, స్వచ్ఛ భారత్ (గ్రామీణ్)కు రూ.4,925 కోట్ల నుంచి రూ.7,192 కోట్లకు, స్వచ్ఛ భారత్ (పట్టణ)కు రూ.1926 కోట్ల నుంచి రూ.5,000 కోట్లకు, కృషోన్నతి యోజనకు కేటాయింపులను రూ.4,716 కోట్ల నుంచి రూ.7,447 కోట్లకు పెంచారు. పంటల బీమా పథకం, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన, వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి, అన్నదాత సంరక్షణ యోజన, రైతు ఉత్పత్తి సంఘాలకు, వడ్డీ రాయితీలకు ఈసారి నిధులు భారీగా పెంచారు. పంటల బీమాకు రూ.10,296 కోట్ల నుంచి రూ.14,600 కోట్లకు, కిసాన్ సమ్మాన్ నిధికి రూ.58,254 కోట్ల నుంచి రూ.60 వేల కోట్లకు, రైతు ఉత్పత్తి సంఘాలకు రూ.124 కోట్ల నుంచి రూ.582 కోట్లకు, వడ్డీ రాయితీలను రూ.17,998 కోట్ల నుంచి రూ.22,600 కోట్లకు పెంచారు. అయితే యూరియా సబ్సిడీ మాత్రం రూ.1,65,217 కోట్ల నుంచి రూ.1,19,000 కోట్లకు తగ్గడం గమనార్హం.

పీఎం-కిసాన్ ఆర్థికసాయం యథాతథం!

» ఫసల్ బీమా యోజనకు కేంద్రం ప్రాధాన్యం

» వచ్చే సీజన్ నుంచి రాష్ట్రంలో అమలుకు ఛాన్స్

» నూనె గింజల సాగుపై కేంద్రం ఫోకస్



హైదరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) ఆర్థిక సాయాన్ని పెంచనున్నట్టు ప్రచారం జరిగినప్పటికీ ఆ పథకాన్ని యథాతథంగా అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఒక్కో విడతకు రూ.2 వేల చొప్పున మూడు విడతల్లో ఏడాదికి రూ.6 వేలు ఇస్తుండగా ఇకపై కూడా ఆ మేరకే కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందనుంది. పీఎం-కిసాన్‌లో ఒక్కో రైతుకు ఇచ్చే పెట్టుబడి సాయాన్ని రూ.6 వేల నుంచి రూ.9 వేలకు పెంచుతారనే చర్చలు జరిగినప్పటికీ కేంద్రం పెంపుదలపై దృష్టి సారించలేదు. రాష్ట్రంలో 69 లక్షల మంది రైతులు ఉండగా పీఎం-కిసాన్‌లో 29 లక్షల మంది రైతులు లబ్ధిదారులుగా ఉన్నారు. ఒక్కో విడతకు రూ.576 కోట్లు ఈ రైతులకు అందుతున్నాయి. ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకానికి కేంద్రం ప్రాధాన్యమిస్తోంది. అయితే నాలుగేళ్లుగా రాష్ట్రంలో పంటల బీమా పథకం అమలు కావటం లేదు. పీఎంఎఫ్‌బీవైతో ప్రయోజనం లేదని అప్పటి కేసీఆర్ ప్రభుత్వం బయటికి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే వానాకాలం సీజన్ నుంచి పంటల బీమా పథకం అమలుచేసే అవకాశాలున్నాయి. పీఎంఎఫ్‌బీవైను వినియోగించుకుంటూనే పంటల బీమా పథకానికి మార్గదర్శకాలు రూపొందించే అవకాశాలున్నాయి. ఆత్మనిర్భర్ నూనె గింజల అభియాన్‌ను కేంద్రం అమలు చేస్తోంది. రాష్ట్రంలో నూనె గింజల సాగు పెద్దగా లేదు. ఈ విస్తీర్ణం పెరగాల్సి ఉంది. కేంద్రం ఆయిల్‌పామ్ ప్రాజెక్టును కూడా ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోంది. రాష్ట్రంలో 1.54 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోంది. ఈ విస్తీర్ణాన్ని పెంచేందుకు కేంద్ర పథకాలను వినియోగించుకునే అవకాశాలు ఉన్నాయి.





16,85,494 కోట్లు

అప్పులు..

రెవెన్యూ లోటును పూడ్చేందుకు రూ.16,85,494 కోట్లు అప్పులు చేయాలని కేంద్రం నిర్ణయించింది. 2023-24లో రూ.17,34,773 కోట్ల అప్పును కేంద్ర సర్కారు తీసుకుంది. 2022-23లో రూ.17,37,755 కోట్లు అప్పులు చేసింది.

ఆదాయం..



జీడీపీలో పన్నులు 11.7%

ఈ ఏడాది ప్రత్యక్ష పన్నుల ద్వారా 6.7 శాతం, పరోక్ష పన్నుల ద్వారా 4.9 శాతం.. ఇలా జీడీపీలో పన్ను నిష్పత్తి 11.7 శాతం ఉంటుందని బడ్జెట్ అంచనా వేసింది. 2023-24లో ప్రత్యక్ష పన్నుల ద్వారా 6.6 శాతం, పరోక్ష పన్నుల ద్వారా 5 శాతం.. మొత్తంగా 11.6 శాతం నిధులు సమకూరాయి. 2022-23లో పన్నుల ద్వారా 11.2 శాతం ఆదాయం వచ్చింది.

విద్య, ఆరోగ్యానికి అంతంతే..



ఆరోగ్య రంగానికి కేంద్రం రూ.90,658..63 కోట్లు కేటాయించింది. ఇది మొత్తం బడ్జెట్‌లో 0.9 శాతం మాత్రమే. 2023-24లో 0.79 శాతం, 2022-23లో 0.74 శాతం నిధులను కేంద్రం కేటాయించింది. విద్యా రంగానికి బడ్జెట్‌లో రూ.1,20,627.8 కోట్లు కేటాయించారు. 2023-24లో ఇది రూ.1,12,898.9 కోట్లుగా ఉంది. గత ఏడాది ఇదే రంగానికి రూ.1.12 లక్షల కోట్లు కేటాయించారు.

గ్రామీణాభివృద్ధికి రూ.1.77 లక్షల కోట్లు

- గతేడాది బడ్జెట్‌తో పోలిస్తే 12% అధికం
- ఉపాధి హామీకి 43% ఎక్కువ నిధులు
- లఖ్‌పతి దీదీ పథకం లక్ష్యం 3కోట్లకు పెంపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను మధ్యంతర బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధి శాఖకు కేంద్రం రూ.177 లక్షల కోట్లు కేటాయించింది. గతేడాది కేటాయించిన రూ.1.57 లక్షల కోట్లతో పోలిస్తే ఇది దాదాపు 12శాతం అధికం. అయితే సవరించిన అంచనాల ప్రకారం గతేడాది ఈ శాఖ చేసిన వ్యయం రూ.1.71 లక్షల కోట్లు కాగా, ప్రస్తుతం అంతకంటే 3శాతం ఎక్కువ కేటాయించారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మధ్యంతర బడ్జెట్‌లో రూ.86వేల కోట్లు కేటాయించారు. ఈ పథకానికి గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.60వేల కోట్లతో పోలిస్తే ఇది 43శాతం ఎక్కువ.

మహిళలను లక్షాధికారులను చేసే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన 'లఖ్‌పతి దీదీ' పథకం లక్ష్యాన్ని 3 కోట్లకు పెంచారు. ఈ పథకంలో భాగంగా స్వయం సహాయక బృందాల్లోని మహిళలకు శిక్షణ ఇస్తారు. దాంతో వారు ఏటా రూ.లక్షకు పైగా ఆదాయం సంపాదించే అవకాశం ఉంటుంది.

జాతీయ జీవనోపాధి మిషన్-అజీవికకు రూ.15,047 కోట్లు కేటాయించారు. గతేడాది కేటాయించిన రూ.14,129.17 కోట్లతో పోలిస్తే ఇది 6శాతం అధికం. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజనకు కేటాయింపులు తగ్గాయి. మధ్యంతర బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.12వేల కోట్లు కేటాయించగా గతేడాది సవరించిన అంచనాల ప్రకారం చేసిన వ్యయం రూ.17వేల కోట్లుగా నమోదైంది.

పెట్రోల్, డీజిల్ కారణంగా వెలువడే కాలుష్యాన్ని పూర్తిస్థాయిలో నివారించడమే లక్ష్యంగా పెట్టుకున్న కేంద్ర ప్రభుత్వం.. భవిష్యత్ చోదక శక్తిగా విద్యుత్తును ఎంచుకుంది. ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీని విస్తృతం చేసేందుకు, చార్జింగ్ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు మధ్యంతర బడ్జెట్‌లో ప్రకటించింది. భారత ప్రజా రవాణాను ఎలక్ట్రిక్ ఆధారితం చేయాలన్న ప్రధాని మోదీ ఉద్దేశానికి అనుగుణంగా చర్యలు చేపడతామని తెలిపింది. ఇందులోభాగంగా బస్సుల వంటి అత్యధిక శాతం ప్రజా రవాణా వాహనాలను ఈవీలుగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా పేర్కొన్నారు.

మళ్లీ మాదే అధికారం!

అద్భుతమైన మెజారిటీతో వస్తాం.. మధ్యంతర బడ్జెట్‌లో నిర్మల ఉద్ఘాటన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: "మా దృష్టిలో ప్రధానమైన కులాలు నాలుగు. అవి... పేదలు, మహిళలు, యువత, రైతులు! ఈ ప్రధాన వర్గాల సంక్షేమానికే మా ప్రాధాన్యం" అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. గురువారం ఆమె లోక్‌సభలో వరుసగా... తన ఆరో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఎన్నికల ముందు తాత్కాలికంగా, 'ఓటాన్ అకౌంట్ బడ్జెట్ మాత్రమే సమర్పించడం సంప్రదాయం! కానీ... 'ఓట్ల కాలం' ముందున్న నేపథ్యంలో నిర్మల 2024-25 ఆర్థిక సంవత్సరానికి 'మధ్యంతర బడ్జెట్'ను తీసుకొచ్చారు. 56 నిమిషాలపాటు సాగిన బడ్జెట్ ప్రసంగంలో పదేళ్లలో సాధించిన ఘనతలు, భవిష్యత్ లక్ష్యాలను వివరించేందుకు ప్రాధాన్యమిచ్చారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో విజయం తమదేనని... 'హ్యాట్రిక్ కొట్టేస్తామని నిర్మలా సీతారామన్ పరోక్షంగా చెప్పేశారు. "అద్భుతమైన పాలన అందించాం. వచ్చే ఎన్నికల్లో అద్భుతమైన మెజారిటీతో ప్రజలు మమ్మల్ని ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నాం" అని నిర్మల పేర్కొన్నారు. ఆ సమయంలో అధికార పక్షం వైపు నుంచి చప్పట్ల హోరు వినిపించగా... విపక్ష సభ్యులు మాత్రం నిరసన తెలిపారు. ఈ ఒక్క సందర్భంలో తప్ప... మిగిలిన మొత్తం బడ్జెట్ ప్రసంగాన్ని ప్రతిపక్ష సభ్యులు శ్రద్ధగా విన్నారు.



నిర్మలా సీతారామన్ 2020లో 2 గంటలా 40 నిమిషాలపాటు బడ్జెట్ ప్రసంగం చేశారు. ఇది ఆమె అత్యంత సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం! గురువారం మాత్రం 56 నిమిషాల్లో ముగించేశారు. ఇది.. ఆమె అత్యంత క్లుప్తమైన బడ్జెట్ ప్రసంగం!

నాలుగు వర్ణాలు... వీరే!

"సమ్మిళిత, సమగ్ర అభివృద్ధిపై మా ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో అన్ని వర్ణాల వారూ ఉంటారు. కానీ... ప్రధానంగా నాలుగు వర్ణాల సంక్షేమంపై దృష్టి పెడతాం. వారే... పేదలు, మహిళలు, అన్నదాతలు,యువత! వీరు పురోగమిస్తేనే దేశమూ పురోగమిస్తుంది. 2047 నాటికి వికసిత్ భారత్ సాధనే మా లక్ష్యం" అని నిర్మల పేర్కొన్నారు. గతంలో 'సామాజిక న్యాయం' కేవలం ఒక రాజకీయ నినాదంగా ఉండేదని, దానిని తాము మాత్రమే నిజమైన విధానంగా అమలు చేశామని చెప్పారు. ప్రస్తుతం సామాజిక స్థితితో సంబంధం లేకుండా అందరికీ సమాన అవకాశాలు, వనరులు అందుతున్నాయని చెప్పారు. సామాజిక-ఆర్థిక పరివర్తన సాధించేందుకు తాము 'కేటాయింపు'లకంటే ఫలితాల సాధనపై ఎక్కువ దృష్టి సారించామని తెలిపారు. దీని ఫలితంగా... గత పదేళ్లలో 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి లభించిందన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందే లా పారదర్శకత పాటించామని తెలిపారు. 2014తో పోల్చితే... తలసరి ఆదాయం రెట్టింపు అయ్యిందని, రూ.1.74 లక్షలకు చేరిందని చెప్పారు. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో పదో స్థానంలో ఉన్న భారత్... ఈ పదేళ్లలో ఐదో స్థానానికి చేరుకుందని నిర్మల పేర్కొన్నారు. ఆధార్, కొవిడ్ వ్యాక్సినేషన్ వంటి బృహత్ కార్యాలను వేగంగా పూర్తి చేశామన్నారు. కొవిడ్ కష్టకాలంలో ఏ ఒక్కరూ ఖాళీ కడుపుతో పడుకోకూడదని... 28నెలలపాటు 80కోట్లమందికి ఉచితంగా ఆహార ధాన్యాన్ని అందించామన్నారు. పేదలకు 'పౌష్టిక- ఆహారం' అందించాలనే లక్ష్యంతో 'అంత్యోదయ' కుటుంబాలకు 2023 జనవరి నుంచి మరో ఏడాదిపాటు ఉచిత ఆహార ధాన్యాన్ని అందించామన్నారు. 'వసుధైక కుటుంబ' నినాదంతో భారత్ వేదికగా నిర్వహించిన జీ-20 సదస్సును గుర్తు చేశారు.

ఇదీ లక్ష్యం... ఇదీ మార్గం...

సాంకేతిక, విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థను నిర్మించడమే తమ లక్ష్యమని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. దీనిని సాధించేందుకు 'ప్రజా భాగస్వామ్యం' (జన్ భాగీదారీ), సబ్‌కా సాథ్ సబ్‌కా ప్రయాస్ (అందరితో కలిసి, అందరి కృషి) ఎంతో అవసరమన్నారు. పౌరులకు విస్తృతంగా అవకాశాలు కల్పించడం, ఉపాధి అవకాశాలు మెరుగయ్యేలా వృద్ధిరేటుపై దృష్టి సారించడం, స్థిరమైన సూక్ష్మ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు.

బడ్జెట్‌లో ప్రాధాన్యాలు..

మధ్యంతర బడ్జెట్‌ను ఏడు ప్రాధాన్యాల ఆధారంగా రూపొందించారు. అవి...

1) సమ్మిళిత అభివృద్ధి 2) చివరి వ్యక్తికీ లబ్ధి చేకూర్చడం 3) మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు 4) ప్రబల శక్తిని వినియోగించడం 5) గ్రీన్ గ్రోత్ 6) యువ శక్తి 7) ఆర్థిక రంగం

ఇవీ సాధించాం..

- స్వచ్ఛ భారత్ కింద 11.7 కోట్ల గృహాలకు మరుగుదొడ్లు.
- ఉజ్వల ద్వారా 9.6 కోట్ల గ్యాస్ కనెక్షన్లు
- 102 కోట్ల మందికి 202 కోట్ల కొవిడ్ టీకా డోస్‌లు.
- 47.8 కోట్ల పీఎం జన్‌ధన్ ఖాతాలు
- పీఎం సురక్షా బీమా, జీవన్ జ్యోతి బీమా కింద 44.6 కోట్ల మందికి బీమా
- కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా 11.4 కోట్ల మందికి రూ.2.2 లక్షల కోట్లు బదిలీ.

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు టీకాలు!




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశ ప్రజల ఆరోగ్య సంరక్షణకు సంబంధించి కేంద్ర బడ్జెట్‌లో కొన్ని కీలక ప్రకటనలు చేశారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న ఆస్పత్రులు, మౌలిక సదుపాయాలను వినియోగించుకొని మరిన్ని వైద్య కళాశాలలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని పరిశీలించేందుకు కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. 9-14 ఏళ్ల బాలికల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రోత్సహించనున్నట్లు వెల్లడించారు. "వైద్యులుగా ప్రజలకు సేవ చేయాలని చాలామంది యువత ఆశ పడుతున్నారు. ఈ నేపథ్యంలో దేశంలో మరిన్ని వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తాం. ఈ అంశాన్ని పరిశీలించి, అవసరమైన సిఫారసులు చేసేందుకు కమిటీని నియమిస్తాం" అని నిర్మల చెప్పారు. పిల్లల్లో రోగ నిరోధక శక్తిని పెంచడానికి తీసుకొచ్చిన 'మిషన్ ఇంద్ర ధనుస్సు' నిర్వహణకు కొత్తగా ఏర్పాటు చేసిన 'యు-విన్' వేదికను దేశవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తామన్నారు. ప్రస్తుతం ఈ కార్యక్రమాన్ని దేశంలోని రెండు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్నారు. యు-విన్ పోర్టల్‌ను కొ-విన్ పోర్టల్‌కు అనుసంధానం చేస్తారు. యు-విన్ పోర్టల్ ద్వారా వ్యాక్సినేషన్ స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. ఇక మాతా, శిశు ఆరోగ్య సంరక్షణ పథకాలను పక్కాగా అమలు చేసేందుకు సమగ్ర కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు నిర్మల తెలిపారు. సాక్షమ్ అంగన్‌వాడీ పథకం కింద అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునికీకరిస్తామని.. చిన్నారుల ఎదుగుదల కోసం పోషకాహార పంపిణీని మెరుగ్గా అందించేందుకు 'పోషణ్ 2.0' కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేస్తామని వివరించారు.

పదేళ్ల కిందటి ఆర్థిక అస్తవ్యస్తంపై శ్వేతపత్రం: నిర్మల

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: పదేళ్ల కింద యూపీఏ హయాంలోని ఆర్థిక అస్తవ్యస్త పరిస్థితులపై మోదీ ప్రభుత్వం తాజాగా శ్వేతపత్రం తీసుకురానుంది. వాటి నుంచి పాఠాలు నేర్చుకునే ఉద్దేశంతో దీనిని పార్లమెంటులో ప్రవేశపెడతామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో వెల్లడించారు. 2014లో మనం ఎక్కడున్నాం.. ఇప్పుడు ఎక్కడ ఉన్నామో తెలుసుకోవాలన్నారు. 'మోదీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టినప్పుడు ఆర్థిక వ్యవస్థను దశలవారీగా సరిదిద్ది పాలనా వ్యవస్థలన్నిటినీ గాడిలో పెట్టాల్సిన పరిస్థితి. దేశమే మొదట అనే విశ్వాసంతో.. ఆ బాధ్యతను ప్రభుత్వం విజయవంతంగా నిర్వర్తించింది. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్' అనే మంత్రంతో నాటి సంక్షోభాన్ని, సవాళ్లను అధిగమించాం. ఆత్మనిర్భర్ భారత్ దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నాం. భారత్ అభివృద్ధి, వలస వాసనల సమూల నిర్మూలన, మన సంస్కృతీ వారసత్వాలకు గర్వపడడం.. పౌరుల్లో కర్తవ్య భావం నింపడం అనే 'పంచ్ ప్రాణ్' ప్రమాణంతో అమృత కాలానికి పటిష్ఠ పునాదులు నిర్మించాం. మేం చేసిన అద్భుత కృషి ఆధారంగా ప్రజలు వచ్చే ఎన్నికల్లో మళ్లీ మా ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తారని ప్రగాఢంగా విశ్వసిస్తున్నాం' అని నిర్మల తెలిపారు.


దేశాభివృద్ధికి గ్యారెంటీ

యువతకు భారీగా ఉపాధి అవకాశాలు.. మధ్యంతర బడ్జెట్‌పై ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశాభివృద్ధి కొనసాగింపునకు గ్యారెంటీ అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశాభివృద్ధికి పడిన పునాదులను మరింత బలోపేతం చేస్తుందని అభిప్రాయపడ్డారు. అంతేకాక, ఇది మధ్యంతర బడ్జెట్ కాదని, సృజనాత్మక, సమ్మిళిత బడ్జెట్ అని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి నాలుగు స్తంభాలైన యువత, పేద, మహిళలు, రైతుల సాధికారతకు దోహదపడుతుందని చెప్పారు. యువ భారత్ ఆకాంక్షలను బడ్జెట్ ప్రతిబింబిస్తోందని అన్నారు. పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు భరోసా నిస్తుందని తెలిపారు. పరిశోధనలు, ఆవిష్కరణలకు బడ్జెట్‌లో లక్షల కోట్ల నిధులు కేటాయించడంతో స్టార్టప్‌లకు మరింత ప్రోత్సాహం లభించనుందని చెప్పారు. పీఎం ఆవాస యోజన కింద మరో రెండు కోట్ల ఇళ్లు నిర్మించాలని, మూడు కోట్ల మంది మహిళలను లక్షాధికారులు చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడం పేదల సంక్షేమానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనం అన్నారు. బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన ఆదాయ పన్ను ఉపశమన పథకం వల్ల కోటి మందికి పైగా మధ్యతరగతి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. నానో డీఏపీ, పీఎం మత్స్య సంపద యోజన పథకాలు రైతుల ఆదాయాన్ని పెంచుతాయని మోదీ పేర్కొన్నారు. కాగా, మధ్యంతర బడ్జెట్‌లో సమాజంలోని అన్ని వర్గాల కోసం ఏదో ఒక అంశం ఉందని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభిప్రాయపడ్డారు. బడ్జెట్‌లో మూలధన వ్యయాన్ని భారీ స్థాయిలో పెంచడంతో 2027 నాటికి భారత్ ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు దోహదం చేస్తుందని అన్నారు.

బడ్జెట్ నిరాశాజనకం: కాంగ్రెస్



కేంద్రం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ నిరాశజనకంగా ఉందని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ సభ్యులు అభిప్రాయపడ్డారు. మధ్యంతర బడ్జెట్‌లో జవాబుదారీతనం, ముందుచూపు కనిపించడం లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. గత ప్రభుత్వ పాలనపై శ్వేతపత్రం విడుదల చేస్తామని చెప్పిన ఆర్థిక మంత్రి నిర్మల.. పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం ఎన్ని హామీలను నెరవేర్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ద్రవ్య లోటు గణాంకాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని కాంగ్రెస్ నేత మనీశ్ తివారి అన్నారు. బడ్జెట్ ప్రసంగం ప్రచార ఆర్భాటంలా కనిపించిందని తెలిపారు. ఇక, వైఫల్యాలను విజయాలుగా చూపించుకునే సామర్థ్యం ఈ ప్రభుత్వానికి ఉందని బడ్జెట్‌తో స్పష్టమైందని శశి థరూర్ అన్నారు. నిరుద్యోగం వంటి అనేక అంశాలను ప్రస్తావించకుండా బడ్జెట్ ప్రసంగం ఉండడం నిరాశ కలిగించిందని తెలిపారు. బడ్జెట్ కేటాయింపుల్లో వివక్ష చూస్తోంటే దక్షిణాది రాష్ట్రాలను ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేయాలని కోరడం తప్ప మరో దారి కనిపించడం లేదని కర్ణాటక కాంగ్రెస్ నేత, ఎంపీ డీకే సురేశ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దక్షిణాది రాష్ట్రాలకు రావాల్సిన నిధులను ఉత్తరాది రాష్ట్రాలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. డీకే సురేశ్ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. విభజించి పాలించడమనే విధానం కాంగ్రెస్‌లో రక్తంలోనే ఉందని బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య విమర్శించారు. అయితే, డీకే సురేష్.. ప్రజాభిప్రాయాన్నే చెప్పారని ఆయన సోదరుడు, కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్ పేర్కొన్నారు.

విమానంలో ఎగిరిపోదాం!

- మెట్రోయేతర నగరాలకూ విమానాలు
- విమానాశ్రయాల విస్తరణ.. కొత్త వాటి అభివృద్ధి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి1: దేశంలో విమానయాన రంగ విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. ప్రస్తుతమున్న విమానాశ్రయాలను విస్తరించడంతో పాటు కొత్త విమానాశ్రయాల అభివృద్ధిని వేగవంతం చేయనున్నట్టు పేర్కొంది. మెట్రోయేతర నగరాలకు కొత్త విమాన సర్వీసులు ప్రారంభించి, అంతర్జాతీయ విమాన వాణిజ్యాన్ని సులభతరం చేయడానికి చర్యలు తీసుకోనున్నట్టు తెలిపింది. 'గత పదేళ్లలో పౌర విమానయాన రంగం పుంజుకుంది. విమానాశ్రయాల సంఖ్య రెట్టింపై 149కు చేరుకుంది. ఉడాన్ పథకం కింద 2, 3 తరగతి నగరాలకు విమాన సర్వీసులను అందుబాటులోకి తేవడం ద్వారా 517 కొత్త మార్గాల్లో కోటి 30 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి' అని బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. దేశం నలుమూలలా ముఖ్యమైన నగరాల్లో విమాన సర్వీసులను అందుబాటులోకి తీసుకురావడానికి 2016లో కేంద్ర ప్రభుత్వం ఉడాన్ (ప్రాంతీయ అనుసంధాన పథకం)ను ప్రారంభించింది. ఇందులో భాగంగా భారతీయ విమానయాన సంస్థలు కొత్తగా 1000 విమానాల కొనుగోళ్లకు ఆర్డర్ ఇచ్చినట్టు నిర్మల వెల్లడించారు.

నిర్మలగారి బడ్జెట్



వివరం రూ. కోట్లలో	2022-23 (వాస్తవ)	2023-24 (బ.అం.)	2023-24 సవరించిన	2024-25 (బ.అం.)
1) రెవెన్యూ వసూళ్లు	22,83,206	26,32,281	26,99,713	30,01275
ఎ)పన్ను ఆదాయం	20,97,786	23,30,631	23,23,918	26,01,574
బి) పన్నేతర ఆదాయం	2,85,421	3,01,650	3,75,795	3,99,701
2) మూలధన వసూళ్లు	18,09,951	18,70,816	17,90,773	17,64,494
ఎ) రుణ వసూళ్లు	26,161	23,000	26,000	29,000
బి) ఇతర వసూళ్లు	46,035	61,000	30,000	50,000
సి) రుణాలు	17,37,755	17,86,816	17,34,773	16,85,494
3) మొత్తం వసూళ్లు	41,93,157	45,03,097	44,90,486	47,65,768
4) పథకాలకు వ్యయం	34,53,132	35,02,136	35,40,239	36,54,657
5) పథకేతర వ్యయం	7,40,025	10,00,961	9,50,246	11,11,111
6) మొత్తం వ్యయం	41,93,157	45,03,097	44,90,486	47,65,768
7) రెవెన్యూ లోటు	10,69,926	8,69,855	8,40,527	6,53,383

బ.అం. - బడ్జెట్ అంచనా స.అం - సవరించిన అంచనా

పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టి

- లక్షద్వీప్‌తోపాటు ఇతర పర్యాటక కేంద్రాల అభివృద్ధి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: లక్షద్వీప్‌తోపాటు పలు దీవులు, ప్రముఖ పర్యాటక కేంద్రాలలో మౌలిక సదుపాయాలను కల్పించాలని కేంద్రం నిర్ణయించింది. అలాగే, దేశంలోని చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యం కలిగిన పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్రాలను ప్రోత్సహించి, వాటికి ప్రపంచ స్థాయిలో బ్రాండింగ్, మార్కెటింగ్ చేయాలని నిర్ణయించింది. వసతులు, సేవలలో నాణ్యత ఆధారంగా పర్యాటక కేంద్రాలకు రేటింగ్ ఇచ్చేలా ఓ నూతన ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించి, అభివృద్ధి పనులు చేపట్టేందుకు రాష్ట్రాలకు దీర్ఘకాలిక వడ్డీలేని రుణాలను అందించనుంది. లక్షద్వీప్‌తోపాటు ఇతర దీవులు, పర్యాటక కేంద్రాలకు పోర్టులు, విమానయాన కనెక్టివిటీ పెంచి, పర్యాటక వసతి, సౌకర్యాలను కల్పించనుంది.

మాల్దీవులకు సాయంలో కోత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: గత బడ్జెట్‌లో మాల్దీవులకు రూ.770.90 కోట్లు కేటాయించిన కేంద్రం.. ఈసారి దానిని రూ.600 కోట్లకు తగ్గించేసింది. వాస్తవానికి నిరుటి పద్దులో ఆ దేశానికి తొలుత రూ.400 కోట్లు మాత్రమే ఇస్తామని పేర్కొన్నా.. తర్వాత దానిని బాగా పెంచింది. 2022-23 బడ్జెట్‌తో పోలిస్తే ఇది 300 శాతం అధికం కావడం గమనార్హం. అయితే, ఇటీవలి పరిణామాల నేపథ్యంలో వైఖరి మార్చుకున్నట్లు కనిపిస్తోంది. కాగా, చైనాతో ఇబ్బంది ఎదుర్కొంటున్న భూటాన్‌కు రూ.2,068 కోట్లు ఇస్తూ పెద్దపీట వేసింది. నేపాల్‌కు రూ.700 కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపింది. వీటితర్వాత అత్యధికం కేటాయించింది మాల్దీవులకే. మరోవైపు మొత్తమ్మీద విదేశాలకు చేసే సాయాన్ని ప్రస్తుత బడ్జెట్‌లో 10 శాతం తగ్గించారు. నిరుడు రూ.5,426 కోట్లివ్వగా.. ఇప్పుడు దానిని రూ.4,883 కోట్లకు పరిమితం చేసింది.

కీలక రంగాలు.. కేటాయింపులు (రూ. కోట్లలో)



వ్యవసాయం 1,27,470

రక్షణ 6,21,541





విద్య 1,20,628

హోంశాఖ 2,02,869





రోడ్డు రవాణా 2,78,000

ఎరువులు 1,68,380





గ్రామీణాభివృద్ధి 1,80,233





రాష్ట్రాలకు ఇచ్చేది

పన్నుల వాటా కింద చెల్లించే నిధులు, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలకు ఇచ్చే సొమ్ము, పలు గ్రాంట్లు/లోన్లు తదితర అవసరాల కోసం రాష్ట్రాలకు కేంద్రం రూ.22,22,264 కోట్లు చెల్లించనుంది. ఇందులో రాష్ట్రాలకు పన్నుల వాటా కింద రూ.12,19,783 కోట్లు కోట్లు, ఆర్థిక కమిషన్ నిధుల రూపంలో రూ.1,32,378 కోట్లు, కేంద్ర ప్రభుత్వ పథకాలకు రూ.6,81,480 కోట్లు ఇవ్వనుంది.

22,22,264 కోట్లు

వడ్డీ చెల్లింపులకు

వివిధ అవసరాల కోసం తెచ్చిన రుణాలకు చెల్లించే వడ్డీల చెల్లింపుల కోసం సుమారు రూ.11,90,440 కోట్లు అవసరం అవుతుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. 2023-24లో వడ్డీల చెల్లింపులకు 10,55,427 కోట్లు అవుతుందని అంచనా వేశారు. 2022-23లో రూ.9,28,517 కోట్ల నిధులను వడ్డీలకు చెల్లించారు.

రూ. **11.90** లక్షల కోట్లు



జీడీపీ

వచ్చే ఏడాదికిగాను జీడీపీ రూ.3,27,71,808 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 10% అధికం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ రూ.2,96,57,745 కోట్లు ఉంటుందని అంచనా వేశారు.

3.27 కోట్ల కోట్లు

వరాలు.. వాతలు లేకుండానే..



సార్వత్రిక ఎన్నికలున్నా సాదాసీదాగానే నిర్మల బడ్జెట్

ఓట్లాటకు సై



(మొదటిపేజీ తరువాయి)

డిడక్షన్‌ను 50 వేలకు పెంచారు. పన్ను ఆదాయం 5 లక్షల వరకూ ఉన్నవారికి రిబేటు ప్రకటించారు. 'పీఎం కిసాన్' పేరిట కొత్త పథకానికి శ్రీకారం చుట్టారు! దాంతో, ఈ బడ్జెట్‌లోనూ వరాల జల్లులు కురిపించవచ్చని వివిధ వర్గాలు ఆశించాయి! కానీ... నిర్మలమ్మ వీరందరినీ నిరాశపరిచారు. పదేళ్లలో ఎంతో కష్టపడ్డామని, ఇంకెంతో సాధించామని లెక్కలు విప్పారు. అందుకే... ప్రజలు తమకు మరోసారి అద్భుత విజయం కట్టబెడతారనే ఆశాభావం ప్రకటించారు. పదేళ్లలో ఏం చేశామో బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మల ఏకరువు పెట్టారు! ఎప్పట్లాగే, ఆర్థిక క్రమశిక్షణే తమ ప్రథమ లక్ష్యమని చెప్పారు! అందుకు అనుగుణంగానే.. 'గత పదేళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ అద్భుతంగా పరిణామం చెందింది' అంటూ తన బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించారు! పదేళ్ల కిందటి యూపీఏ; తమ పాలనలోని విజయ, వైఫల్యాలపై శ్వేతపత్రం విడుదల చేస్తామని ప్రకటించారు! వెరసి, 'ఈసారి బడ్జెట్‌లో ప్రజాకర్షక పథకాలు గుప్పించం... పదేళ్ల మా పాలన చూసి ఓటు వేయండి' అని ప్రజలకు స్పష్టం చేశారు!

ఊరించి.. ఉసూరనిపించి..!

నిరుపేదలు, మహిళలు, యువత, రైతుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించిన ఆర్థిక మంత్రి నిర్మల.. వారితోపాటు ఇతరులకూ నిర్దిష్టంగా ఎటువంటి వరాలూ ప్రకటించలేదు. అలాగే వాతలూ పెట్టలేదు. మళ్లీ అధికారంలోకి వచ్చేది తామేనన్న మోదీ సర్కారు ధీమా బడ్జెట్ ప్రసంగంలో ప్రతిఫలించింది! రాబోయే ఐదేళ్లలో మునుపెన్నడూ లేని అభివృద్ధి జరగనుందని, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ కల సాకారానికి ఇది స్వర్ణ యుగమని నిర్మల చెప్పారు. రాబోయే ఐదేళ్లలో మధ్య తరగతి గృహ నిర్మాణానికి సంబంధించి కొత్త పథకం ప్రకటిస్తామని నిర్మల ప్రకటించారు. ప్రధాన మంత్రి ఆవాస యోజన కింద మూడు కోట్ల మార్కుకు చేరుకుంటున్నామని, రాబోయే ఐదేళ్లలో మరో రెండు కోట్ల ఇళ్లను నిర్మిస్తామని వెల్లడించారు. రైల్వేలో మూడు (ఎనర్జీ, మినరల్, సిమెంట్) భారీ కారిడార్లను చేపట్టడంతోపాటు ఏకంగా 40 వేల సాధారణ బోగీలను వందే భారత్ స్థాయిలో తీర్చిదిద్దుతామని తెలిపారు. పోర్టు కనెక్టివిటీ కారిడార్లు, హై ట్రాఫిక్ డెన్సిటీ కారిడార్లనూ తీసుకొస్తామన్నారు. విమానాశ్రయాలను విస్తరించడంతోపాటు కొత్తగా వెయ్యికిపైగా విమానాలను కొంటామని చెప్పారు. రూఫ్ టాప్ సోలార్ పథకం కింద దేశవ్యాప్తంగా కోటి ఇళ్లకు 300 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్తు అందజేస్తామని ప్రకటించారు. టెక్నాలజీ అంటే చెవి కోసుకునే యువత స్టార్టప్‌లను ప్రారంభించేందుకు చేయూత ఇస్తామని, తక్కువ వడ్డీకి లేదా వడ్డీ లేకుండా రుణాలు ఇచ్చేందుకు లక్ష కోట్ల రూపాయలతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఐదు ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే, మహిళల ఆరోగ్యంపై నిర్మల ప్రత్యేకంగా దృష్టి సారించారు. 9-14 ఏళ్ల బాలికలకు సర్వైకల్ క్యాన్సర్ టీకా వేసేందుకు ప్రత్యేక పథకాన్ని తీసుకొస్తామని ప్రకటించారు. మాతా శిశు సంక్షేమానికి పెద్దపీట వేస్తామని చెబుతూనే.. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అంగన్వాడీలు, ఆశాలకూ విస్తరించారు. మహిళలను లక్షాధికారుల (లాక్‌పతి దీదీ)ను చేసే పథకం కింద ఇప్పటికే కోటి మందిని లక్షాధికారులను చేశామని, రాబోయే ఐదేళ్లలో మరో తొమ్మిది కోట్ల మందిని చేయడమే తమ లక్ష్యమని వెల్లడించారు. అన్ని జిల్లాల్లోనూ ప్రభుత్వ ఆస్పత్రులను నిర్మిస్తామని, మరిన్ని మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఉపాధి హామీ పథకం కేటాయింపులను 43 శాతం పెంచి 86 వేల కోట్లు చేశారు. ఎప్పట్లాగే రక్షణ బడ్జెట్‌కు పెద్దపీట వేశారు. గత బడ్జెట్‌తో పోలిస్తే 4 శాతం పెంచి రూ.6.2 లక్షల కోట్లు కేటాయించారు. ఇక, ప్రత్యక్ష, పరోక్ష పన్నులు సహా దిగుమతి సుంకాల్లో ఎటువంటి మార్పులు చేయలేదు. అయితే, స్టార్టప్స్‌కు ఇచ్చే కొన్ని రాయితీలు, సావరిన్ వెల్త్ బాండ్స్, పింఛను నిధుల్లో పెట్టే పెట్టుబడులకు ఇచ్చే రాయితీలు తదితరాలు వచ్చే ఏడాది మార్చి 31 వరకూ కొనసాగుతాయని తెలిపారు. ఏళ్ల తరబడి పేరుకుపోయిన 10 వేలు; 25 వేలలోపు వివాదాస్పద ఐటీ పన్ను డిమాండ్లను రద్దు చేశారు. తద్వారా, కోటి మందికి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. విద్యుత్తు వాహన వ్యవస్థను బలోపేతం చేస్తామని చెప్పిన నిర్మల.. అందుకు సంబంధించి నిర్దిష్ట కార్యాచరణను మాత్రం బడ్జెట్లో ప్రకటించలేదు. సరికదా.. ఫేమ్ పథకం బడ్జెట్‌నూ 44 శాతం కోత కోశారు.

మూలధన వ్యయానికి పెద్దపీట

ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ద్రవ్యలోటును అదుపులో ఉంచడమే తమ ముందు ఉన్న ప్రధాన లక్ష్యమని పునరుద్ఘాటించిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. బడ్జెట్లో ఆ దిశగానే అడుగులు వేశారు. ఇందులో భాగంగా మూలధన వ్యయం పెంపునకు పెద్దపీట వేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి మూలధన వ్యయాన్ని భారీగా 11.1 శాతం పెంచి రూ.11,11,111 కోట్లు కేటాయించనున్నట్లు ప్రకటించారు. తద్వారా, ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పన పుంజుకుంటాయని సంకేతాలు ఇచ్చారు. అయితే, గత ఏడాది రూ.10 లక్షల కోట్లు మూలధన వ్యయం కింద ఖర్చు చేస్తామని చెప్పినా.. రూ.9.5 లక్షల కోట్లకే పరిమితం కావడం గమనార్హం. రాష్ట్రాలకు కూడా మూలధన వ్యయం పెంచేందుకు ఈ ఏడాది రూ.1.3 లక్షల కోట్ల మేరకు వడ్డీ లేని రుణం కల్పిస్తామని, వికసిత్ భారత్ యాత్రలో భాగంగా సంస్కరణల అమలుకు రాబోయే 50 ఏళ్లలో మరో రూ.75 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను రాష్ట్రాలకు అందిస్తామని వెల్లడించారు. ఆర్థిక కార్యకలాపాల్లో బలమైన వృద్ధి కారణంగా రెవెన్యూ వసూళ్లు పెరిగాయని, గత ఏడాది డిసెంబరుకు జీఎస్టీ వసూళ్లు రూ.1.65 లక్షల కోట్లు ఉన్నాయని వివరించారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో రూ.47.77 లక్షల కోట్ల మేరకు ఆదాయం లభిస్తుందని, ఇందులో కేవలం పన్ను రాబడులే రూ.26.99 లక్షల కోట్లు ఉంటాయని అంచనా వేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇవి రూ.30 లక్షల కోట్లు ఉంటాయని తెలిపారు. ఫలితంగా, సంక్షేమ పథకాలకు వ్యయాన్ని కూడా పెంచామని వివరించారు. గత పదేళ్లలో తీసుకున్న నిర్ణయాలతో దేశ ఆర్థిక వ్యవస్థ ఎంతో పురోగతి చెందిందని గణాంక వివరాలతో సహా వివరించారు. 2023-24కు సవరించిన ఆర్థిక లోటు జీడీపీలో 5.8 శాతానికి చేరుకుందని చెప్పిన నిర్మల.. ఇది ఆర్థిక పటిష్ఠత దిశలో మోదీ ప్రభుత్వం చేపట్టిన చర్యలకు నిదర్శనమని తెలిపారు. వచ్చే ఏడాది కూడా ఆర్థిక లోటును తగ్గించి జీడీపీలో 5.1 శాతానికే పరిమితం చేస్తామని చెప్పారు. మార్కెట్ రుణాలు గత ఏడాది కంటే తక్కువగా ఉంటాయని, వీటిని మరింత తగ్గిస్తామని అంటూనే.. నికర మార్కెట్ రుణాలు రూ.11.75 లక్షల కోట్లు ఉండవచ్చునని తెలిపారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు సంబంధించి ఇది స్వర్ణయుగమని, 2005-14తో పోలిస్తే 2014-23లో రెట్టింపు ఎఫ్‌డీఐలు లభించాయని, ఈ ఐదేళ్లలోనే 596 బిలియన్ డాలర్ల (రూ.4,172 వేల కోట్లు) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు దేశానికి వచ్చాయని వివరించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో వాస్తవ జీడీపీ 7.3 శాతం ఉంటుందని అంచనా వేశారు. 2027 నాటికి భారత్ ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ఐఎంఎఫ్ సహా పలు అంతర్జాతీయ సంస్థలు అంచనా వేశాయని చెప్పారు.



మొత్తం బడ్జెట్

47,65,768 (రూ. కోట్లలో)



ఉన్నత విద్యకు 9,624 కోట్లు కోత..!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ఈ ఏడాది బడ్జెట్‌లో ఉన్నత విద్యకు కేటాయించే నిధులను కేంద్రం రూ.9,624 కోట్ల మేర భారీగా కోత విధించింది. గతేడాది సవరించిన అంచనా రూ.57,244.48 కోట్లు ఉండగా.. ఈ సంవత్సరం దాన్ని రూ.47,619.77 కోట్లకు కోసేసింది. గతేడాది యూజీసీకి రూ.6,409 కోట్లు కేటాయించగా.. ఈ సంవత్సరం రూ.2,500 కోట్లకు పరిమితం చేసింది. ఐఐఎంకు ఈ ఏడాది సవరించిన అంచనా రూ.331 కోట్లుగా ఉన్నదాన్ని రూ.212.21 కోట్లకు తగ్గించింది. అగ్రశ్రేణి సాంకేతిక సంస్థలకిచ్చే గ్రాంట్‌ను కూడా కేంద్రం రూ.10,384.21 కోట్ల నుంచి రూ.10,324.50 కోట్లకు తగ్గించింది. అయితే సెంట్రల్ యూనివర్సిటీలకు ఇచ్చే మద్దతు గ్రాంట్ బడ్జెట్‌ను రూ.12 వేల కోట్ల నుంచి రూ.15,472 కోట్లకు పెంచింది. పాఠశాల విద్యకు గతేడాది రూ.72,473.8 కోట్లు అందించగా.. ఈ సంవత్సరం దాన్ని రూ.73,008.1 కోట్లకు పెంచింది.



మధ్య తరగతి సొంతింటి కల సాకారం!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశంలో మధ్యతరగతి వర్గాలు కోరుకునే సొంతింటి కలను సాకారం చేసేందుకు కృత నిశ్చయంతో ఉన్నామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. మధ్యతరగతి వర్గం కోసమే ప్రత్యేకంగా కొత్త హౌసింగ్ పథకాన్ని తెస్తామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఇది పూర్తిగా అద్దె ఇళ్లలో ఉండేవారు, బస్తీల్లో నివసించేవారు, అనధికార కాలనీల్లో ఉండే మధ్యతరగతి ప్రజలను లక్ష్యంగా చేసుకుని అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కొత్త పథకం దేశంలోని కోట్లాది మంది మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేస్తుందని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ(పీఎంఏవైజీ) పథకం మరో ఐదేళ్లపాటు కొనసాగుతుందని తెలిపారు. ఈ పథకం కింద వచ్చే ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వనున్నట్లు తెలిపారు. మొత్తం 2 కోట్ల కుటుంబాలకు సొంత ఇళ్లు కల్పించాలన్న లక్ష్యంతో ఈ పథకాన్ని కొనసాగిస్తున్నట్లు వివరించారు.



గరీబ్ కల్యాణ్ అన్న యోజన **2,05,250**



ఉపాధి హామీ పథకం **86,000**

ప్రధానమంత్రి ఆవాస్ యోజన **80,671**



జల్ జీవన్ మిషన్ **70,163**

కిసాన్ సమ్మాన్ నిధి **60,000**



జాతీయ ఆరోగ్యమిషన్ **38,183**

సమగ్ర శిక్ష **37,500**





అంగన్‌వాడీ కేంద్రాలకు **21,200**

గ్రామ సడక్ యోజన **19,000**





జీవనోపాధి మిషన్ **15,047**


పంటల భీమా పథకం **14,600**





ప్రధాన మంత్రి పోషణ్ శక్తి **12,467**

స్వచ్ఛ భారత్ **12,192**



అమృత్, స్మార్ట్ సిటీస్ **10,400**

ఆయుష్మాన్ భారత్ **7,500**





నదుల అనుసంధానం **3,500**



వ్యవసాయ శాఖకు 1.27 లక్షల కోట్లు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: బడ్జెట్‌లో వ్యవసాయ శాఖకు కేంద్రం రూ. 1,27,469.88 కోట్లు కేంద్రం కేటాయించింది. ఇందులో వ్యవసాయ విభాగానికి రూ.1,17,528.79 కోట్లు, అగ్రికల్చర్ రీసెర్చ్ అడ్ ఎడ్యుకేషన్‌కు (డేర్)కు 9,941.09 కోట్లు కేటాయించింది. వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహిస్తామని పేర్కొంది. ఎరువుల పరంగా కీలక అంశాన్ని బడ్జెట్‌లో ప్రస్తావించారు. ఇప్పటికే వివిధ రకాల పంటల కోసం 'నానో యూరియా'ను ప్రవేశపెట్టిన మాదిరిగానే తాజాగా 'నానో డీఏపీ'ని అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది. నానో యూరియా విజయవంతమైన నేపథ్యంలో దేశవ్యాప్తంగా అన్ని ఆగ్రో-క్లైమేటిక్ జోన్లకు 'నానో డీఏపీ'ని విస్తరిస్తామని పేర్కొంది. రసాయనాలు-ఎరువుల శాఖకు రూ.1.68 లక్షల కోట్లను కేటాయించింది. అయితే శాఖలోని ఎరువుల విభాగానికి గత ఆర్థిక సంవత్సరంలో 1,88,947.81 కోట్లు కేటాయిస్తే దాన్ని ఈసారి రూ.1,64,150.81 కోట్లకు కుదించడం గమనార్హం. కాగా ప్రతిష్ఠాత్మకంగా అమలవుతున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకానికి నిధులు పెంచలేదు. గత బడ్జెట్‌లో మాదిరిగానే ఈ పథకానికి రూ.60వేల కోట్లను కేటాయించారు. ద్వారా దేశవ్యాప్తంగా 11.8 కోట్ల మంది రైతులు లబ్ధి పొందుతున్నట్లు కేంద్రం వెల్లడించింది. 2022లో ప్రకటించిన 'ఆత్మనిర్భర్ ఆయిల్ అభియాన్'లో భాగంగా ఆవ, వేరుశనగ, నువ్వులు, సోయాబీన్, పొద్దుతిరుగుడు గింజల సాగులో అధిక దిగుబడుల కోసం విత్తన రకాలపై పరిశోధనలను ప్రోత్సహిస్తామని పేర్కొంది. నూనెగింజల సాగులో ఆధునిక సాగు పద్ధతులు, మార్కెట్ల అనుసంధానం, పంటల భీమా వంటి అంశాలపై దృష్టిసారిస్తామని వెల్లడించింది. పాడి రైతులను ఆదుకునే చర్యలు చేపడతామని కేంద్రం పేర్కొంది. పశుసంవర్ధక-డెయిరీ శాఖకు రూ.7,105.74 కోట్లు కేటాయించింది.

కొత్తగా 5 ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కులు!

55 లక్షల మందికి ఉపాధి అవకాశాలే లక్ష్యం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ఆక్వా పరిశ్రమకు మద్దతుగా అత్యాధునిక, ఇంటిగ్రేటెడ్ సదుపాయాలను కల్పించడం ద్వారా మత్స్యరంగం అభివృద్ధికి, ఆ రంగంలో భాగస్వాములైన అందరికీ అవకాశాలను పెంపొందించడానికి దేశంలో కొత్తగా ఐదు ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కులను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. వీటి ద్వారా కొత్తగా 55 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని ప్రకటించింది. ఆక్వా ఎగుమతులను రెట్టింపు చేయడం(లక్ష కోట్ల రూపాయలకు పెంచడం) దీని లక్ష్యం. అలాగే, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్‌వై) ద్వారా ఆక్వా ఉత్పత్తిని హెక్టారుకు 2 టన్నులు చొప్పున పెంచనున్నారు. దేశంలో ప్రస్తుతం హెక్టారుకు 3 టన్నులు చొప్పున ఆక్వా ఉత్పత్తి జరుగుతుండగా, దీనిని 5 టన్నులకు పెంచడం లక్ష్యం. ఆక్వా రంగం ఐదేళ్లలో సమగ్రాభివృద్ధి సాధించాలనే ఉద్దేశ్యంతో రూ.20,050 కోట్ల అంచనా పెట్టుబడులతో 2021 సంవత్సరంలో పీఎంఎంఎస్‌వై పథకాన్ని ప్రవేశపెట్టారు.

సబ్సిడీలకు 3.81 లక్షల కోట్లు

కేంద్రం సబ్సిడీలకు రూ.3,80,925 కోట్లు కేటాయించింది. ఇది గతేడాది కంటే 8 శాతం తక్కువ. సవరించిన అంచనాల ప్రకారం ఆహార సబ్సిడీకి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2,12,322 కోట్లు వెచ్చించగా... ఇప్పుడు రూ.2,05,250 కోట్లు కేటాయించింది. ఇక ఎరువుల సబ్సిడీకి ప్రస్తుత బడ్జెట్‌లో రూ.1.64 లక్షల కోట్లు కేటాయించారు. గతేడాది కేటాయింపులు రూ.2.51 లక్షల కోట్లు. పెట్రోలియం ఉత్పత్తుల సబ్సిడీకి బడ్జెట్‌లో రూ.11,925 కోట్లు కేటాయించారు.

ప్రజా పంపిణీ **2,13,323**





ఆరోగ్యం **90,659**

పట్టణ వ్యవహారాలు **77,523**





జల శక్తి **98,419**

మైనార్టీ వ్యవహారాలు **3,183**





పంచాయతీరాజ్ **1,184**

రైల్వేశాఖ **2,55,393**





మహిళ,శిశు సంక్షేమం **26,092**

రూ.11.11 లక్షల కోట్లు

2024-25 ఆర్థిక సంవత్సరానికి మూలధన వ్యయ కేటాయింపులివి..

ఆర్‌బీఐ, పీఎస్‌బీల నుంచి డివిడెండ్ ఆదాయం రూ.1.02 లక్షల కోట్లు

2023-24లో రూ.1.04 లక్షల కోట్లు

వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఆర్‌బీఐ, ప్రభుత్వ రంగ బ్యాంక్ (పీఎస్‌బీ)ల నుంచి డివిడెండ్ల రూపంలో రూ.1.02 లక్షల కోట్ల ఆదాయం సమకూరవచ్చని ప్రభుత్వం అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో డివిడెండ్ రాబడి రూ.1.04 లక్షల కోట్లకు చేరుకోవచ్చని భావిస్తోంది. 2023-24 బడ్జెట్ అంచనా రూ.48,000 కోట్లతో పోలిస్తే రెండింతలకు పైగా అధికమిది. గత ఏడాది మేలో ఆర్‌బీఐ ప్రభుత్వానికి ఏకంగా రూ.87,416 కోట్ల డివిడెండ్ చెల్లించడం ఇందుకు దోహదపడింది. గత ఆర్థిక సంవత్సరం (2022-23)లో ఆర్‌బీఐ, పీఎస్‌బీల నుంచి డివిడెండ్ల రూపంలో కేంద్రానికి కేవలం రూ.39,961 కోట్లే సమకూరాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల (సీపీఎస్‌ఈ)ల నుంచి రూ.43,000 కోట్ల డివిడెండ్ చెల్లింపులను అంచనా వేయగా.. రూ.50,000 కోట్ల వరకు సమకూరనున్నాయి. దాంతో 2023-24లో ఆర్‌బీఐ, పీఎస్‌బీలు, సీపీఎస్‌ఈల నుంచి డివిడెండ్ ఆదాయం రూ.1,54,407 కోట్లకు చేరుకునే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది.

సీపీఎస్‌ఈల డివిడెండ్‌తో కలిపి వచ్చే ఆర్థిక సంవత్సరంలో మొత్తం రాబడి రూ.1.50 లక్షల కోట్ల కోట్లకు చేరుకోవచ్చని బడ్జెట్‌లో అంచనా వేసింది. పన్ను వసూళ్లు గణనీయంగా పెరగడంతోపాటు డివిడెండ్ ఆదాయంలో భారీ వృద్ధి కేంద్ర ద్రవ్యలోటు లక్ష్యాలను చేరుకునేందుకు దోహదడనుంది.

- జీడీపీలో 3.4 శాతానికి సమానం
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 11.1 శాతం అధికం
- వరుసగా నాలుగోసారి పెంపు



న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25)లో మౌలికాభివృద్ధి అవసరాల కోసం మూలధన వ్యయాలను రూ.11.11 లక్షల కోట్లకు పెంచుతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరాని (2023-24)కి ప్రతిపాదించిన రూ.10 లక్షల కోట్లతో పోలిస్తే కేటాయింపులు 11.1 శాతం పెరిగాయి. అయితే, ఈసారి మూలధన పెట్టుబడులు రూ.9.5 లక్షల కోట్లకే పరిమితం కావచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం మూలధన పెట్టుబడులను గణనీయంగా పెంచడం ఇది నాలుగోసారి. 2022-23 తో పోలిస్తే, ఈ ఆర్థిక సంవత్సరంలో మూలధన వ్యయాన్ని ప్రభుత్వం ఏకంగా 37.5 శాతం పెంచింది. కొవిడ్ సంక్షోభం దెబ్బకు ప్రైవేట్ రంగ పెట్టుబడులు మందగించడంతో కేంద్రం అంతక్రితం రెండు ఆర్థిక సంవత్సరాల్లోనూ మూలధన పెట్టుబడుల కేటాయింపులను 35 శాతం చొప్పున పెంచుతూ వచ్చింది. "ఆర్థిక వ్యవస్థ మళ్లీ జోరందుకోవడంతో ఈ మధ్య కాలంలో స్టీల్, సిమెంట్, పెట్రోలియం వంటి రంగాల్లో ప్రైవేట్ రంగ పెట్టుబడులు పుంజుకున్నాయి. గత నాలుగేళ్లలో మూలధన వ్యయాలను మూడింతలు చేయడంతో ఆర్థిక వృద్ధిని పెంచడంతోపాటు భారీగా ఉద్యోగాలూ కల్పించగలిగాం. వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను మూలధన పెట్టుబడులను 11.1 శాతం వృద్ధితో రూ.11,11,111 కోట్లకు పెంచుతున్నాం. ఇది జీడీపీలో 3.4 శాతానికి సమానమ"ని గురువారం బడ్జెట్ ప్రసంగంలో సీతారామన్ తెలిపారు. కొవిడ్ సంక్షోభంతో కుదేలైన ఆర్థిక వ్యవస్థకు పునరుజ్జీవం పోసేందుకు కేంద్ర ప్రభుత్వం మూలధన పెట్టుబడులపై ప్రత్యేక దృష్టిసారించింది. దాంతో గత మూడేళ్లలో భారత్ 7 శాతానికి పైగా జీడీపీ వృద్ధిని నమోదు చేయగలిగింది. ప్రపంచంలోని పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో అత్యధిక వృద్ధి రేటును నమోదు చేసుకున్న దేశంగా నిలిచింది.

మూలధన పెట్టుబడి కేటాయింపులు

ఆర్థిక సంవత్సరం	రూ.లక్షల కోట్లు	కేటాయింపుల్లో వృద్ధి (%)
2020-21	4.39	---
2021-22	5.54	35
2022-23	7.50	35
2023-24	10.0	37.4
2024-25	11.11	11.1

ఎఫ్‌డీఐలకు బూస్ట్!

భారత్‌లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను మరింత పెంచేందుకు యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) సహా పలు దేశాలతో ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందాల కోసం చర్చలు జరుపుతున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. 2014-23 మధ్య కాలంలో దేశంలోకి 59,600 కోట్ల డాలర్ల (రూ.49 లక్షల కోట్ల పైమాటే) ఎఫ్‌డీఐలు తరలి వచ్చాయన్నారు. 2005-14 మధ్య కాలంతో పోలిస్తే గత పదేళ్లలో ఎఫ్‌డీఐలు రెండింతలయ్యాయని అన్నారు.

డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం రూ.50,000 కోట్లు

2023-24 టార్గెట్ రూ.30,000 కోట్లకు తగ్గింపు

వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25)లో ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ (డిజిన్వెస్ట్‌మెంట్) ద్వారా రూ.50,000 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకోవాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2023-24) డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాన్ని తొలుత నిర్దేశించుకున్న రూ.51,000 కోట్ల నుంచి రూ.30,000 కోట్లకు కుదించుకుంది. లోక్‌సభలో ప్రవేశపెట్టిన 'మధ్యంతర బడ్జెట్ 2024-25' పత్రాల ప్రకారం.. ప్రభుత్వ ఆస్తుల విక్రయం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో ఎలాంటి ఆదాయం సమకూరే అవకాశం లేదని సర్కారు భావిస్తోంది. గత బడ్జెట్ (2023-24)లో మాత్రం ప్రభుత్వ ఆస్తుల విక్రయం ద్వారా రూ.10,000 కోట్ల వరకు సమీకరించాలని లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు కేంద్రం కోల్ ఇండియా, ఎన్‌హెచ్‌పీసీ, ఆర్‌వీఎన్‌ఎల్, ఐఆర్‌ఈడీఏ సహా 7 ప్రభుత్వ రంగ సంస్థల్లో మైనారిటీ వాటాల విక్రయం ద్వారా రూ.12,504 కోట్లు సమీకరించగలిగింది. ఈ మార్చి చివరినాటికల్లా డిజిన్వెస్ట్‌మెంట్ ఆదాయాన్ని రూ.30 వేల కోట్లకు పెంచుకోవాలనుకుంటోంది. గత కొన్ని ఆర్థిక సంవత్సరాలుగా ప్రభుత్వం డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాలను చేరుకోలేకపోతోంది. 2018-19, 2017-18 ఆర్థిక సంవత్సరాల్లో మాత్రం టార్గెట్‌ను మించి ఆదాయం సమకూర్చుకోగలిగింది. 2017-18లో రూ.లక్ష కోట్ల బడ్జెట్ లక్ష్యానికి గాను రూ.1,00,056 కోట్లు సేకరించింది. 2018-19లో రూ.80,000 కోట్ల లక్ష్యానికి అదనంగా రూ.4,972 కోట్లు (మొత్తం రూ.84,972 కోట్లు) సమీకరించింది.

మార్కెట్ పెదవి విరుపు



సెన్సెక్స్ 107 పాయింట్లు డౌన్

ముంబై: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రకటించిన తాత్కాలిక బడ్జెట్ ఈక్విటీ మార్కెట్‌ను అంతగా ఆకట్టుకోలేకపోయింది. ఎలాంటి భారీ ప్రకటనలు లేకుండా బడ్జెట్ ప్రసంగం చప్పగా సాగిపోయిన నేపథ్యంలో యంత్ర పరికరాలు, మెటల్, రియల్టీ షేర్లలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకారణకు దిగడం మార్కెట్‌ను కుంగదీసింది. ఆర్థిక మంత్రి ప్రసంగం సాగుతున్నంత సేపూ భారీగా ఊగిసలాడిన ఈక్విటీ సూచీలు చివరికి నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 71,574.89-72,151.02 పాయింట్ల మధ్యన కదలాడి చివరికి 106.81 పాయింట్ల నష్టంతో 71,645.30 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 28.25 పాయింట్ల నష్టంతో 21,697.45 వద్ద క్లోజైంది. మార్చిలో కూడా వడ్డీ రేట్ల కోత ఉండదని అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ఇచ్చిన సంకేతాలు కూడా మార్కెట్‌ను నీరసపరిచాయి.

ఈ రంగాల షేర్లదే హవా

ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రతిపాదనలతో గ్రీన్ ఎనర్జీ, గృహ నిర్మాణం, విద్యుత్ వాహన విభాగ షేర్లు లాభాల బాటలో సాగగా రైల్వే విభాగాల షేర్లు మాత్రం నష్టపోయాయి.

ఇంధన షేర్లు: సోలార్ సొల్యూషన్లు అందించే కేపీఐ గ్రీన్ ఎనర్జీ షేర్లు 9.48 శాతం లాభంతో రూ.1,996.65 వద్ద ముగిశాయి. ఇంట్రాడేలో ఈ షేరు 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.2,006.15ని తాకింది. వెబ్‌సోల్ ఎనర్జీ సిస్టమ్స్ షేరు 4.99 శాతం పెరిగి ఏడాది గరిష్ఠ స్థాయి రూ.388.15ని తాకింది. స్టెర్లింగ్ అండ్ విల్సన్ రెన్యువబుల్ ఎనర్జీ షేర్లు 1.07 శాతం లాభపడి రూ.572.45 వద్ద ముగిశాయి.

గృహనిర్మాణ రంగం: ప్రభుత్వ రంగంలోని హడ్కో షేరు ఎన్ఎస్ఈలో 19.99 శాతం లాభపడి 52 వారాల గరిష్ఠ స్థాయి, ఎగువ సర్క్యూట్ లిమిట్ రూ.206.80 వద్ద ముగిసింది. బీఎస్ఈలో 19.62 శాతం లాభంతో రూ.206.30 వద్ద ముగిసింది. ఎన్‌బీసీసీ షేరు కూడా ఎన్ఎస్ఈలో 12.01 శాతం వృద్ధితో 52 వారాల గరిష్ఠం రూ.145 వద్ద ముగిసింది. బీఎస్ఈలో 9.78 శాతం లాభపడి రూ.142.05 వద్ద ముగిసింది.

విద్యుత్ వాహనాలు: ఈ రంగంలో అగ్రగామి అయిన ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ షేరు ఇంట్రాడేలో 6.21 శాతం పెరిగి 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.1,849.25ని తాకినా లాభాల స్వీకారంతో 0.69 శాతం నష్టపోయి రూ.1,729 వద్ద ముగిసింది. జేబీఎం ఆటో 4.96 శాతం లాభంతో ఏడాది గరిష్ఠ స్థాయి రూ.2,010.80ని తాకి చివరికి 2.48 శాతం లాభంతో రూ.1,963.20 వద్ద ముగిసింది. గ్రీవ్స్ కాటన్ షేరు 0.95 శాతం లాభంతో రూ.165.05 వద్ద క్లోజైంది.

రైల్వే కంపెనీల షేర్లు డౌన్: పై రంగాల షేర్లకు భిన్నంగా రైల్వే షేర్లు మాత్రం నష్టపోయాయి. ఇర్కాన్ ఇంటర్నేషనల్ షేరు 3.69 శాతం, రైల్ వికాస్ నిగమ్ షేరు 3.49 శాతం, ఐఆర్ఎఫ్‌సీ షేరు 2.85 శాతం, జుపిటర్ వ్యాగన్స్ షేరు 1.92 శాతం, ఐఆర్‌సీటీసీ షేరు 1.57 శాతం, టెక్స్‌మాకో రైల్ అండ్ ఇంజనీరింగ్ షేరు 0.82 శాతం, టిటాఘర్ రైల్ సిస్టమ్స్ షేరు 0.55 శాతం నష్టపోయాయి.

'ఆర్థిక' బలోపేతమే లక్ష్యం

- ప్రజాకర్షక పథకాలకు స్వస్తి
- ద్రవ్య లోటు కట్టడికే ప్రాధాన్యత
- 5.1 శాతానికి తగ్గనున్న ద్రవ్య లోటు

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్‌లోనూ ఆర్థిక స్థిరత్వానికి ప్రాధాన్యత ఇచ్చారు. ప్రజాకర్షక పథకాల జోలికి పోకుండా ద్రవ్య లోటును కట్టడి చేయడంపై దృష్టి పెట్టారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) జీడీపీలో 5.9 శాతంగా ఉంటుందని భావించిన ద్రవ్య లోటును 5.8 శాతం (సుమారు రూ.17,34,773 కోట్లు) వద్దే కట్టడి చేస్తామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25) దీన్ని మరింత కుదించి జీడీపీలో 5.1 శాతం (సుమారు రూ.16,85,496 కోట్లు) మించకుండా చూస్తామని ప్రకటించారు. 2026 మార్చి నాటికి ద్రవ్య లోటు జీడీపీలో 4.5 శాతం మించకుండా చూడడం తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మార్కెట్ ధరల ప్రకారం చూస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 10.5 శాతం పెరిగి రూ.327.71 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నట్టు తెలిపారు.

పదేళ్లలో ఎంతో ఎదిగాం

ప్రధాని మోదీ నాయకత్వంలో గత పదేళ్లలో ఆర్థికంగా భారత్ ఎంతో ఎదిగిందని సీతారామన్ తెలిపారు. సంస్థాగత సంస్కరణలు, ప్రజానుకూల పథకాలు, ఉపాధి అవకాశాల పెంపుతో మన ఆర్థిక వ్యవస్థకు కొత్త జవసత్వాలు వచ్చాయన్నారు. 2020-21 ఆర్థిక సంవత్సరం కొవిడ్‌తో 5.8 శాతం క్షీణించిన జీడీపీ, ఆ మరుసటి సంవత్సరమే 9.1 శాతం పెరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం 3.7 లక్షల కోట్ల డాలర్ల స్థాయిలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ మరో మూడేళ్లలో ఐదు లక్షల కోట్ల డాలర్లకు చేరి ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగబోతోందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ మన జీడీపీ ఏడు శాతంపైనే పెరుగుతుందని తెలిపారు.

ధరల 'సెగ' తగ్గింది

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో భగ్గుమన్న ధరల సెగ ప్రస్తుతం తగ్గుముఖం పట్టిందని ఆర్థిక మంత్రి తెలిపారు. ఆ యుద్ధం పర్యవసానంగా 8 శాతానికి పైగా పెరిగిన రిటైల్ ద్రవ్యోల్బణం 2023 డిసెంబరులో 5.69 శాతానికి తగ్గిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం, ఆర్‌బీఐ తీసుకున్న సానుకూల చర్యలు ఇందుకు ప్రధాన కారణమన్నారు. ప్రస్తుతం మన దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం పెద్దగా ఆందోళన చెందాల్సిన స్థాయిలో లేదన్నారు.

'టెల్కో'ల నుంచి రూ.1.2 లక్షల కోట్లు

స్పెక్ట్రమ్, లైసెన్స్ ఫీజుల రూపంలో వచ్చే ఆర్థిక సంవత్సరం దేశీయ టెలికాం కంపెనీల నుంచి రూ.1.2 లక్షల కోట్లు అందే అవకాశం ఉందని ఆర్థిక మంత్రి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి అంచనా వేస్తున్న రూ.93,541.01 కోట్ల కంటే ఇది ఎక్కువ.



మహీంద్రా ఎక్స్‌యూవీ 400 ప్రో

హైదరాబాద్: ఎస్‌యూవీల తయారీలో అగ్రగామి అయిన మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) తన ఎక్స్‌యూవీల శ్రేణిలో ఎక్స్‌యూవీ 400 కొత్త వేరియెంట్లను మార్కెట్లోకి తెచ్చింది. ఎక్స్‌యూవీ ప్రో శ్రేణిలోని ఈ విద్యుత్ కార్ల ధర రూ.15.49 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. వీటిలో ఈసీ ప్రో (34.5 కిలోవాట్ల బ్యాటరీ, 33 కేడబ్ల్యూ ఏసీ చార్జర్), ఈఎల్ ప్రో (34.5 కిలోవాట్ల బ్యాటరీ, 3.3 కేడబ్ల్యూహెచ్ ఏసీ చార్జర్), ఈఎల్ ప్రో (39.4 కిలోవాట్ల బ్యాటరీ, 7.2 కేడబ్ల్యూహెచ్ చార్జర్) వేరియెంట్లు అందుబాటులో ఉంటాయి. ఈ కార్లన్నీ డ్యుయెల్ టోన్ ఇంటీరియర్లు, 26.04 సెంటీమీటర్ల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ 26.04 సెంటీమీటర్ల ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ వంటి అత్యాధునిక కనెక్టివిటీ ఫీచర్లుంటాయి. ఈ కార్లు కేవలం 8.3 సెకండ్లలో 0-100 కిలోమీటర్ల వేగం అందుకుంటాయని, గరిష్ఠంగా గంటకి 150 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయని కంపెనీ రీజినల్ సేల్స్ మేనేజర్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) అభిషేక్ నాయర్ చెప్పారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,440 ▲	58,150 ▲	77,800 ▼
ముంబై	62,599 ▼	57,341 ▼	70,834 ▼



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

ఫిబ్రవరి 1		విజయవాడ	525
హైదరాబాద్	520	విశాఖపట్నం	545
ఫిబ్రవరి 2		వరంగల్	522
చిత్తూరు	573	దజను గుడ్లు రూ.72	
గోదావరి	525		



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	99	గోదావరి	108
వరంగల్	99	విజయవాడ	108
కరీంనగర్	99	గుంటూరు	109
మహబూబ్‌నగర్	99	ఒంగోలు	109
కర్నూలు	99	చిత్తూరు	110
విశాఖపట్నం	110		

అకోలైట్-బోంటియస్ విలీనం

హైదరాబాద్: డిజిటల్ సేవల రంగంలో ఉన్న రెండు ప్రముఖ అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థలు 'అకోలైట్ డిజిటల్, బోంటియస్' విలీనమయ్యాయి. ఇందులో అకోలైట్ డిజిటల్ కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా అనేక సంస్థలకు డిజిటల్ ఇంజనీరింగ్, క్లౌడ్ డేటా, కృత్రిమ మేధ (ఏఐ) సేవలు అందిస్తోంది. బోంటియస్ అనేక ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్లకు డిజిటల్ ఇన్నోవేషన్ భాగస్వామిగా ఉంది. అంతర్జాతీయంగా ఉన్న ఖాతాదారులకు అత్యుత్తమ సేవలందించే ఉద్దేశంతో ఇరు కంపెనీలు విలీనమయ్యాయని అకోలైట్ డిజిటల్ వ్యవస్థాపకుడు, సీఈఓ లీల కాజ, బోంటియస్ కో-ఫౌండర్, సీఈఓ కీత్ స్వాట్జ్ తెలిపారు. కాగా ఇరు కంపెనీల విలీనంతో మరిన్ని వ్యాపార అవకాశాలు ఏర్పడతాయని ఈ రెండు కంపెనీలకు నిధులు సమకూర్చిన న్యూయార్క్‌కు చెందిన ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థ న్యూ మౌంటైన్ క్యాపిటల్ ఎండీ ప్రసాద్ చింతమనేని తెలిపారు. విలీనంతో ఏర్పడిన కంపెనీకి కీత్ స్వాట్జ్ సీఈఓగా, లీల కాజ కో సీఈఓగా వ్యవహరిస్తారు. షికాగో కేంద్రంగా పని చేసే ఈ కొత్త కంపెనీ ఉత్తర అమెరికా, ఐరోపా, ఆసియా దేశాల్లోని 5,000 మంది ఉద్యోగులతో కార్యకలాపాలు సాగించనుంది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్, బీమా, కన్స్యూమర్ గూడ్స్, రిటైల్, హెల్త్ కేర్, లాజిస్టిక్, టెలీకమ్యూనికేషన్స్ రంగాల్లోని ఖాతాదారులకు విలీన సంస్థ వినూత్న డిజిటల్ సేవలు అందించనుంది.

నేటి మ్యాచ్‌లు

భారత్ x నేపాల్
(అండర్-19 వరల్డ్‌కప్ సూపర్ సిక్స్ పోరు)
మ.1.30 నుంచి (స్టార్‌స్పోర్ట్స్, హాట్‌స్టార్)

ఆస్ట్రేలియా x వెస్టిండీస్ (మెల్‌బోర్న్)
తొలి వన్డే- ఉ.9 గం.నుంచి (స్టార్‌స్పోర్ట్స్‌లో)

శ్రీలంక x అఫ్ఘానిస్థాన్-ఏకైక టెస్ట్ (కొలంబో)
ఉ.10 గం.నుంచి (ఫ్యాన్‌కోడ్‌లో)

ఆంధ్ర x బిహార్ (పట్నా)-రంజీ (ఎలిట్)-ఉ.9 గం

హైదరాబాద్ x మిజోరం (హైదరాబాద్)
రంజీ (ప్లేట్)-ఉ.9.30గం.

శ్రీకాంత్‌కు షాక్

క్వార్టర్స్‌లో గాయత్రి జోడీ

బ్యాంకాక్: వరల్డ్ మాజీ నెం.1 కిడాంబి శ్రీకాంత్ థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ రెండో రౌండ్‌లో కంగుతిన్నాడు. గురువారం జరిగిన రౌండ్-16 పోరులో మిథున్ మంజునాథ్ 21-19, 13-21, 21-17తో శ్రీకాంత్‌కు షాకిచ్చాడు. మరో మ్యాచ్‌లో శంకర్ ముత్తుసామి 9-21, 11-21తో చున్ యి లిన్ చేతిలో, మాళవికా బన్సోడ్ 22-24, 7-21తో బుసానన్ చేతిలో ఓడారు. మహిళల డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా జంట 21-15, 24-22తో తనీషా క్రాస్టో/అశ్వినీ పొన్నప్పపై గెలిచి క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది.

భారత్-ఎ తడ'బ్యాటు'

అహ్మదాబాద్: పేసర్లు మాథ్యూ పాట్స్ (6/57), కార్సీ (4/52) నిప్పులు చెరగడంతో.. భారత్-ఎతో గురువారం ఆరంభమైన మూడో అనధికార టెస్ట్‌లో ఇంగ్లండ్ లయన్స్ పైచేయి సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 192 రన్స్‌కే కుప్పకూలింది. అనక మొదటి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన లయన్స్ తొలి రోజు ఆట ఆఖరికి 98/1 స్కోరు చేసింది.



ద్రవిడ్‌తో జైస్వాల్

బజ్‌బాల్‌కు చెక్ పెట్టేనా?

ఒత్తిడిలో టీమిండియా

ఉదయం 9.30 గంటల నుంచి జియో సినిమాలో

నేటి నుంచి ఇంగ్లండ్‌తో రెండో టెస్టు

తుది జట్టుపై అందరి దృష్టి

విశాఖపట్నం (స్పోర్ట్స్): ఇంగ్లండ్ ప్రధాన అస్త్రమైన బజ్‌బాల్ వ్యూహాన్ని భారత్ ఈసారి ఎలా ఎదుర్కొనబోతోంది? అంతకంటే ముందు జడేజా, రాహుల్, కోహ్లీ లేని వేళ తమ తుది జట్టు కూర్పు ఎలా ఉండబోతోంది? ఇప్పుడందరినీ ఇవే సందేహాలు వెంటాడుతున్నాయి. శుక్రవారం విశాఖలో ఆరంభమయ్యే రెండో టెస్టు భారత జట్టుకు అత్యంత కీలకం కానుంది. ఎందుకంటే ఇప్పటికే తొలి టెస్టులో అనూహ్య ఓటమి జట్టును తీవ్ర ఒత్తిడిలోకి నెట్టేసింది. ఈ అవకాశం చేజారితే తిరిగి కోలుకోవడం కష్టమవుతుంది. ఉప్పల్ టెస్టులో మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కినా బ్యాటింగ్ వైఫల్యం కొంప ముంచింది. అందుకే తాజా టెస్టులో ఇంగ్లండ్‌ను కౌంటర్ చేయాలంటే తమ ఆటతీరు మార్చుకోవాల్సిందే. డిఫెన్సివ్ ఆటను కాకుండా ఎదురుదాడిని నమ్ముకుంటేనే బజ్‌బాల్‌కు చెక్ పెట్టవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మూడేళ్ల క్రితం ఇదే జట్టుపై మొదటి టెస్టు ఓడినా.. ఆ తర్వాత భారత్ వరుసగా 3 టెస్టులు నెగ్గింది.

ఆడేది ఎవరు?: జడేజా, రాహుల్ స్థానంలో జట్టులోకి సర్ఫరాజ్, రజత్ పటీదార్, సౌరభ్ కుమార్ వచ్చారు. ఇప్పుడు తుది జట్టులో వీరిలో ఎవరికి చోటు దక్కుతుందనేది ఆసక్తికరం. అలాగే జడ్డూ స్థానంలో స్పిన్నర్‌గా కుల్దీప్ ఆడే చాన్స్ ఉంది. ఇక నలుగురు స్పిన్నర్లతో వెళ్లాలనుకుంటే పేసర్ సిరాజ్‌ను పక్కనబెట్టి ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ వైపు మొగ్గు చూపుతారు. అశ్విన్, అక్షర్ ప్రత్యర్థి స్వీప్ షాట్లకు చెక్ పెట్టేలా బౌలింగ్ చేయాల్సి ఉంటుంది. బ్యాటింగ్ విభాగంలోనూ గిల్, శ్రేయా‌స్‌ల ఫామ్ ఆందోళనకరంగా ఉంది. ముఖ్యంగా గిల్ డిఫెన్సివ్ ఆటతో మరింతగా విఫలమవుతున్నాడు. అరంగేట్ర స్పిన్నర్ టామ్ హార్ట్‌లీని తట్టుకోవడంలో రోహిత్ మినహా అంతా విఫలమయ్యారు. స్వీప్ షాట్లు ఆడడంలో ఇంగ్లండ్ బ్యాటర్లకన్నా వెనుకబడ్డారు. అలాగే రాహుల్ స్థానంలో సర్ఫరాజ్ కన్నా రజత్ పటీదార్‌కు ఎక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయి. పిచ్‌ను బట్టి తుది జట్టుపై టీమ్ మేనేజ్‌మెంట్ ఓ అంచనాకు రావచ్చు.

అండర్సన్, బషీర్‌కు చోటు: ఇంగ్లండ్ జట్టు ఇప్పటికే తమ తుది జట్టును ప్రకటించింది. ఈ టెస్టును సైతం గెలిచి 2-0తో భారత్‌పై మరింత ఒత్తిడి పెంచేందుకు వారికిది సువర్ణావకాశం. మొదటి టెస్టులో కెప్టెన్ స్టోక్స్ తమ బౌలర్లను అద్భుతంగా వినియోగించుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్లు ధారాళంగా పరుగులు సాధించినా స్పిన్నర్ హార్ట్‌లీని కొనసాగించడం.. కీలక సమయాల్లో పార్ట్‌టైం స్పిన్నర్ జో రూట్‌ను బరిలోకి దించడం అతడి నాయకత్వ ప్రతిభను సూచించాయి. వెటరన్ స్పిన్నర్ జాక్ లీచ్ దూరం కావడంతో షోయబ్ బషీర్ అరంగేట్రం చేయనున్నాడు. అలాగే పేసర్ మార్క్ ఉడ్ స్థానంలో సీనియర్ బౌలర్ అండర్సన్‌ను ఏకైక పేసర్‌గా తీసుకున్నారు.

భారత్ (అంచనా)

రోహిత్ (కెప్టెన్), జైస్వాల్, గిల్, శ్రేయాస్, రజత్ పటీదార్, అక్షర్, భరత్, అశ్విన్, కుల్దీప్, బుమ్రా, సిరాజ్/సుందర్.

ఇంగ్లండ్ (తుది జట్టు): క్రాలే, డకెట్, పోప్, రూట్, బెయిర్‌స్టో, స్టోక్స్ (కెప్టెన్), ఫోక్స్, రెహాన్ అహ్మద్, టామ్ హార్ట్‌లీ, షోయబ్ బషీర్, అండర్సన్.

పిచ్, వాతావరణం

ఇక్కడ జరిగిన రెండు టెస్టుల్లో పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించింది. ఈసారి కూడా తొలి రెండు రోజులు పరుగులకు అవకాశం ఉంటుంది. ఆ తర్వాత స్పిన్నర్ల ఆధిపత్యం సాగవచ్చు. ఉష్ణోగ్రత 35 డిగ్రీలతో అధిక వేడి ఉండనుంది.

4

టెస్టుల్లో 500 వికెట్లను పూర్తి చేసేందుకు స్పిన్నర్ అశ్విన్‌కు మరో నాలుగు వికెట్లు చాలు. గతంలో భారత్ నుంచి కుంబ్లే (619) మాత్రమే 500 మార్క్ చేరాడు.



అండర్సన్
స్టోక్స్

పక్కా ప్లాన్‌తోనే ఆడతాం

'రెండో టెస్టులో ఇంగ్లండ్‌ను ఎదుర్కొనేందుకు మేం తగిన ప్రణాళికలతో బరిలోకి దిగబోతున్నాం. కీలక ఆటగాళ్లు గాయాలపాలైనా ఎలాంటి ఒత్తిడీ లేదు. మాకు స్వీప్ షాట్లు ఆడడం రాదని కాదు. కానీ పరిస్థితికి తగ్గట్టు బ్యాటర్లు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ టీమ్ డిమాండ్ చేస్తే కచ్చితంగా ఆడతాం. తొలి టెస్టులో ఓడిపోయినా డ్రెస్సింగ్ రూమ్‌లో పరిస్థితి ప్రశాంతంగానే ఉండింది. సుదీర్ఘ సిరీస్ కావడంతో భయపడాల్సిన అవసరం లేదని మాకు తెలుసు'



- కేఎస్ భరత్ (వికెట్ కీపర్)

క్రీడా బడ్జెట్ రూ. 3,400 కోట్లు

నిరుటి కంటే రూ. 45 కోట్లు అధికం

న్యూఢిల్లీ: కేంద్ర మధ్యంతర బడ్జెట్‌లో క్రీడా శాఖకు రూ. 3,442.32 కోట్లు కేటాయించారు. గత ఏడాది కంటే ఇది రూ. 45.36 కోట్లు ఎక్కువ కావడం విశేషం. గత బడ్జెట్‌లో సవరించిన అంచనాల తర్వాత క్రీడా శాఖ బడ్జెట్ రూ. 3,396.96 కోట్లు కావడం గమనార్హం. ఈ సంవత్సరం జూలై-ఆగస్టులో జరగనున్న పారిస్ ఒలింపిక్స్‌పైనే క్రీడా శాఖ ప్రధానంగా దృష్టి సారించింది. క్రీడా శాఖ ప్రధాన ఈవెంట్ ఖేలో ఇండియాకు గత బడ్జెట్ కంటే రూ. 20 కోట్లు ఎక్కువగా ఈసారి రూ. 900 కోట్లు కేటాయించారు. భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్)కు రూ. 822.60 కోట్లు కేటాయించారు. జాతీయ క్రీడా సమాఖ్యలకు రూ. 340 కోట్లు లభించనున్నాయి. కాగా..క్రీడాకారుల ప్రోత్సాహకానికి ఇచ్చే బడ్జెట్‌లో గణనీయంగా కోతపెట్టారు. గత బడ్జెట్‌లో ఈ విభాగానికి రూ. 84 కోట్లు ఇవ్వగా..ఈసారి రూ. 39 కోట్లకు కుదించారు.

కోహ్లీ.. కొడుకు లాంటోడు: చేతన్ శర్మ



న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీతో విభేదాల విషయంలో మాజీ చీఫ్ సెలెక్టర్ చేతన్ శర్మ యూటర్న్ తీసుకొన్నాడు. కోహ్లీ గురించి తాను తప్పుగా ఎందుకు మాట్లాడతానని, అతను తనకు కొడుకు లాంటివాడని అన్నాడు. విరాట్‌ను సెలెక్టర్లు ఇష్టపడడం లేదంటూ ఓ స్టింగ్ ఆపరేషన్‌లో చేతన్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఈ క్రమంలో శర్మ తన పదవికి కూడా రాజీనామా చేయాల్సి వచ్చింది.


జడ్డూ.. మూడో టెస్టుకూ కష్టమే!

న్యూఢిల్లీ: ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా మూడో టెస్టుకు కూడా దూరమయ్యే అవకాశం ఉంది. తొడ కండరాల గాయంతో జడేజా విశాఖ టెస్టు నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. సహజంగా ఈ గాయంతో బాధపడేవారు 4 నుంచి 8 వారాల పాటు విశ్రాంతి తీసుకుంటారు. దీంతో నాలుగో టెస్టు వరకు ఫిట్‌నెస్ సాధిస్తే విశేషమే. అలాగే జడ్డూతో పాటు విరాట్ కోహ్లీ కూడా రాజ్‌కోట్ టెస్టులో ఆడేది సందేహంగా మారింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శుక్రవారం 2 ఫిబ్రవరి 2024

నార్మ్‌లో పీజీడీఎం అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్



హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ఐకార్ - నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్)- 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది రెండేళ్ల వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఇందులో ఆరు ట్రైమెస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ఆరు నుంచి ఎనిమిది వారాల సమ్మర్ ఇంటర్న్‌షిప్, 12 వారాల బిజినెస్ బూట్ క్యాంప్, 13 వారాల ప్రాజెక్ట్ వర్క్ ఉంటాయి. ఇందులో మొత్తం 66 సీట్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

అర్హత: యూజీసీ గుర్తింపు పొందిన కళాశాల నుంచి అగ్రికల్చర్, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, కమర్షియల్ అగ్రికల్చర్, అగ్రికల్చరల్ మార్కెటింగ్ అండ్ కోఆపరేషన్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ, డెయిరీ సైన్స్/టెక్నాలజీ, ఫిషరీస్, ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్, ఫారెస్ట్రీ, హార్టికల్చర్, సెరికల్చర్, వెటర్నరీ సైన్స్, హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్, అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాలకు సంబంధించి ఒకదానిలో నాలుగేళ్ల డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకు ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదు శాతం సడలింపు వర్తిస్తుంది. క్యాట్ 2023/సీమ్యాట్ 2024 స్కోర్ తప్పనిసరి. సంబంధిత రంగంలో కనీసం ఆర్నెల్ల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

ఎంపిక: క్యాట్ 2023/సీమ్యాట్ 2024 స్కోర్ ఆధారంగా 1:5 నిష్పత్తిలో(ఒక సీటుకి అయిదుగురిని) అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూకి పిలుస్తారు. వీరికి అనలిటికల్ రైటింగ్ స్కిల్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. క్యాట్/సీమ్యాట్ స్కోర్‌కు 30 శాతం, అనలిటికల్ రైటింగ్ స్కిల్ టెస్ట్‌కు 10 శాతం, గ్రూప్ డిస్కషన్ స్కోర్‌కు 20 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 20 శాతం, అనుభవానికి 5 శాతం, అకడమిక్ ప్రతిభకు 10 శాతం, డైవర్సిటీ ఫ్యాక్టర్‌కు 5 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** naarm.org.in/

ఐఐఎం రోహ్‌తక్‌లో ఐపీఎం

రోహ్‌తక్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)- ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఐపీఎం)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది అయిదేళ్ల వ్యవధిగల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో రాణించాలనుకొనేవారికి ఈ ప్రోగ్రామ్ అనువుగా ఉంటుంది. ఐపీఎం ఆప్టిట్యూడ్ టెస్ట్(ఐపీఎం ఏటీ) 2024, పర్సనల్ ఇంటర్వ్యూ, అకడమిక్ ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. మొత్తం 165 సీట్లు ఉన్నాయి. మొదటి మూడేళ్ల తరవాత ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. వీరికి బీబీఏ(బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) డిగ్రీని ప్రదానం చేస్తారు. ప్రోగ్రామ్ మొత్తం పూర్తిచేసిన వారికి ఎంబీఏ డిగ్రీ ఇస్తారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ సౌకర్యం ఉంది.



ప్రోగ్రామ్ వివరాలు: ఈ ప్రోగ్రామ్‌లో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి దానిలో ఫౌండేషన్ కోర్సులు, రెండోదానిలో మేనేజ్‌మెంట్ కోర్సులు ఉంటాయి. ఏడాదికి మూడు చొప్పున మొత్తం 15 టర్మ్‌ల వారీగా కోర్సులు నిర్వహిస్తారు. ఒక్కో టర్మ్ వ్యవధి మూడు నెలలు. ఏటా నిర్దేశించిన మేరకు ఇంటర్న్‌షిప్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌లో మేథమెటిక్స్, ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్, హ్యూమానిటీస్ వంటి కోర్ కోర్సులతోపాటు బిజినెస్ కమ్యూనికేషన్, మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, బిజినెస్, ఫారిన్ లాంగ్వేజెస్ కోర్సులు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డ్ నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి, ఇంటర్ స్థాయుల్లో జనరల్ అభ్యర్థులకు ప్రథమ శ్రేణి మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 జూన్ 30 నాటికి 20 ఏళ్లు మించకూడదు.

ఐపీఎం ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఐపీఎం ఏటీ) 2024 వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్, వెర్బల్ ఎబిలిటీ అనే మూడు సెక్షన్‌లు ఉంటాయి. ఒక్కో సెక్షన్‌లో 40 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. సెక్షన్‌కు 40 నిమిషాలు చొప్పున మొత్తం పరీక్ష సమయం రెండు గంటలు.

ఎంపిక: ఐపీఎం ఏటీ 2024లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఇంటర్వ్యూలో అభ్యర్థుల అకడమిక్ ప్రతిభ, జనరల్ అవేర్‌నెస్, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితరాలను పరీక్షిస్తారు. ఐపీఎం ఆప్టిట్యూడ్ టెస్ట్ స్కోర్‌కు 45 శాతం, అకడమిక్ ప్రతిభకు 40 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూ స్కోర్‌కి 15 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఫిబ్రవరి 6 నుంచి
- **దరఖాస్తు ఫీజు:** రూ.4,500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 10
- **ఐపీఎం ఆప్టిట్యూడ్ టెస్ట్ 2024:** మే 18 నుంచి
- **వెబ్‌సైట్:** iimrohtak.ac.in

ఏఐఐఏలో ఆయుర్వేద డైటీషియన్ కోర్సు

న్యూఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద(ఏఐఐఏ)- 'ఆయుర్వేద డైటీషియన్ కోర్సు'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ఇందులో హీలింగ్ సైన్స్ ఆఫ్ ఆయుర్వేద సంబంధిత అంశాలు బోధిస్తారు. ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో బోధన ఉంటుంది. ఈ కోర్సులో 30 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, ఎంట్రెన్స్ ఎగ్జామ్/కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి అడ్మిషన్స్ ఇస్తారు. ఈ కోర్సు పూర్తిచేసినవారికి ఆయుర్వేదిక్ హాస్పిటల్స్, హెల్త్ రిసార్ట్స్, వెల్‌నెస్ సెంటర్లలో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఏఎంఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసి ఫలితాల కోసం చూస్తున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 25 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి.

ముఖ్య సమాచారం

- **అడ్మిషన్ ఫీజు:** రూ.5,000
- **ట్యూషన్ ఫీజు:** నెలకు రూ.1,000
- **కాషన్ డిపాజిట్:** రూ.5000
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.350; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **రిజిస్టర్డ్/స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 15
- **చిరునామా:** డైరెక్టర్, ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద(ఏఐఐఏ), గౌతమ్‌పురి, సరిత విహార్, మథుర రోడ్, న్యూఢిల్లీ-110076
- **వెబ్‌సైట్:** aiia.gov.in

నీలిట్‌లో స్మార్ట్ ల్యాబ్ కోర్సులు



కాలికట్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)కు చెందిన స్కిల్డ్ మ్యాన్‌పవర్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్(స్మార్ట్)ఫెసిలిటీ - అడ్వాన్స్‌డ్ వీఎల్‌ఎస్‌ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్‌కు సంబంధించి బిగినర్ లెవెల్ ప్రోగ్రామ్‌లను అందిస్తోంది. ఇవి స్కిల్డ్ ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌లు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి వారం. రోజుకు ఒక గంట చొప్పున అయిదు రోజులు థియరీ తరగతులు, ఒక రోజు ల్యాబ్ సెషన్ ఉంటాయి. కనీసం 60 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ప్రోగ్రామ్ చివరలో ఆన్‌లైన్ మోడ్‌లో ఎగ్జిట్ టెస్ట్ నిర్వహిస్తారు. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు.

ఎంబెడెడ్ ఫర్ బిగినర్స్: ఇందులో సీ-ప్రోగ్రామింగ్, ఎంబెడెడ్ హార్డ్‌వేర్ అంశాల్లో శిక్షణ ఇస్తారు. ఐడీఈ-ఎంబెడెడ్ హార్డ్‌వేర్ ప్రోగ్రామింగ్‌లో డెమో సెషన్ ఉంటుంది.

వీఎల్‌ఎస్‌ఐ ఫర్ బిగినర్స్: ఇందులో వీఎల్‌ఎస్‌ఐ, హార్డ్‌వేర్ డిస్క్రిప్షన్ లాంగ్వేజెస్(వెరిలాగ్), ఎఫ్‌పీజీఏ ఆర్కిటెక్చర్ అంశాలకు సంబంధించి తరగతులు ఉంటాయి. ఎఫ్‌పీజీఏ ప్రోగ్రామ్‌లో డెమో సెషన్ ఉంటుంది.

పైథాన్ ఫర్ బిగినర్స్: ఇందులో ఇన్‌పుట్/అవుట్‌పుట్, మ్యాథ్ ఆపరేషన్స్, కంట్రోల్ ఫ్లో, లూప్స్, లిస్ట్స్, 2డీ గ్రాఫిక్స్ వంటి కోర్ స్కిల్స్‌లో శిక్షణ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్‌లో మాత్రం రోజుకు రెండు గంటలు సెషన్స్ ఉంటాయి.

ఇంట్రడక్షన్ టు మ్యాట్‌లాబ్ & సిములింక్: ఇందులో ఇంట్రడక్షన్ టు మ్యాట్‌లాబ్, బేసిక్ మ్యాట్‌లాబ్ ప్రోగ్రామింగ్ స్కిల్స్, ఇంట్రడక్షన్ టు సిములింక్ సంబంధిత అంశాల్లో తరగతులు ఉంటాయి.

- **అర్హత:** తొమ్మిదోతరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు సహా ఆసక్తిగలవారందరూ అప్లయ్ చేసుకోవచ్చు.
- కోర్సు ఫీజు లేదు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 8
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఫిబ్రవరి 9 నుంచి
- **వెబ్‌సైట్:** nielit.gov.in

జాబ్ కార్నర్

ఫోర్త్ పారడైమ్ ఇన్‌స్టిట్యూట్‌లో టెక్నికల్ పోస్టులు

బెంగళూరులోని సీఎస్ఐఆర్‌కు చెందిన ఫోర్త్ పారడైమ్ ఇన్‌స్టిట్యూట్(సీఎస్ఐఆర్-4పీఐ)... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 17

అర్హత: పోస్టును అనుసరించి పది, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్), బీసీఏ ఉత్తీర్ణత, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: డ్రైవర్ పోస్టుకు 27 ఏళ్లు; మిగిలిన పోస్టులకు 28 ఏళ్లు మించకూడదు

జీతభత్యాలు: నెలకు టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.73,734. టెక్నీషియన్/డ్రైవర్ పోస్టులకు రూ.40,466.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ట్రేడ్/స్కిల్ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

చివరి తేదీ: ఫిబ్రవరి 29

వెబ్‌సైట్: https://csir4pi.res.in/



టీఆర్‌టీసీ, గువాహటిలో అప్రెంటిస్‌షిప్ శిక్షణ

గువాహటిలోని ఎంఎస్ఎంఈ- టూల్ రూమ్ అండ్ ట్రెయినింగ్ సెంటర్...ఏడాది అప్రెంటిస్‌షిప్ శిక్షణలో ప్రవేశాలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

మొత్తం ఖాళీలు: 26

విభాగాలు: మెకానికల్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్.

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ, బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.

స్టయిపెండ్: నెలకు బీఈ, బీటెక్ అప్రెంటిస్‌కు రూ.12,000. డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.10,000.

ఇంటర్వ్యూ తేదీ: ఫిబ్రవరి 10

వేదిక: టూల్ రూమ్ అండ్ ట్రెయినింగ్ సెంటర్, గువాహటి, అమిన్‌గావ్ ఇండస్ట్రియల్ ఏరియా, నార్త్ గువాహటి రోడ్, గువాహటి.

వెబ్‌సైట్: https://trtcguwahati.org/

మంచిర్యాల జిల్లాలో సివిల్ అసిస్టెంట్ సర్జన్స్

మంచిర్యాలలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్, సూపరింటెండెంట్ హెడ్ క్వార్టర్స్ హాస్పిటల్ ఆఫీస్ ...కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 5

పోస్టు: సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్

అర్హత: సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, పీజీ, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను సూపరింటెండెంట్ హెడ్ క్వార్టర్స్ హాస్పిటల్ ఆఫీస్, తెలంగాణ వైద్య విధాన పరిషత్, మంచిర్యాల చిరునామాకు పంపించాలి.

దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: ఫిబ్రవరి 3

వెబ్‌సైట్: mancherial.telangana.gov.in/

న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీలో అసిస్టెంట్‌లు

ముంబయిలోని న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్... దేశ వ్యాప్తంగా ఉన్న ఎన్ఐఏసీఎల్ శాఖల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 300 **పోస్టు:** అసిస్టెంట్

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి.

జీతభత్యాలు: నెలకు సుమారు రూ.37,000

వయోపరిమితి: 2024 జనవరి 1 నాటికి 21 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: ప్రాథమిక రాత పరీక్ష, ప్రధాన రాత పరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 15

వెబ్‌సైట్: www.newindia.co.in

ఎన్‌హెచ్ఏఐలో డిప్యూటీ మేనేజర్లు

న్యూఢిల్లీలోని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ)....డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టు:** డిప్యూటీ మేనేజర్ (టెక్నికల్)

ఖాళీలు: 60

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ/ఇన్‌స్టిట్యూట్ నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 30 ఏళ్లు మించకూడదు

పే స్కేల్: రూ.15,600 - రూ.39,100

ఎంపిక ప్రక్రియ: యూపీఎస్సీ 2023లో నిర్వహించిన ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్, పర్సనాలిటీ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 15

వెబ్‌సైట్: https://nhai.gov.in/

లిటిల్స్



అతి తెలివి కుక్క

ఒక ఊరిలో ఓ ఆశపోతు కుక్క ఉండేది. దానికి తెలివి ఉందని భ్రమపడేది. తనంత తెలివి తేటలు ఎవరికీ లేవని వాదించేది. అయితే ఎప్పుడూ తెలివి ఉండే పనులు చేసింది కాదు. అయితే తెలివి తనకు ఎక్కువని చెప్పుకునేది. 'తెలివిలేని కుక్క' అనేవి ఇతర జంతువులు. అయినా పట్టించుకునేది కాదు.

ఒక రోజు పొరుగూరుకు వెళ్తూ ఉంది. దారి మధ్యలో మంచి మాంసం ముక్క దొరికింది. ఎముకతో పాటు మంచి కండ ఉన్నది. దీంతో అదృష్టం తనదే అనుకుంది. వెంటనే మాంస ముక్క తీసుకుని దూరంగా అడవిలోకి వెళ్లి ప్రశాంతంగా తినాలనుకుంది. అయితే వెనక్కి మళ్లి తనుండే చోటు వైపు మళ్లి అడవిలోకి బయలుదేరింది. అడవిలో ఓ వంతెన ఉంది. అది కూడా ఒక పెద్ద కట్టె వంతెనలా ఉంది. దాని మీద నడుచుకుంటూ వెళ్తోంది. ఆ మాంస ఎప్పుడెప్పుడు తినాలా? అనే ఆశతో వెళ్తోంది.




వంతెన దాటుతూంటే దాని నీడ కనపడింది. ఇదేంటీ? దాని దగ్గర ఇంకో ముక్క ఉంది. అది కూడా తింటే బావుంటుందని ఆశపడింది. ఆ రెండు మాంసం ముక్కలు తనవే అని ఊహించింది. క్షణం పాటు ఆలోచించకుండా భౌ భౌ.. అంటూ గట్టిగా మొరిగింది. క్షణాల్లో దాని నోటిలో మాంసపు ముక్క ఎగిరిపడింది. అది కాస్త నీళ్లలో పడింది. దీంతో కిందకి చూస్తే అది కుక్క కాదని అర్థం అయింది. ఆ పాటికే దాని ముక్క ఇక దొరకదని అనుకుంది. తన ఆశకు ఇది జరగాల్సిందే అనుకుంది. వెంటనే తన దారిన వెళ్లిపోయింది.

సరైన నీడ ఏది?




దారి కనుక్కోండి



ఏవి ఎన్ని?



గడుల ఆధారంగా బొమ్మ గీయండి



డైలీ సుడోకు - 219

		8	2			6		7
		4	5	9	7		2	1
2			6		8			3
7	9	2	3					
					5	7	8	9
1			9		6			4
5	6		4	3	2	9		
4		9			1	5		

సుడోకు - 218 సమాధానం

2	4	9	1	5	6	3	7	8
7	6	1	8	3	4	9	2	5
5	8	3	2	9	7	1	6	4
1	2	4	6	8	9	5	3	7
3	7	8	5	1	2	4	9	6
9	5	6	4	7	3	2	8	1
4	3	5	9	6	8	7	1	2
8	9	2	7	4	1	6	5	3
6	1	7	3	2	5	8	4	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.